తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.APTEL / 2013 /50370

శనివారం 17.08.2024 | సంపుటి : 11 సంచిక : 38 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV



ఖేల్ ఖతం.. దుకాణం బంద్..

## భాజపాలో భారాస

# విలీనం ఖాయం

**ఆ వెంటనే కేసీఆర్‌కు గవర్నర్.. కేటీఆర్‌కు కేంద్రమంత్రి పదవి**

**హరీశ్ ప్రతిపక్ష నేత అవుతారు • సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేయడం తథ్యమని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు ఖండించినా.. అది ఎప్పటికీ జరుగి తీరుతుందని అన్నారు. విలీనం అయిన వెంటనే కేసీఆర్ కు గవర్నర్ పదవి, కేటీఆర్ కు కేంద్రమంత్రి పదవి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో హరీష్ రావు ప్రతిపక్ష నేత అవుతారని అన్నారు. విలీనం, పదవులు రాగానే.. కవితకు నాలుగు రాజ్యసభ సీట్లతో సమానంగా బెయిల్ వస్తుందని వెల్లడించారు. అదేవిధంగా బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీలు బీజేపీలో విలీనమయ్యే అవకాశం ఉందని రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఫుల్ బిజీ షెడ్యూల్ లో ఉన్నారు. ఈరోజు ఢిల్లీలో ఫాక్స్‌కాన్-యాపిల్ మ్యానుఫ్యాక్చరర్స్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన పెట్టుబడులే లక్ష్యంగా సాగిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి సొంత దేశంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఫాక్స్‌కాన్-యాపిల్ మాన్యుఫ్యాక్చరర్స్ కంపెనీ ప్రతినిధులతో భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి అధికార యంత్రాంగంలోని పెద్దలను కూడా కలిసే అవకాశం ఉందని తెలిపారు. ఇక కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ లు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశం అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ చర్చించనున్నారు. వరంగల్‌లో జరిగే రైతు

మిగతా 2లో..

ఫోర్త్‌సిటీపై రేవంత్

## విజన్ అద్భుతం

- సీఎంపై ఫాక్స్‌కాన్ ఛైర్మన్ ప్రశంసలు జల్లు
- త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తా
- ఇండస్ట్రీ, సర్వీస్ రంగాల్లో విస్తరించే సత్తా గల నగరం
- ముఖ్యమంత్రితో యంగ్ లియూ భేటి
- హైదరాబాద్‌లో పెట్టుబడులకు సానుకూలత

**ఢిల్లీ(జనంసాక్షి):** ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్లతో పాటు అన్ని రంగాల్లో విస్తరించే సత్తా హైదరాబాద్ నగరానికి ఉందని అంతర్జాతీయ దిగ్గజ పారిశ్రామిక సంస్థ ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ అన్నారు. త్వరలోనే తన బృందంతో కలిసి హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తానని

మిగతా 2లో..





## ఉద్యమసారధికి దక్కిన గౌరవం

- ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్ ప్రమాణం
- ప్రమాణం చేయించిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఆచార్య కోదండరాం, జర్నలిస్టు అమిర్ అలీఖాన్ ప్రమాణం చేశారు. మండలి సభ్యుల నియామకంపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధిస్తూ తీర్పును వెలువరించడంతో ఎట్టకేలకు సందిగ్ధం వీడింది. ఈ మేరకు టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, సియాసత్ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు జర్నలిస్ట్ అమిర్ అలీఖాన్ ఎమ్మెల్సీలుగా బాధ్యతలు స్వీకరించారు. మండలి ఛైర్మన్ ఛాంబర్‌లో గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎమ్మెల్సీ మహేశ్ కూమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. తాను ఎమ్మెల్సీ కావడంతో ఉద్యమకారులు సంతోషంగా ఉన్నారని ఆచార్య కోదండరాం అన్నారు. ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఎమ్మెల్సీగా అవకా శం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దీన్ని అదనపు బాధ్యతగా మాత్రమే భావిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షల మేరకు పని చేస్తానని అన్నారు. అనేక మంది బలిదానాలు చేయడం వల్లే తాము ఈ స్థానంలో ఉన్నట్లు గుర్తుచేసుకున్నారు."ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎజెండా మీదకు తీసుకురాగలిగాను. మండలిలో సభ్యులుగా కావడం చాలా సంతోషంగా ఉంది. బాధ్యతతో ఉద్యమకారుల, ప్రజల, అమరుల ఆకాంక్షల మేరకు పని చేస్తాను. అనేక మంది బలిదానాల వల్ల తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. తెలంగాణ రాష్ట్రం రావడం వల్లనే మాకు ఈ గుర్తింపు దక్కిందికాగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీల

మిగతా 2లో..

## ఉర్దూ జర్నలిజానికి అపూర్వ గౌరవం



సియాసత్ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు జర్నలిస్ట్ అమిర్ అలీఖాన్ ఎమ్మెల్సీలుగా బాధ్యతలు స్వీకరించారు. మండలి ఛైర్మన్ ఛాంబర్‌లో గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయనతో ప్రమాణం చేయించారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఉర్దూ జర్నలిజానికి దక్కిన అపూర్వ గౌరవంగా వారు అభిప్రాయపడుతున్నారు.



## ఇస్రో మరో ఘనత

**ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతం**

**శ్రీహరికోట(జనంసాక్షి):** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ.. ఇస్రో మరో ఘనత సాధించింది. శ్రీహరికోట షార్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇవాళ ఉదయం సరిగ్గా 9 గంటల 17 నిమిషాలకునిప్పులు చిమ్ముతూ అంతరిక్షంలోకి వెళ్లింది. 17 నిమిషాల పాటు సాగిన ఈ ప్రయోగం సక్సెస్ కావడంతో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కాగా.. 175 కిలోల ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు ఇస్రో ఛైర్మన్ ప్రకటించారు. పర్యావరణం, ప్రకృతి విపత్తులను పర్యవేక్షణ టార్గెట్ గా సైంటిస్టులు ఈ మిషన్ ను ప్రవేశపెట్టారు. ఈ ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ బరువు

మిగతా 2లో..

దిద్దుబాటు చర్య

## మనసు నొప్పించి ఉంటే మన్నించండి

**విచారం వ్యక్తం చేసిన కేటీఆర్ • మహిళలపై వ్యాఖ్యలు వెనక్కి**

**హైదరాబాద్(జనంసాక్షి):** కేటీఆర్ మహిళలపై తాను చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. తాను ఉద్దేశ పూర్వకంగా మహిళలపై అలాంటి కామెంట్స్ చేయలేదని..తనకు, తమ పార్టీకి మహిళలంటే ఎంతో గౌరవముందని అన్నారు. అనవసరంగా దీనిని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నా యని అన్నారు. కించపరిచే ఉద్దేశం లేదుఒక వేళ తాను చేసిన వ్యాఖ్యలకు ఎవరికైనా మనస్తాపం కలిగివుంటే క్షమించమని కోరుకుంటు న్నానని అన్నారు. తనకు అక్కచెల్లెళ్లను కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదని అన్నారు. కావాలనే కాంగ్రెస్



మంత్రులు దీనిని పెద్దగా చేసి రాజకీయం నడుపుతున్నారని అన్నారు. ఇలాంటి చీఫ్ ట్రిక్స్ వలన నష్టపోయేది కాంగ్రెస్ పార్టీయే అని అన్నారు. తమ ప్రభుత్వ

మిగతా 2లో..

## రుణమాఫీ జరగలేదు

**నిరూపిస్తే రాజకీయ సన్యాసానికి సిద్ధం: కేటీఆర్**

**హైదరాబాద్(జనంసాక్షి):** రుణమాఫీ పేరిట సీఎం రేవంత్ రెడ్డి మోసానికి తెరలేపారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రుణమాఫీ మొత్తం బోగస్ అని.. మిలియన్ డాలర్ల జోక్‌గా తేలిపోయిందని విమర్శించారు. అందుకే దాని నుంచి అటెన్షన్ డైవర్షన్ చేయడానికే ఈ రకమైన విన్యాసాలు చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చెబుతున్న ఈ రుణమాఫీ..

మిగతా 2లో..

## జమ్మూకాశ్మీర్‌లో చిగురించనున్న ప్రజాస్వామ్యం

**మోగనున్న ఎన్నికల నగారా**

**జమ్ము-కశ్మీర్, హర్యానా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు**

**సెప్టెంబర్18 తొలిదశ, 25న రెండో దశ, అక్టోబర్1న మూడో దశ ఎన్నికలు**

**అక్టోబర్ 4న ఫలితాలు • మొత్తం 90 నియోజకవర్గాలకు ఎన్నికలు • ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జమ్ము-కశ్మీర్‌తో పాటు హర్యానా రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. పలు దశల్లో సమీక్షల అనంతరం కశ్మీంలో ఎన్నికలకు ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని పార్టీల అభిప్రాయాలు కూడా తీసుకున్నామని.. ఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. సెప్టెంబర్18న తొలిదశ, 25న రెండో దశ, అక్టోబర్1న మూడో దశ ఎన్నికలు జరుగుతాయి. ఫలితాలు అక్టోబర్4న వెలువడతాయి. మొత్తం 90 నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అటు హర్యానలోని 90 నియోజకవర్గాలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 1న సింగిల్‌ఫేజ్‌లో పోలింగ్ జరగనుంది. ఫలితాలు 4న

మిగతా 2లో..






తెలంగాణలో

## దంచి కొడుతున్న వానలు

- హైదరాబాద్‌లో కుంభవృష్టి.. హై అలర్ట్ ప్రకటన
- అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని హెచ్చరిక
- రాష్ట్రంలో ఐదు రోజులపాటు భారీ వర్షాలు..
- పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ మహానగరంలో భారీ వర్షా లు కురుస్తున్నాయి. గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, లింగంపల్లి, చందానగర్, మియాపూర్, అల్విన్ కాలనీ, చందానగర్, పటాన్ చెరు, అమీన్‌పూర్, ఇస్నా పూర్, బీరంగూడ, బీహెచ్‌ఈఎల్, హైటెక్ సిటీ, బంజా రాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ తదితర ప్రాంతాల్లో గురువారం వర్షాలు దంచికొట్టాయి. శుక్రవారం కూడా నగరంలోని చాలా ప్రాంతాల్లో సాయంత్రం నుంచి కుండపోత వర్షం పడింది కూకట్ పల్లి, మూసాపేట్, కేపీహెచ్‌బీ కాలనీ, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్‌లో భారీ వర్షం కురుస్తోందని.. పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, అమీర్‌పేట, వెంగళరావు నగర్, యూస ఫ్‌గూడ, ఐడీఏ బొల్లారం, గుమ్మడిదలలో అతి భారీ వర్షాలు పడుతున్నాయని జీహెచ్ఎంసీ అధికారులు తెలి పారు. రానున్న రెండు మూడు రోజులపాటు నగర వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది. దాంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అత్యవ సరమైతే తప్ప బయటకి రావద్దని అధికారులు సూచిస్తు న్నారు. భారీ వర్షాలతో చాదర్ ఘాట్, మలక్ పేటలలో వరద నీరు నిలిచింది. చాదర్ ఘాట్ నుంచి మలక్ పేట, దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఐటీ కారిడర్ ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ స్తంభించిందని పోలీసులు తెలిపారు. రాత్రి వరకు నిరం తరాయంగా వర్షం కురుస్తోందని, నగర పౌరులు

మిగతా 2లో..

## మిన్నంటిన వైద్యుల ఆందోళనలు

**దేశ వ్యాప్తంగా నిరసనల్లో పాల్గొన్న వైద్యులు, నర్సులు, మహిళా సంఘాలు**

- మమత రాజీనామా చేయాలంటూ బీజేపీ నిరసన
- ప్రభుత్వం, పోలీసుల తీరుపై కలకత్తా హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- ప్రభుత్వ యంత్రాంగం యొక్క వైఫల్యమంటూ వ్యాఖ్యలు
- హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం




**కోల్‌కతా(జనంసాక్షి):** కోల్‌కతా హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తోంది. వైద్యురాలి హత్యాచారం తర్వాత నెమ్మదిగా ఆందోళనలు సాగుతున్న తరుణంలో ఒక్కసారిగా అల్లరిమూకలు.. ఆస్పత్రిలోకి ప్రవేశించి ఆధారాలు చెరిపేందుకు ప్రయత్నించడంతో తాజాగా ఈ ఆందోళనలు మరింత ఉధృతం అయ్యాయి. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో వైద్యులు, నర్సులు, మహిళా సంఘాలు, రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. తాజాగా కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రి దగ్గర బీజేపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. సీజీఓ కాంప్లెక్స్ వెలుపల ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారుల్ని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు-బీజేపీ శ్రేణుల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. ఇదిలా ఉంటే కోల్‌కతా ఘటనకు నిరసనగా శనివారం ఉదయం 6 గంటల నుంచి దేశవ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో వైద్య సేవలను నిలిపివేయనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రకటించింది. ఎమర్జెనీ వైద్య సేవలకు మాత్రం మినహాయింపు ఉంటుందని తెలిపింది. అత్యవసర సేవలందించే క్యాజువాలిటీలు పని చేస్తాయని ప్రకటనలో పేర్కొంది. కోల్‌కతా వైద్యురాలి

మిగతా 2లో..

### గ్రూప్ - 1 మెయిన్స్ సమయంలో మార్పులు

వార్త 7లో

### కవిత బెయిల్‌కు.. భాజపాకి సంబంధం లేదు

కేంద్రమంత్రి బండి సంజయ్

వార్త 7లో

రాహుల్ పౌరసత్వంపై

### ఢిల్లీ హైకోర్టుకు సుబ్రహ్మణ్య స్వామి

రద్దు చేసేలా కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థన

వార్త 2లో

## ఎల్ఆర్ఎస్‌కు విధివిధానాలు ఖరారు

**2020 ఆగస్టు 26 కంటే ముందు రిజిష్టర్ చేసిన లేఅవుట్లకు మాత్రమే వర్తింపు**

**2020 అక్టోబరు 15లోపు స్వీకరించిన దరఖాస్తులనూ పరిగణలోకి..**

**నియమనిబంధనలు ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం**




**హైదరాబాద్(జనంసాక్షి):** 2020లో జారీ చేసిన జీవో 131, జీవో 135 ప్రకారం రాష్ట్రంలో అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నియమ నిబంధనలు జారీ చేసింది. 2020 ఆగస్టు 26 కంటే ముందు రిజిస్ట్రర్ చేసిన లేఅవుట్లకు మాత్రమే ఎల్ఆర్ఎస్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2020 అక్టోబరు 15వ తేదీలోపు స్వీకరించిన దరఖాస్తులనూ పరిగణనలోకి తీసుకుంటామని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. నియమ నిబంధనలు 2020లో విడుదల చేసినప్పటికీ ఈ ఏడాది జనవరిలో దరఖాస్తుల పరిశీలన మొదలైందని తెలిపారు. ఇప్పటి

మిగతా 2లో..

## ఎల్‌ఆర్‌ఎస్‌కు విధివిధానాలు ఖరారు

వరకు 4,28,832 దరఖాస్తులు ప్రాసెస్ చేసినట్టు చెప్పారు.ఎల్‌ఆర్‌ఎస్‌కు 60,213 దరఖాస్తులు ఆమోదం పొందగా.. రూ.96.60 కోట్లు వసూలైనట్టు వివరించారు. దాదాపు 75శాతం దరఖాస్తులకు సంబంధించి పూర్తి వివరాలు సమర్పించలేదన్నారు. "తగిన డాక్యుమెంట్లు లేవని దరఖాస్తుదారులకు ఇప్పటికే తెలియజేశాం. వాటిని అప్‌లోడ్ చేయడం కుదరకపోగా.. సకాలంలో ప్రాసెస్ చేయలేకపోయాం. డాక్యుమెంట్లు అందజేసేందుకు దరఖాస్తుదారులకు అవకాశం కల్పించాం. సేల్ డీడ్, ఈసీ, మార్కెట్ విలువ సర్టిఫికెట్, లేఅవుట్ కాపీలను అప్‌లోడ్ చేయవచ్చు" అని పురపాలకశాఖ ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. దరఖాస్తుదారులు తమ మొబైల్ నంబర్, చిరునామా ఇతర వివరాలను మొబైల్ నెంబర్ ఓటీపీ ఉపయోగించుకుని సవరించుకోవచ్చన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగరాభివృద్ధి సంస్థలు, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారులకు సందేహాలుంటే హెల్ప్‌డెస్కులను సందర్శించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

## రాహుల్ పౌరసత్వంపై ఢిల్లీ హైకోర్టుకు సుబ్రహ్మణ్య స్వామి

**ఢిల్లీ(జనంసాక్షి):**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పౌరసత్వం విషయంలో భాజపా సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని ఆయన పౌరసత్వాన్ని రద్దు చేసేలా కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇదే విషయమై తాను గతంలో చేసిన ఫిర్యాదు స్థితిని తెలియజేసేలా హోంశాఖకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. సుబ్రహ్మణ్య స్వామి తరపున అడ్వొకేట్ సత్యా సబర్వాల్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. వచ్చే వారం ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది.లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ బ్రిటిష్ పౌరుడని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. యూకేలో రిజిస్టరైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా గాంధీ పేర్కొన్నట్లు సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. ఇదే విషయమై 2019లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఆయన లేఖ రాశారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందని తన లేఖలో ప్రస్తావించారు. అలా కలిగి ఉంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరచట్టం,1955ని ఉల్లంఘించడమే అవుతుందని,దీనిపై పలుమార్లు హోంమంత్రిత్వ శాఖకు లేఖలు రాసినా ఫలితం లేదని పేర్కొన్నారు.

## తెలంగాణలో దంచి కొడుతున్న వానలు

– రాష్ట్రంలో ఐదు రోజులు భారీ వర్షాలు.. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ!

రాష్ట్రంలో ఐదు రోజులు భారీ వర్షాలు.. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ! అప్ర మత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూ చించారు. నగరంలో హై అలర్ట్ జారీచేశారు. అత్యవస రమైతేనే బయటకు రావాలని హెచ్చరించారు.ఏదైనా అనుకోని విపత్తు సంభవిస్తే వెంటనే 040-21111111, 9000113667 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కాగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శుక్ర, శనివారాల్లో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. గంటకు 30-40కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.శుక్రవారం నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# ఫోర్త్‌సిటీపై రేవంత్ విజన్ అద్భుతం



ఆయన తెలిపారు. ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ నేతృత్వంలోని ఫాక్స్ కాన్ ప్రతినిధి బృందం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన అధికారిక నివాసంలో శుక్రవారం ఉదయం సమావేశమైంది. హైదరాబాద్ నగరానికి ఉన్న చరిత్ర.. పారిశ్రామిక సంస్థల విస్తరణకు ఉన్న అనుకూలత, అద్భుతమైన వాతావరణ పరిస్థితులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫాక్స్ కాన్ బృందానికి వివరించారు. 430 ఏళ్ల కింద పునాది రాయి పడిన హైదరాబాద్ కాలక్రమంలో మూడు నగరాలుగా అభివృద్ధి చెందిన తీరును ముఖ్యమంత్రి తెలియజేశారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక అభివృద్ధిలో వైరుధ్యాలు లేకపోవడంతోనే హైదరాబాద్ వేగంగా పురోగతి చెందుతోందన్నారు.. ఆ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్లు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఫోర్త్ సిటీలో విద్యా, వైద్యం, క్రీడా, ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇలా బహుముఖంగా అభివృద్ధి చేయనున్నామని చెప్పారు.

ప్రస్తుత ప్రపంచానికి అవసరమైన స్కిల్స్‌ను యువతకు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్ మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామ న్నారు. నవ తరం పరిశ్రమల అవసరాలు, వాటికి అవసరమైన నైపుణ్యాలు, భవిష్యత్తులో ఆయా పరిశ్రమల అవసరాలు తీర్చే మానవ వనరులను అందించేందుకు అవసరమైన సిలబస్ రూపకల్పనలో ప్రముఖ పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే స్కిల్ యూనివర్సిటీకి ఆనంద్ మహేంద్రను ఛైర్మన్‌గా, మరో పారిశ్రామిక వేత్త శ్రీనివాస రాజును వైస్ ఛైర్మన్‌గా నియమించామని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్)తో పాటు హైదరాబాద్‌కు ఉన్న అన్ని అనుకూలతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి వివరించారు. ఫోర్త్ సిటీలో ఫాక్స్ కాన్ సంస్థ పరిశ్రమలు పెట్టేందుకు అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వడంతో పాటు అవసరమైన మద్దతు అందజేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూకి హామీ ఇచ్చారు. ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ బృందం అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించి దిగ్గజ పారిశ్రామిక సంస్థలతో జరిపిన చర్చలు, చేసుకున్న ఒప్పందాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఛైర్మన్ యాంగ్ లియూకి వివరించారు. ఫోర్త్ సిటీ రూపకల్పనలో ముఖ్యమంత్రి దార్శనికత, పారిశ్రామిక అనుకూల విధానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ అన్నారు. ఫోర్త్ సిటీతో పాటు పారిశ్రామిక అనుకూల విధానాల్లో మీ విజన్ అద్భుతంగా ఉందంటూ యాంగ్ లియూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. తాను సాధ్యమైనంత త్వరలోనే హైదరాబాద్ ను సందర్శిస్తానని తెలిపారు. అంతకుముందే తమ చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్ సంస్థ భారత దేశ ప్రతినిధి వీ లీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్ వస్తుందని ఆయన చెప్పారు. భేటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) జయేష్ రంజన్, ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ ఎక్సటర్నల్ ఎంగేజ్‌మెంట్), ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ డాక్టర్ ఎస్కే శర్మ, ఫాక్స్ కాన్ నుంచి సంస్థ ఎస్బీజీ ప్రెసిడెంట్ బాబ్ చెన్ సీబీజీ జీఎం జొ వూ చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్ సీఎస్‌బీజీ డిప్యూటీ జీఎం సూ, షా కూ సీ-గ్రూప్ మేనేజర్ సైమన్ సంగ్ సంస్థ భారత దేశ ప్రతినిధి వీ లీ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో భారాస విలీనం ఖాయం

కృతజ్ఞత సభకు రాహుల్ గాంధీని సీఎం ఆహ్వానించనున్నారు. రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సోనియాను ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రెండు మూడు రోజుల పాటు సీఎం రేవంత్ ఢిల్లీలోనే ఉండనున్నారు.

## మనసు నొప్పించి ఉంటే మన్నించండి

హయాంలో మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చామని అన్నా రు. పెద్ద మనసుతో తెలంగాణ మహిళలు అర్థం చేసుకుంటారని..ఆ నమ్మకం తనకు ఉందని కేటీఆర్ అంటున్నారు. కాగా కేటీఆర్ మహిళలపై చేసిన కా మెంట్స్ తీవ్ర దుమారం రేపుతున్నాయి. చివరకు ఆయన దిష్టిబొమ్మలను తగులబెట్టే దాకా వెళ్లింది. మహిళా సంఘాలు కూడా తీవ్రంగా మండిపడుతున్నాయి. ఆర్టీసీ బస్సులలో తెలంగాణ మహిళలు కుట్లు, అల్లికలు, నిత్యావసరాలు అమ్ముకుంటే తప్పేమిటని కాంగ్రెస్ మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ అవన్నీ అమ్ముకుంటే ఫర్వాలేదు..వాళ్లు ఎలాంటి బ్రేక్ డ్యాన్సులు చేసినా ఫర్వాలేదు..కానీ బస్సుల్లో టిక్కెట్ కొనుక్కుని సీట్లు దొరకక అల్లాడుతున్న జనాలను పట్టించుకోవడం లేదని అన్నారు. తాను కేవలం బస్సుల సంఖ్యను పెంచాలనే ఉద్దేశ్యంతో ఈ వ్యాఖ్యలు చేశానని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ మహిళా కమిషన్ కేటీఆర్ వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుంది.తక్షణమే విచారణ జరిపించాలని మహిళా కమిషన్ ను ఆదేశించింది. దీనిపై మంత్రి సీతక్క సైతం కేటీఆర్ పై ఘాటుగానే స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోందని ..అది చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక పోలున్నారని కేటీఆర్ పై రివర్స్ కౌంటర్ ఇచ్చారు.

## జమ్మూకాశ్మీర్‌లో చిగురించనున్న ప్రజాస్వామ్యం

వెలువడతాయి. అక్టోబర్6 వరకూ రాష్ట్రంలో కోడ్ కొనసాగుతుంది. కాగా జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఇదే తొలి అసెంబ్లీ ఎన్నికలు. ఆగస్టు 9న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తన బృందంతో జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించారు. వీలైనంత త్వరగా ఇక్కడ ఎన్నికలు నిర్వహించేందుకు కమిషన్ కట్టుబడి ఉందని చెప్పారు. 2024 సెప్టెంబర్ 30లోగా జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. వీలైనంత త్వరగా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని, అక్కడ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎన్నికల సంఘం ప్రకారం.. ఉత్తర కాశ్మీర్‌లోని జిల్లాల్లో చాలా సవాళ్లు ఉన్నాయి. ఇక్కడ చాలా ప్రాంతాలు సున్నితమైనవిగా పరిగణించబడుతున్నాయి. ఉత్తర కాశ్మీర్‌లో అనంత్‌నాగ్, బారాముల్లా, బుద్గాం, బందిపూర్, గందర్‌బల్, కుప్వారా, కుల్గాం, పుల్వామా, షోపియాన్, శ్రీనగర్ జిల్లాలు సున్నిత జిల్లాలుగా పరిగణించబడగా, దక్షిణ కాశ్మీర్‌లో కథువా, సాంబా, రియాసి, జమ్మూ, ఉధంపూర్ వంటి జిల్లాలు సున్నిత జిల్లాలుగా పరిగణించబడ్డాయి.జమ్మూ కాశ్మీర్‌లో ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించవచ్చని వర్గాల సమాచారం. జమ్మూకశ్మీర్‌లో చివరిసారిగా 2014లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఏడాది కూడా ఐదు దశల్లో ఎన్నికలు జరిగాయి. బీజేపీ, పీడీపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మెహబూబా ముఫ్తీ రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. అయితే 2018లో సార్వత్రిక ఎన్నికలకు ముందు భాజపా కూటమిని విచ్ఛిన్నం చేయడంతో మెహబూబా ముఫ్తీ ప్రభుత్వం పడిపోయింది. ఆ తర్వాత 2019లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి కానీ అసెంబ్లీకి ఎన్నికలు జరగలేదు.జమ్మూ కాశ్మీర్‌లో డీలిమిటేషన్ తర్వాత, అసెంబ్లీలో మొత్తం సీట్లు 114 సీట్లకు పెరిగాయి. వాటిలో 24 సీట్లు పీవోకే పరిధిలోకి వస్తాయి. మిగిలిన 90 సీట్లలో 43 సీట్లు జమ్మూ డివిజన్‌లో, 47 సీట్లు కాశ్మీర్ డివిజన్‌లో ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 87 స్థానాలకు పోలింగ్ జరిగింది. పీడీపీకి అత్యధికంగా 28 సీట్లు వచ్చాయి. దీంతో పాటు బీజేపీకి 25, నేషనల్ కాన్ఫరెన్స్‌కు 15, కాంగ్రెస్‌కు 12 సీట్లు వచ్చాయి. మూడు స్థానాలు ఇండిపెండెంట్లకు, 4 ఇతరులకు దక్కాయి. హర్యానాలోని 90 స్థానాలకు ఒకే దశలో ఎన్నికలు నిర్వహించవచ్చు. ప్రస్తుతం ఇక్కడ బీజేపీ ప్రభుత్వం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 40 సీట్లు గెలుచుకుంది. మనోహర్ లాల్ ఖట్టర్ సీఎం అయ్యారు. ఎంపీ అయిన తర్వాత నాయబ్ సింగ్ సైనీ ఇక్కడ సీఎంగా ఉన్నారు. మరోవైపు మహారాష్ట్రలో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడి 288 స్థానాలకు ఎప్పుడు ఓటింగ్ జరగనుందో తర్వాత తెలుస్తుంది.

## ఇస్రో మరో ఘనత

119 టన్నులు, ఎత్తు 34 మీటర్లు, వెడల్పు 2 మీటర్లుగా ఉన్నాయి. భూ ఉపరితలం నుంచి 475 కిలోమీటర్ల ఎత్తున శాటిలైట్‌ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేలా డిజైన్ చేశారు. ఈవోఎస్-08 శాటిలైట్ బరువు 175.5 కిలోలు. ఇక ఈ శాటిలైట్‌లో మూడు పే లోడ్స్‌ని ఇస్రో శాస్త్రవేత్తలు అమర్చారు. అవి ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ , పేలోడ్ మిడ్-వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లు.. ఇవి భూమికి సంబంధించిన చిత్రాలను క్యాప్చర్ చేస్తుంది. అలాగే ఇవి తీసిన పిక్స్ ని పరిశీలించి వాతావరణం పరిస్థితులు, విపత్తులపై అధ్యయనం నిర్వహిస్తారు. ఈ ఉపగ్రహం ఏడాది పాటు సేవలను అందజేయనుంది. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో తెలిపింది. అంతేకాదు, ఇది ప్రాజెక్ట్‌కు అవకాశాలను తీసుకొస్తుందని, సరికొత్త మిషన్లకు శ్రీకారం చుడుతుందని ఇస్రో చెబుతోంది. పీఎస్ఎల్వీ ప్రయోగాలకు ఎక్కు సమయం, ఖర్చు కూడా అధికమే. కానీ, ఎస్ఎస్ఎల్వీ చాలా ప్రత్యేకమైనది. తక్కువ ఖర్చు, సమయం, పరిమిత మానవవనరుల సాయంతో కేవలం 72 గంటల వ్యవధిలో ప్రయోగానికి సిద్ధం చేయవచ్చు. ఇది ఇస్రో వాణిజ్య ప్రయోగాలను మరింత రెట్టింపు చేయగలదని భావిస్తున్నారు. దీనివల్ల ప్రపంచ అంతరిక్ష వాణిజ్యంలో ఇండియా వాటా పెరుగుదలకు తోడ్పడుతుంది. కాగా, 2022లో తొలిసారిగా నిర్వహించిన ఎస్ఎస్ఎల్వీ ప్రయోగం విఫలమైంది. ఈ నేపథ్యంలో ఈ సమస్యల తెలుసుకొని 2023లో మరో ప్రయోగం నిర్వహించి సక్సెస్ అయింది.

# మిన్నంటిన వైద్యుల ఆందోళనలు

హత్యాచార ఘటన భారతీయుల్ని తీవ్రంగా కలిచివేస్తోంది. ఆమె హత్యాచారానికి గురైన తీరు గుండెల్ని పిండేస్తోంది. అత్యంత క్రూరంగా ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లుగా పోస్టుమార్టం రిపోర్టు తేటతెల్లం చేస్తోంది. బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించినట్లుగా కూడా అర్థమవుతోంది. ఆమె చాలా ఘోరంగా హింసకు గురైనట్లుగా ఘటనాస్థలిని బట్టి స్పష్టమవుతోంది. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం విచారణ తాత్సారం చేయడంతో కోల్‌కతా హైకోర్టు జోక్యం పుచ్చుకుని సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఇక దర్యాప్తు బృందం.. సంఘటనాస్థలిని పరిశీలించి వెళ్లిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే అల్లరిమూకలు ఆర్‌జీ కర్ ఆస్పత్రిలోకి ప్రవేశించి ఆధారాలు చెరిపేసే ప్రయత్నం చేశారు. కాగా ఈ కేసులో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, ఘటన జరిగిన ఆర్‌జీ కర్ ఆస్పత్రి యాజమాన్యం, పోలీసుల తీరుపై కలకత్తా హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కోల్‌కతా పోలీసుల వైఫల్యంతో ఈ కేసును ఇప్పటికే సీబీఐకి అప్పగించింది హైకోర్టు. ప్రభుత్వ యాజమాన్యంలో మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ఆగస్టు 9న లేడీ డాక్టర్ దారుణంగా హత్యకు గురైంది. నైట్ డ్యూటీలో ఉన్న ఆమెపై అత్యాచారం చేసి, చంపేశారు. శుక్రవారం తెల్లవారుజామున కాలేజీ సెమినార్ హాలులో ఆమె మృతదేహం నగ్నంగా కనిపించింది. ఈ కేసులో సంజయ్ రాయ్ అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే, పోస్టుమార్టం నివేదికలో ఆమె శరీరంలో 150 మిల్లీగ్రాముల వీర్యం దొరకడంతో ఇది సామూహిక అత్యాచారంగా బాధితురాలి తల్లిదండ్రులు హైకోర్టుకి తెలిపారు. ఇదిలా ఉంటే, గురువారం "రిక్లెయిమ్ ది నైట్" పేరుతో బాధితురాలికి న్యాయం జరగాలని వైద్యులు, మహిళలు పెద్ద ఎత్తున ఆస్పత్రి ముందు నిరసన తెలిపిన సమయంలో, ఓ గుంపు ఆస్పత్రికలోకి ప్రవేశించి విధ్వంసానికి పాల్పడింది. సాక్ష్యాలను నాశనం చేయాలనే ఉద్దేశంలో ఇలా వ్యవహరించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నారు. తాజాగా ఈ విధ్వంసంపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. "ప్రభుత్వ యంత్రాంగం యొక్క సంపూర్ణ వైఫల్యం" విధ్వంసానికి దారితీసిందని చెప్పింది. రాష్ట్ర పోలీసుల వైద్య సదుపాయాలను, అక్కడ పనిచేస్తున్న వైద్యుల్ని రక్షించలేకపోతే దానిని మూసేయాలంటూ బెంగాల్ ప్రభుత్వంపై విరుచుకుపడింది. ముందస్తు ప్రణాళికతో జరిగిన విధ్వంసంపై మధ్యంతర నివేదిక సమర్పించాలని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. విధ్వంసం గురించి రాష్ట్రం తరుపున కోర్టుకు విన్నవిస్తూ.. సుమారు 7000 మంది గుంపు వచ్చిందని, ఆ సంఖ్య అకాస్మత్తుగా పెరిగిందని, తమ దగ్గర వీడియోలు ఉన్నాయని, వారు బారికేడ్లు బద్దలు కొట్టారని, టియర్ గ్యాస్ ప్రయోగించామని, 15 మంది పోలీసులకు గాయాలయ్యాయని చెప్పింది. అయితే, వారి వాదనల్ని విన్న కోర్టు.. పోలీసులకు తెలియకుండా ఈ ఘటన జరిగిందని నమ్మడం చాలా కష్టమని వ్యాఖ్యానించింది. ఇంత అస్థిరమైన అంశంపై ప్రజా నిరసనలకు ఎందుకు అనుమతి ఇచ్చారో చెప్పాలని ప్రధాన న్యాయమూర్తి టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం డిమాండ్ చేసింది."సాధారణంగా పోలీసులకు ఇంటెలిజెన్స్ వింగ్ ఉంటుంది%"% హనుమాన్ జయంతి రోజున ఇలాంటివి జరిగాయి. 7,000 మంది గుమిగూడితే, పోలీసులకు తెలియదని నమ్మడం కష్టం." అని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన వాదనల్ని కోర్టు తీవ్రంగా ఖండించింది. మీరు చర్యలు తీసుకుంటున్నారా..? నివారణ చర్యలు ఏమిటి..? అని కోర్టు ప్రశ్నించింది. బాధితురాలి తరుపున వాదించిన సీనియర్ న్యాయవాది బికాష్ రంజన్ భట్టాచార్య, పోలీసులు నిరసనకారుల వెనక దాక్కున్నారు అని వాదించారు. విధ్వంసం నుంచి క్రైమ్ సీన్‌ని కాపాడలేకపోయారని పోలీసులపై ఆరోపించారు. విధ్వంసానికి పాల్పడిన 9 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. సంఘటనలకు సంబంధించి అన్ని విషయాలను సీబీఐకి ఇవ్వాలని కోల్‌కతా పోలీసులను కోర్టు ఆదేశించింది. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్య, అత్యాచారం కేసులో సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. కేసు విచారణలో జాప్యం జరగడంతో విచారణను సీబీఐకి అప్పగించింది.ఈ కేసును దర్యాప్తు చేస్తున్నప్పుడు, సీబీఐ ఆర్ జి కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్‌ను తన పరిధిలోనే ఉంచుకుంది. దర్యాప్తు సంస్థ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను కేసు విషయమై విచారించనుంది. కోల్‌కతా పోలీసుల విచారణలో సందీప్ ఘోష్ ప్రస్తావన కూడా వచ్చింది. మహిళా ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనపై యావత్ దేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటన పై దేశవ్యాప్తంగా ఆగ్రహం వెల్లువెత్తింది. ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు నిరసనలు జరుగుతున్నాయి. కేసును ఎలాగైనా ఛేదించేందుకు సిబిఐ యాక్షన్ మోడ్‌లో ఉంది. ఈ కేసులో ఇప్పటి వరకు 19 మందిని అరెస్టు చేశారు.

## గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షల సమయాల్లో మార్పులు

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల సమయంలో మార్పులు చేసినట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. తాజాగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్చినట్లు వెల్లడించింది. ఇది వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపామని, ఆ సమయాన్ని మార్చుతూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది. అక్టోబర్ 21 నుంచి అక్టోబర్ 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంది.



# ఉద్యమసారిధికి దక్కిన గౌరవం

నియామకంపై రాష్ట్ర హైకోర్టు ఈ ఏడాది మార్చి 7వ తేదీన ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు బుధవారం స్టే విధించింది. దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణలను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 జులైలో చేసిన సిఫార్సులను అప్పటి గవర్నర్ తమిళిసై రద్దు చేయడం జరిగింది. తర్వాత వచ్చిన కాంగ్రెస్ సర్కార్? ఈ ఏడాది జనవరిలో ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను ఆ ఎమ్మెల్సీ స్థానాల్లో నియమించడాన్ని హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీనిపై సుప్రీం ధర్మాసనం తాజాగా స్టే ఉత్తర్వులిచ్చింది. ఆ స్థానాల్లో కొత్తవారి భర్తీని నిలిపివేయాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని తోసిపుచ్చింది.

# రుణమాఫీ జరగలేదు

స్వతంత్ర భారత దేశంలోనే రైతులకు జరిగిన అతిపెద్ద మోసమని కేటీఆర్ మండిపడ్డారు. ఒక దారుణమైన దగా, ఒక మాయ అని అన్నారు. రైతన్నలతో క్రూరమైన పరిహాసం ఆడిందని కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. అడ్డగోలు ఆంక్షలు, అర్థం లేని షరతులు, కూతలు-కోతలతో రైతు రుణమాఫీ ఉందన్నారు. అన్నదాతలను కాంగ్రెస్ పార్టీ నిండా ముంచిందని అన్నారు. అర్హులైన రైతుల్లో సగం మందికి కూడా రుణమాఫీ జరగలేదని తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ కోసం 40వేల కోట్లు అవుతుందని రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారానికి ముందు చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒక సంవత్సరం నేను కడుపుగట్టుకుంటే ఈ డబ్బును అనాయసంగా కట్టేయొచ్చని రేవంత్ చెప్పిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఎన్నికలు అయిపోగానే మళ్లీ ఈ లెక్క మారింది.. 31వేల కోట్లతో రుణమాఫీ చేయాలని కేబినెట్ తీర్మానించిందని తెలంగాణ సీఎంవో జూలైలో ఒక ట్వీట్ చేసిందని తెలిపారు. రుణం తీసుకున్న ప్రతి ఒక్కరూ అర్హులే అని ఎన్నికల ముందు చెప్పారని.. ఇప్పుడు కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు. రుణమాఫీ లెక్కలు చూస్తే.. ఉద్యోగికి రుణమాఫీ కట్.. పెన్షనర్‌కు కట్.. ఇన్‌కం ట్యాక్స్ కట్టేటోళ్లకు కట్.. రేషన్ కార్డు లేకుంటే కట్ చేశారని కేటీఆర్ అన్నారు. ఇవన్నీ ఎన్నికల ముందు చెప్పలేదని అన్నారు. సీఎం అంటే నిజానికి చీఫ్ మినిస్టర్.. కానీ ఇప్పుడు కటింగ్ మాస్టర్‌లా పరిస్థితి అయిపోయిందని ఎద్దేవా చేశారు. 60 శాతం మందికి ఎగ్గొట్టి.. కేవలం 40 శాతం మందికి చేసి.. 100 శాతం రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్న మొట్ట మొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. ఇంతకుమించిన దగా, మోసం, రైతు ద్రోహం మరొకటి ఉండదని విమర్శించారు. సవాలక్ష కొర్రీలు, దిక్కుమాలిన ఆంక్షలతో మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను బ్యాంకులు, అధికారుల చుట్టూ పడిగాపులు గాచే పరిస్థితి తీసుకొచ్చారని అన్నారు. అంకెలు మార్చి.. రంకెలు వేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు. మార్పు మార్పు అని రైతులను ఏమార్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మొదటి మోసం.. లోక్‌సభ ఎన్నికలకు ముందు దేవుడి మీద ఒట్లు పెట్టి రెండో మోసం.. కేసీఆర్ మీద ద్వేషం.. సకలజనులకు మోసం.. అనేది ప్రభుత్వ పాలసీగా ఉందని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ మోసం, రెండు లక్షల ఉద్యోగాలు మోసం.. ఆడబిడ్డలకు నెలకు రూ.2500 మోసం, తులం బంగారం మోసం, విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు మోసం, 4వేల నిరుద్యోగ భృతి మోసం, జాబ్ క్యాలెండర్ మోసం, దళితులకు 12లక్షలు ఇస్తామన్న మోసం, ఆటో అన్నలకు ఏడాదికి 12 వేలు మోసం, రైతు కూలీలకు నెలకు వెయ్యి మోసం, కౌలు రైతులకు రైతు భరోసా మోసం.. మొత్తంగా చూస్తే రుణమాఫీనే అతిపెద్ద మోసం అని విమర్శించారు.రుణమాఫీకి ఎన్నికల ముందు చెప్పింది 40వేల కోట్లు, కేబినెట్ తీర్మానంలో చెప్పింది 31వేల కోట్లు, బడ్జెట్‌లో చెప్పింది 26వేల కోట్లు అని చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ ఆఖరకు నిన్నటివరకు జరిగిన రుణమాఫీ కేవలం 17,934 కోట్లు మాత్రమే అని తెలిపారు. 22,37,748 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని చెప్పారు. ఇన్ని కోతలు పెట్టి.. పంద్రాగస్టులోపు రుణమాఫీ చేస్తామని దేవుళ్ల మీద ఒట్లు పెట్టి.. చిల్లర మాటలు, చిల్లర కూతలు అని విమర్శించారు. ఇందులో కూడా ఎన్ని వస్తాయో, ఎన్ని ఖాతాల్లో పడతాయో, దానికి సంబంధించి ఎన్ని కటింగ్‌లు ఉంటాయో తెలియదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మొదటి దఫాలో ఒకటే టర్మ్‌లో 35 లక్షల మంది రైతులకు 17వేల కోట్ల రుణమాఫీ చేశామని కేటీఆర్ చెప్పారు. మొదటి టర్మ్‌లో లక్ష రూపాయల వరకే రుణమాఫీ చేస్తే.. 35 లక్షల మంది రైతులకు 17వేల కోట్ల రుణమాఫీ అయ్యిందని అన్నారు. ఇప్పుడు రెండు లక్షల రుణమాఫీకి కూడా 17,934 కోట్లు అవుతుందని ప్రశ్నించారు. ఈ ఒక్క లెక్కతో కాంగ్రెస్ రుణమాఫీ ఎంత దగానో, ఎన్ని లక్షల మందిని ముంచారో అర్థమవుతుందని అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు రుణమాఫీ చేసి, రైతుబంధు కూడా వేశామని చెప్పారు. మొత్తంగా చూస్తే.. 72వేల కోట్ల రైతుబంధును అకౌంట్లలో డిపాజిట్ చేశామని తెలిపారు. అదే సమయంలో దాదాపు 30వేల కోట్లు రుణమాఫీ చేశామని అన్నారు. అంటే రైతులకు రుణమాఫీ, రైతుబంధు రూపంలో లక్ష కోట్లు ఇచ్చామని స్పష్టం చేశారు. వానకాలానికి ఇవ్వాల్సిన రైతుభరోసా 11,400 కోట్లు ఎగ్గొట్టావ్ కదా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జూలైలో రైతుబంధు పడేదని.. ఇవాళ రైతుబంధు పడిందా? అని అడిగారు. రైతుబంధు ఇచ్చే సూచన కూడా కనిపించడం లేదని అన్నారు. మొన్న యాసంగిలో ఎకరానికి 7500 ఇవ్వలేదని.. అప్పుడు 4వేల కోట్లు ఎగ్గొట్టారని కేటీఆర్ విమర్శించారు. రైతుభరోసా కింద ఓవరాల్‌గా ఇవ్వాల్సిన 15వేల కోట్లలో అది ఇవ్వలేదు. రైతు రుణమాఫీ కింద 17వేలు ఇచ్చి ఫోజులు కొడుతున్నారని మండిపడ్డారు. రైతు రుణమాఫీ దగా, మోసం అని అన్నారు. రైతులను నమ్మించి తడి గుడ్డతో గొంతు కోసినవాడు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. పాత గోడకు కొత్త సున్నం వేసినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. నీ అడ్డమైన ఫీట్లు చూసి.. ఇన్ని రకాల మోసాలు చేయొచ్చా అని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వాళ్లు కూడా ఆగమవుతున్నారని అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ త్వరలోనే విలీనం అవుతుందని, ఆ వెంటనే కేసీఆర్ గవర్నర్, కేటీఆర్ కేంద్రమంత్రి కాబోతున్నారని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి తొందరలోనే అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడని వ్యంగ్యంగా మాట్లాడారు. హైదరాబాద్‌లోని తెలంగాణ

# హరిహరీ.. ఇదేం పని!

## జిల్లా పంచాయతీ కార్యాలయంలో కీచకుడు





- మహిళ ఉద్యోగినిలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న డిపిఓ
- కన్నీటి పర్యంతమవుతున్న ఉద్యోగులు
- కలెక్టర్ ను కలిసి తమ బాధ విన్నవించేందుకు సిద్ధం

**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): అధికారి వయసు సుమారు 59 సంవత్సరాలు.. ఆ కార్యాలయంలో తండ్రి స్థానంలో ఉండే పోస్టును ఆయన వెలగబెడుతున్నాడు.. అయితే 60లో 20 అన్న చందంగా ఆయన వెకిలి చేష్టలు జుగుప్సాకరంగా ఉన్నాయి.. మహిళా ఉద్యోగినిలపై ఆయన లైంగిక వేధింపులు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి.. కార్యాలయంలో ఉద్యోగ సంబంధ విషయాలే కాకుండా ఆ మహిళా ఉద్యోగుల వ్యక్తిగత జీవితం గురించి ప్రస్తావిస్తూ వారిపై తనకున్న కోరికను చెప్పకనే చెబుతున్నాడు.. ఆయన ఎంతగా బరితెగించాడంటే.. అది కార్యాలయం అని కూడా చూడకుండా వారిపై చేతులు వేస్తూ, తడుముతూ.. తన కామ కోరికలు తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు.. ఇంత చేస్తున్నా ఇదేమని ప్రశ్నించే నాధుడే కరవయ్యాడు..**

ఖమ్మంలోని సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవనంలో జిల్లా పంచాయతీ కార్యాలయం ఉంది. జిల్లా అధికారిగా పనిచేస్తున్న వ్యక్తి చేసే వెకిలి చేష్టలు అన్ని ఇన్ని కావు. ఆయన చేసే పనులు జుగుప్సాకారంగా ఉంటున్నాయి. ఆయన దాటికి మహిళా ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు కార్యాలయానికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. తనకు ఉన్న హొదాతో వారిని లైంగిక వేధింపులకు గురిచేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాడు.

### ఫైల్ ఏదైనా ఒక్కరే లోపలికి రావాలి

సహజంగా ఆ కార్యాలయంలో ప్రతి ఫైల్ ను జిల్లా అధికారికి ఏ.ఓ.తీసుకెళ్లి ఇస్తాడు. ఆ ఫైల్ పరిశీలించే సమయంలో ఏదైనా సందేహం వస్తే అధికారి కిందిస్థాయి సిబ్బంది తో మాట్లాడి సందేహాన్ని నివృత్తి చేసుకుంటాడు. ఇది ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా జరిగే సాధారణ ప్రక్రియ. అయితే ఖమ్మం జిల్లా పంచాయితీ అధికారి కార్యాలయంలో మాత్రం అందుకు భిన్నంగా పాలన సాగుతోంది. ముఖ్యంగా మహిళ ఉద్యోగులు ఎవరైనా తమ సెక్షన్ కు సంబంధించి ఫైల్ ను అధికారికి చూపించాలంటే ఆ మహిళా అధికారి నేరుగా వెళ్లాలి. ఆ సమయంలో వారి వెంట అటెండర్ కూడా లోపలికి రావడానికి అవకాశం ఇవ్వడు.

### లోపలికి వస్తే లైంగిక వేధింపులే..

ఫైల్ తీసుకొని తన ఛాంబర్‌లోకి వచ్చిన మహిళ ఉద్యోగుల పట్ల తన కామ కోరికలు తీర్చుకునేందుకు ప్రయత్నం చేస్తుంటాడు. ఏకంగా ఒక మహిళా ఉద్యోగి శరీరంపై చేయి వేసి దగ్గరకు లాక్కున్నాడు. ఈ సంఘటన గత రెండు రోజుల క్రితమే జరిగింది. దీంతో ఆ ఉద్యోగి ఏం చేయాలో పాలు పోక తన చేయి విదిలించుకుని అధికారి చాంబర్ నుండి బయటకు వచ్చి కన్నీటి పర్యంతమైంది. మరో ఉద్యోగిని వ్యక్తిగత జీవితంపై సెటైర్లు వేస్తూ తన కోరిక తీర్చాలి అనే విధంగా మాట్లాడుతూ మానసికంగా కృంగిపోయే విధంగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయంలో అధికారి తీరు పట్ల తీవ్రంగా మనస్థాపానికి గురైన మహిళా ఉద్యోగులు అందరూ కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ బాధను వివరించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారి హరి కిషన్ వివరణ కోసం చరవాణి లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# నిర్వాసితులకు ప్రభుత్వ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి

- వట్టెం రిజర్వాయర్ పనులను అడ్డుకున్న ఆర్ ఎన్ ఆర్ కాలనీ వాసులు
- తహసీల్దార్, ఎస్ఐల హామీతో నిరసన విరమించిన నిర్వాసితులు





**బిజినేపల్లి, అగస్టు 16 (జనంసాక్షి) :** పాలమూర్ రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న వట్టెం (వెంకటాద్రి) రిజర్వాయర్లో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. మండలంలోని వట్టెం రిజర్వాయర్ పనులు చేసున్న హెచ్ఈఎస్ కంపెనీ ముందు ఆర్ఎన్ఆర్ కాలనీవాసులు, భూములు కోల్పోయి పరిహారం అందని బాధితులు శుక్రవారం టెంట్ వేసి బైఠాయించి పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ ఎన్ అర్ కాలనీకి చెందిన ముడావత్ రామునాయక్ మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం కోసం అవసరమైన 4500 ఎకరాల భూమితో పాటు నివాస గృహాలను. దేవాలయాలను, తాత, ముత్తాతల సమాధులను సర్వం త్యాగం చేస్తే ప్రభుత్వం కాని, సంబంధిత గుత్తేదారులు కాని ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. అర్ ఎన్ ఆర్ కాలనీ నిర్మాణం కోసం ప్రభుత్వం 61.50 ఎకరాల భూమి కేటాయించింది. అందులో 466 నిర్వాసితులకు ఇండ్లు, పాఠశాల, గ్రామ పంచాయతీ, ప్రైమరీ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ వంటి మౌళిక వసుతల కల్పనతో పాటు దేవాలయాల నిర్మాణం కోసం 5 ఎకరాల భూమిని కేటాయించింది. కాలనీలో సీసీ రోడ్లు, విద్యుత్ లైన్ పనులు, అండర్ డ్రైనేజీ, వాటర్ లైన్ పనులు చేపట్టిన ఇప్పటి వరకు ఆలయాల నిర్మాణానికి ఎలాంటి ఆర్థిక సాయం అందజేయలేదని అన్నారు. ఈనెల 29న కనీసం అంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట చేసుకుందామని ఆలయ నిర్మాణం కోసం కేటాయించిన భూమిలో దిమ్మె ఏర్పాటు చేస్తుంటే గతంలో ఉన్న భూమి యజమానులు అడ్డుకుంటున్నారని తహసీల్దార్ జనుంపల్లి శ్రీరాములు, ఎస్ఐ నాగశేఖర్ రెడ్డిలకు వివరించారు. అక్కడే ఉన్న హెచ్ఎస్ జీఎం సుబ్రమణ్యం సమాధానం చెబుతూ ఆలయ నిర్మాణానికి ఒప్పుకున్న ఆర్థిక సాయాన్ని వచ్చే నెలలో ఆలయ కమిటి ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే వారం రోజుల్లో భూసర్వే చేసి బౌండరీ ఏర్పాటు చే వస్తామని తహసీల్దార్, ఎస్ఐలు నిర్వాసితులకు హామీ ఇవ్వడంతో తమ నిరసనను విరమించారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో తిరుపతి నాయక్, పాండు నాయక్, రాములు నాయక్. దాసు, భగవంతు, బాల్ రామ్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

# ముగ్గురికి ఫోటోగ్రఫీ బహుమతులు



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర సమాచార శాఖ వారు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీలలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుండి సీనియర్ ఫోటో జర్నలిస్టులు గోకారపు శ్యాం కుమార్, వీరగోని హరీష్, కుడుదల రమేష్ కు బహుమతి వచ్చినట్టు అధికారులు తెలిపారు. బహుమతి ప్రధానోత్సవం ఆగస్టు 19 ఉదయం 9 గంటలకు హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోబోతున్నారు.

# 27 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించాలి

- 35 శాతం లాభాల వాటా చెల్లించాలి
- రెండు గుంటల భూమి,20 లక్షల వడ్డీ లేని రుణాన్ని ఇవ్వాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**నస్పూర్, ఆగస్టు 16, (జనం సాక్షి):** సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 27 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు,వేజ్ బోర్డ్ శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు.శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి ఓపెన్ కాస్ట్ ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ద్వార సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం లాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణి సొమ్మును దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు.సింగరేణి యాజమాన్యం సంస్థ సొమ్ముని రాష్ట్ర ప్రభుత్వాలకు మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసం ఉపయోగించాలన్నారు.సింగరేణి కార్మికులకు రెండు గంటల భూమి,20 లక్షల రూపాయలు వడ్డీ లేని రుణాన్ని ఇవ్వాలన్నారు.గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల సింగరేణి సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని,కాబట్టి నూతన బొగ్గు బావులను ఏర్పాటు చేయాలన్నారు.ఒకే కుటుంబం ఒకే లక్ష్యం ఒకే గమ్యం అని చెప్పే సింగరేణి యాజమాన్యం పెరిక్స్ పై ఆదాయ పన్నును అధికారులకు యాజమాన్యమే తెలుస్తుందని, కార్మికులకు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు.ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి సంస్థకు వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి,లాభాల్లో 35 శాతం లాభాల వాటా చెల్లించాలని కోరారు.అనంతరం 20 మంది వివిధ సంఘాల నాయకులు,కార్మికులు ఏఐటీ యూసీలో చేరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య,శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.కె బాజీ సైదా,సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్,జీఎం చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య,కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామానికి రోడ్డు వేయాలని రాస్తారోకో

**భైంసా, ఆగస్టు 16 (జనంసాక్షి) :** బైంసా పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఖత్ గాం గ్రామా ప్రజలు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్న తమ గ్రామానికి రోడ్డు లేదని పలుసార్లు అధికారులకు నాయకులకు మొరపెట్టుకున్నా కూడా రోడ్డు సౌకర్యం కల్పించడం లేదని గ్రామస్తులు తెలిపారు. వర్షాకాలం వస్తే చాలు గ్రామంలో రోడ్లన్నీ బురదమైన మారుతాయని అలాగే విద్యార్థులు, గ్రామస్థులు పొరుగు గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి వస్తుందని బురదలో పడి గాయాలపాలై అయితున్నారని గ్రామస్థులు తెలుపుతున్నారు. వెంటనే గ్రామానికి రోడ్డు మరిమత్తులు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు.. సమాచారం తెలుసుకున్న పట్టణ సిఐ రాజారెడ్డి అక్కడికి చేరుకొని గ్రామస్తులను సముదాయించి రాస్తారోకోను విరమింపచేశారు.

# ఈనెల 25, 26న విద్యా సంస్థలకు సెలవులు

**హైదరాబాద్, ఆగస్ట్16 (జనంసాక్షి) :** ఆగస్టు 26వ తేదీన(సోమవారం) శ్రీ కృష్ణాష్టమి పండగ. ఈ రోజులు కూడా అన్ని స్కూల్స్ , కాలేజీలు సెలవులు ఉంటుంది. అలాగే ఆగస్టు 25వ తేదీన ఆదివారం. ఈ రోజు సాధారణంగా స్కూల్స్, కాలేజీలకు సెలవులు ఉన్న విషయం తెల్సిందే. దీంతో వరుసగా రెండు రోజులు పాటు స్కూల్స్, కాలేజీలకు, ఆఫీసులకు సెలవులు రానున్నాయి. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కొందరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరికొంతమంది మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బహుజన సంఘాల్లో తీవ్ర వ్యతిరేత వ్యక్తం అవుతోంది. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, రిజర్వేషన్ కేటగిరీలలో ఉపవర్గీకరణలను అనుమతిస్తూ ఈమధ్యే సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చింది. ఈ రెండు వర్గాల్లో ఉపవర్గీకరణ చేపట్టాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు నిరసనగా ఆగస్టు 21వ తేదీన (బుధవారం) భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఎస్సీ, ఎస్టీ వర్గకరణకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ కూడా వ్యతిరేకించారు. దీంతో దేశవ్యాప్తంగా ఆందోళనలను మొదలవుతున్నాయి. భీమ్ సేన, ట్రైబల్ ఆర్మీ చీఫ్ బంద్ పిలుపునకు పలు సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయి. ఈ తీర్పు ఎస్సీ, ఎస్టీల్లోని ఐక్యతను దెబ్బతీసే విధంగా ఉందని మండిపడుతున్నాయి. దీంతో ఆగస్టు 21వ తేదీ(బుధవారం) దేశంలోని అన్ని పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలు సెలవు ప్రకటించే అవకాశం ఉంది. దీంతో విద్యార్థులకు ఈ నెలలో అదనంగా మరో రోజు సెలవు జత కానుంది. దాదాపు 2024 ఆగస్టు నెలలో స్కూల్స్, కాలేజీలకు 10 రోజులు వరకు సెలవులు వస్తున్నాయి. ఇలా బంద్‌లు, భారీ వర్షాల, పండగల వల్ల స్కూల్స్, కాలేజీలకు ఎదో ఒక రూపంలో సెలవులు వస్తున్నాయి. ఇలా వరుసగా సెలవులు రావడం వల్ల స్కూల్స్, కాలేజీలు టీచర్లు సరైన సమయంలో విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైన ఇలా వరుసగా సెలవులు రావడంతో విద్యార్థులు మాత్రం పండగ చేసుకుంటున్నారు.

# ఇటుకల పహాడ్ రైతుల పోడు భూములకు హద్దుల గుర్తింపు

- పాల్గొన్న అటవీశాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు
- పోడు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలంలోని ఇటుకల పహాడ్ గ్రామ రైతులకు కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్( టి) మండలంలోని ఇటుకల పహాడ్ గ్రామాన్ని కలిసి సందర్శించారు. గత దశాబ్ద కాలంగా ఇటుకల పహాడ్ రైతులు పోడు భూముల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నోసార్లు అటవీశాఖ అధికారులు, పోలీసులు రైతులను భూములు సాగు చేసుకొని వ్వకుండా అడ్డుపడ్డారు. దీంతో గత రెండు సంవత్సరాల నుండి సిర్పూర్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ రావి శ్రీనివాస్ రైతులకు అండగా ఉండి ధైర్యం నింపి భూములు రైతులకు దక్కేల శ్రమించారు. గత సంవత్సరం 2023 లో డిసెంబర్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్కతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపించారు. శుక్రవారం అటవీశాఖ, రెవెన్యూ శాఖ, పోలీస్ అధికారులతో కలిసి గ్రామంలో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు రైతులు సాగు చేసుకుంటున్నా పోడు భూములకు అటవీ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులచే సంయుక్త సర్వేలు నిర్వహించి రైతుల భూములకు హద్దులు ఏర్పాటు చేయించారు. గ్రామంలోని ప్రతి రైతుకు 4 ఎకరాల భూమిని పంపిణీ చేయించారు. గతంలో కొమరం భీమ్ అద ప్రాజెక్టు నిర్మాణంతో భూముల కోల్పోయిన రైతులు ఈ ప్రాంతంలో వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. దశాబ్దాల కాలంగా రగులుతున్న సమస్యకు కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్చార్జి హాయ్ శ్రీనివాస్ పరిష్కారం చూపించారు. దీంతో పోడు రైతులు కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# నారాయణపేట జిల్లాలో చిరుత మృతి

**నారాయణపేట, ఆగస్ట్16 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా మద్దూరు మండలం జాదవరావు పల్లి గ్రామ సమీపంలోని తాటి గుట్టపై చిరుత పులి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దూరు మండలంలోని జాదరావుపల్లి తాటిగట్టు గుట్ట సమీపంలోని చెరువులో నీరు తాగడానికి వచ్చిన సమయంలో ఏదైనా జంతువు దాడి చేసి ఉండవచ్చు అని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు సంబంధించి స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు చిరుత మృతిపై విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ బోగస్

- మాజీ మంత్రి జోగు రామన్న



**ఆదిలాబాద్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ బోగస్ అని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆయన ఆదిలాబాద్‌లో మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. 59 లక్షల మంది రైతులు ఉంటే కేవలం 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని, రైతులకు దగా చేసిన సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు దగా, మోసం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలని, రాష్ట్ర మొత్తం మీద కేవలం 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు జోగు రామన్న. మిగతా రైతుల సంగతేంటో సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరిట ఒక సంవత్సరానికి 15 వేల కోట్ల రూపాయలను రైతులకు అందజేసిందని ఆయన వెల్లడించారు. భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా రైతులను ఇలా పచ్చిగా మోసం చేయలేదని ఆయన పేర్కొన్నారు.అంతేకాకుండా.. సీఎం రేవంత్ రెడ్డికి రైతులను మోసం చేసినందుకు నోబెల్ ప్రైజ్ ఇచ్చిన తక్కువే అని, ఇప్పటికే మొదటి విడత రెండో విడత రుణమాఫీ జరుగక వేలాదిమంది రైతులు బ్యాంకుల చుట్టూ కలెక్టర్ కార్యాలయం చుట్టూ వ్యవసాయ శాఖ కార్యాలయ చుట్టూ తిరుగుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఇక మూడో విడత రుణమాఫీ దేవుడెరుగు అని, రుణమాఫీ విషయంలో రైతులతో నేరుగా మాట్లాడే ధైర్యం సీఎం రేవంత్ రెడ్డికి మంత్రులకు ఉందా అని ఆయన ప్రశ్నించారు. దమ్ముంటే అదిలాబాదులో ఏ గ్రామానికి అయినా వచ్చి మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ పై రైతులతో చర్చించాలి. తప్పులు తడకగా రుణమాఫీలో రైతుల లిస్టు అని, అసలు కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు, ప్రభుత్వం, పని చేస్తుందా అన్న అనుమానం కలుగుతుందన్నారు. ఇచ్చిన హామీపై ఇచ్చిన మాట పై నిలబడని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై నోరు పారేసుకుని జనంలో నవ్వుల పాలవుతున్నారని జోగు రామన్న మండిపడ్డారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



**ఏటూరు నాగారం, ఆగస్టు 16(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లాలో ఈనెల 17,18 తేదీ లలో, జరగబోయే సీనియర్ రాష్ట్రస్థాయి పోటీలకు, ఏటూరు నాగారం మండల కేంద్రానికి చెందిన కరిష్మా జవాలిన్ త్రో, హామర్ త్రో విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని కోచ్ పర్వతాల కుమారస్వామి తెలిపారు. ఈనెల 04 తేదీన జాకారం గురు కుల పాఠశాల లో నిర్వహిం చిన జిల్లాస్థాయి పోటీలలో అత్యు త్తమ ప్రతిభ కనబరిచి ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు కరిష్మా ఎంపికైంది.

# ఉద్యమ సారథి ఇక ఎమ్మెల్సీ



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

**ఎన్నో ఉద్యమాల, పోరాటాల రథ సారధి ఇప్పుడు ఒక ప్రజా ప్రతినిధి. ఇప్పుడొక ఎమ్మెల్సీ. దశబ్దాలుగా నేల మీద జనంతో కలిసి పాలకులను ప్రశ్నించిన ఆ గొంతు ఇప్పుడు చట్ట సభకు వెళ్ళింది ఆయన ఎవరో కాదు, ఆ గొంతు ఎవరిదో కాదు, యావత్ తెలంగాణ ప్రేమించే మన కోదండరాం సర్‌ది.**

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సారథి ప్రొఫెసర్ కోదండరాం సార్ శుక్రవారం ఎమ్మెల్సిగా ప్రమాణ స్వీకారం చేసారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా, ప్రస్తుత మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నెన్నెల మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన ప్రొఫెసర్ కోదండరాం సర్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంతో మంది విద్యార్థులకు పాఠాలు నేర్పారు. నేడు న్యాయంవైపు నిలబడి పోరాడుతున్న ఎంతో మంది ఉద్యమకారులు, నాయకులు ఆయన తీర్చిదిద్దిన వారే కావడం విశేషం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో జేఏసీకి చైర్మెన్ గా ఉన్న సార్, ఎన్నోసార్లు అరెస్ట్ అయ్యారు. ట్యాంక్ బండ్ వద్ద దిగ్బంధం, ఎన్నో వంటావార్పు కార్యక్రమంలు ఆయన నాయకత్వంలోనే జరిగాయి. సకల జనుల సమ్మెకు నాయకత్వం వహించారు. సింగరేణి జేఏసీ ఛైర్మన్ గా నేను, నా సహచరులు, సింగరేణి కార్మిక సంఘాల నేతలు, కార్మికులు, నేతలు కోదండరాం నిర్దేశం మేరకు 35 రోజుల సింగరేణి కార్మికుల సమ్మె పోరాటం నిర్వహించాము. సింగరేణిలోనూ అరెస్టులు భారీగా జరిగాయి.

**నల్ల నేలలో కోదండరాం..**

తెలంగాణ ఉద్యమమే కాదు, సింగరేణిలో ఓపెన్ కాస్ట్ గనుల విధ్వసంకు కు వ్యతిరేకంగా జరిగిన పోరాటల్లో, యాత్రల్లో, ప్రైవేటికరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటల్లో, సేవ్ సింగరేణి పేరిట నడిచిన పోరాటల్లో కోదండరాం సర్, మానవ హక్కుల నేత డాక్టర్ కె.బాలాగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, మేమంతా కలిసి నడిచాము. అరెస్టులు జరిగాయి. అంతకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాత్రికి రాత్రి యువకులను కోల్ బెల్ట్ సహా, తెలంగాణ అంతట ఎత్తుకెళ్లి బూటకపు ఎన్కౌంటర్ ల పేరిట కాల్చి చంపిన సందర్భంగా కూడ బాలాగోపాల్ సర్ వెంట కోదండరాం వచ్చేవారు, వీరి వెంట నేను పలుమార్లు ఉన్నాను కాబట్టి ఈ విషయాలు నాకు తెలుసు!ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా తో కోదండరాం సర్‌కు మంచి అనుబంధం ఉన్నది. ఇప్పటికి మంచిర్యాల ప్రాంతానికి వస్తే మంచిర్యాల లో ఉన్న తన సామాన్యంగా ఉండే స్వంత ఇంటిలోనే ఒక్కడైనా ఉంటారు.



**అన్నీ ఉన్నా, అతి సామాన్యమైన జీవితం సార్‌ది**

తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం మీద కోదండరాంకు మంచి విజన్ ఉన్నది. అద్భుతమైన ఆలోచనా విధానం, అందరిలో ఎక్కడైనా కలిసిపోయే మనిషి ఆయన, సర్ ను నేను చాలా దగ్గర నుంచి చూసాను. ఉద్యమకారులంటే ఆయనకు అమితమైన గౌరవం ప్రేమ ఉంటుంది. ఒకరకంగా చెప్పాలంటే మాజీ సీఎం కేసీఆర్‌కు జయశంకర్ సర్ తర్వాత ఉద్యమంను మార్గదర్శనం చేయడానికి లభించిన ఒక మార్గదర్శి, హితుడుగా పేర్కొనవచ్చు. అలాంటి కోదండరాం సర్, తెలంగాణ సిద్దించిన తర్వాత, ప్రభుత్వం ఏర్పాటయ్యాక అసలు కోదండరాం అంటే ఎవరు? అనే కెసిఆర్ వరుస, ఒక కోదండరాంనే కాదు, ఎంతో మంది ఉద్యమ కారుల పట్ల వ్యవహారం కొనసాగింది. కోదండరాం సర్ ఇంటిపై దాడి, గృహ నిర్బంధం, అరెస్టల కాడికి పరిస్థితి వచ్చింది.

**తానా షాహిగిరికి అడ్డుకట్ట.. వేసాడు**

కేసీఆర్ తన తానాషాహీగిరికి అడ్డు అదుపు లేదు అనుకున్నారు. ఈ నేపథ్యంలో కోదండరాం సర్ తెలంగాణ జనసమితి పార్టీ పెట్టారు. ఎన్నికల్లో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకున్నారు. నెత్తిన ఎక్కించుకున్నవారు ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను నేలకు వేసి కొట్టారు. ప్రతిపక్షంలో కూర్చుండబెట్టారు.



కాంగ్రెస్ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ ప్రకారం కోదండరాం ఎమ్మెల్సీ పదవి ఇచ్చినట్లు అయ్యింది. సియాసత్ పత్రిక ఎడిటర్ జాయిడ్ అలీకి కూడ పదవి ఇచ్చారు. కోదండరాం సర్ కు, అమిర్ అలీ సాబ్ కు అభినందనలు. కోదండరాం సర్ మీద సింగరేణి కార్మికులు, తెలంగాన మొత్తంగా ప్రజలకు చాలా నమ్మకాలూ ఉన్నాయి. ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఇతర మంత్రివర్గ సహచరులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కోదండరాం సర్ సలహాలు, సూచనలు తీసుకోవాలి. కోదండరాం సర్ కూడ ప్రభుత్వంను గాడి తప్పకుండా చూడాలి. ఈ పదవి కోదండరాం సర్ కు ఒక పరీక్ష లాంటిది, ప్రతిష్టకు సవాల్ లాంటిది అనేది మాత్రం నిజం. మీ సహచరుడిగా ఇది నా చిన్న విజ్ఞప్తి.

జనంసాక్షి

# వయ్యారి భామతో జాగ్రత్త



**పార్థినియం అవగాహన వారోత్సవాలు**

పంట పొలాలు పశువులకు నష్టం కలిగించే వయ్యారిభామ మొక్కలను రైతుల నిర్మించాల్సిన అవసరం ఉందని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రము ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.రాజన్న రైతులకు సూచించారు. ప్రతి సంవత్సరము భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆగస్టు 16 నుంచి 22 వరకు వయ్యారిభామ కలుపు మొక్కపై ప్రత్యేకంగా రైతులకు అవగాహన కార్యక్రమము నిర్వహిస్తుంది. వయ్యరి భమ మొక్కను గజర్ గడ్డి అని కూడా పిలుస్తారు. ఇది 1950లో అమెరికా నుండి గోధుమలను దిగుమతి చేసుకున్నప్పుడు భారతదేశం రావడం జరిగింది. ఒక పార్టీనియం మొక్క పదివేల నుంచి 15 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది ఈ విత్తనాలు గాలిద్వారా వ్యాప్తిచెందుతాయి. తిరిగి మొలకెత్తుతాయి. అలా ఈ మొక్క వేగంగా ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందుతుంది.పువ్వులపై ఉండే పుప్పొడి టమాటా, వంకాయ, వంటి మొక్కలపై పడడంతో పువ్వులు, పిందెలు రాలిపో తాయి. తామర పురుగులకు ఇది నివాసంగా ఉంటుంది పంటకు వేసిన ఎరువుల సారాన్ని పీల్చేస్తుంది. నత్రజని సూక్ష్మజాతుల సాతాన్ని తగ్గి స్తుంది. మొక్కజొన్న, గోధుమ, అపరాలు, మల్బరి తోటలు, మామిడి తోటల్లో ఎక్కువగా పెరుగుతుంది. పశువుల పైన ప్రభావం సాధార ణంగా పశువులు ఈ మొక్కలను తినవు. పొరపా టున గడ్డితో పాటు పశువులు వయ్యారిభామను తింటే ఆ పశువుల పాలు తాగిన వారికి జ్ఞాపక శక్తి దెబ్బతింటుంది. ముఖ్యంగా వీటిని తిన్న పశువుల జీర్ణక్రియ,కిడ్నీ,లివర్ అన్నవాయిక శ్వాస క్రియలు దెబ్బతింటాయి. చివరికి మృత్యువాత పడతాయి.

**వయ్యారి భామ వలన మనుషులపైన ప్రభావం**

మనుషులకు ప్రమాదకరమైనటు వంటి శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. ఈ మొక్కల పుప్పొడిని పిలిస్తే జలుబు, కళ్ళు ఎర్రబడడం కనురెప్పలు వాపు వస్తాయి. దురదలు, తుమ్ములు వచ్చి చర్మంపై మచ్చలు ఏర్పడతాయి.

**పార్థినియంతో ఉపయోగాలు :** ఈ మొక్క వల్ల ప్రయోజనాలు కూడా ఉన్నాయి. చర్మపు మంట, రుమాటిక్ నొప్పి, విరేచనాలు, యూరిన్ ఇన్ఫెక్షన్లు, మలేరియా నివారణకి ఔషధంగా ఉపయోగపడుతుంది. నీటికలుపు మొక్కల నిర్మూలన, బయో గ్యాస్ ఉత్పత్తికి, పశువుల ఎరువుతో కలిపి వాడటం బయోపి స్టిసైడ్, పచ్చి రొట్టఎరువు, కంపోస్ట్ ఎరువు తయారికి కూడా ఈ మొక్కలను ఉపయోగించవచ్చును.

**నివారణ చర్యలు :** మొక్కలను కేవలం రసాయనక పురుగు మందులతో మాత్రమే అరికట్టలేము. పంట పొలాలలో మొలిచిన ఈ మొక్కలను పూత పూయకముందే బురదలో కలియదున్నాలి. పూతకు ముందే వేళ్ళతో సహా పీకి తగలబెట్టాలి. తంగేడు చెట్టు ఉన్న ప్రాంతాలలో ఈ మొక్క మొలవదు. పొలాల గట్ల పైన, బంజరు భూములలో తంగేడు మొక్కలను నాటుకోవడం మేలు. ఈ కలుపు మొక్క పూత దశకు రాకముందే 10 లీటర్ల నీటికి ఐదు కిలోల ఉప్పు కలిపి ఆ ద్రావణాన్ని పిచికారి చేయాలి. ఇలా చేస్తే మొక్కలను నిర్మూలించవచ్చు. అక్షింతల పురుగులు ఈ మొక్కలను ఇష్టంగా పూర్తిగా తింటాయి. మొక్కను సమర్థంగా నివారిస్తాయి. అదేవిధంగా వయ్యారిభామ మొలకెత్తకాన్న ముందు గ్లైఫొసేట్ 1.0-1.5 శాతం, మెట్రిబుజిన్ 0.3 - 0.5 శాతం లేదా 2,4 డి 1.0-1.5 శాతం పిచికారి చేయాలి.

జనంసాక్షి

# కార్మికులు.. నాడూ, నేడూ..



కేశవ్

పాత కార్మిక వర్గం పరిస్థితిలో కూడా ఏ మార్పు లేదు. ఇటీవలి జనపనార మిల్లుల సంక్షోభం చూస్తే మరిన్ని విషయాలు స్పష్టం అవుతున్నాయి.పశ్చిమ బెంగాల్ లోని జనపనార మిల్లుల్లో 2021-22 లో సంవత్సరానికి 38-39 లక్షల జ్యూట్ బాగ్ ల డిమాండ్ ఉండేది. 2022-23 లో అది 35 లక్షలకు పడిపోయింది. 2023-24 లో అది 30 లక్షలకు పడిపోయింది. కొత్త పంట వచ్చింది. కానీ కొత్త డిమాండ్స్ లేవు.. ఈ జూన్ లో 2.35 లక్షల బేల్స్ జ్యూట్ డిమాండ్ ని మిల్లులు ఆశించాయి. కానీ ఆశ్చర్యకరంగా, 27 వేల బేల్స్ జ్యూట్ డిమాండ్ అందింది. మొత్తం ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసే విషయం ఇది. పంచదార కర్మాగారాలు 20 శాతం తమ ఉత్పత్తిని జ్యూట్ బాగ్ లలో ప్యాక్ చెయ్యాల్సి ఉండగా అవి 7 శాతం మాత్రమే చేశాయని యూనియన్లు మొరపెట్టుకున్నాయి.



గతంలో జనపనార పరిశ్రమ అయినా, నూలు పరిశ్రమ అయినా, ఇనుము ఉక్కు పరిశ్రమ అయినా స్థాపించింది, లాభపడింది మరలా భారత బడా వర్గమే . బ్రిటిష్ వారితో కుమ్మక్కై వ్యాపార సామ్రాజ్యం వారు పెంచుకుంటూ పోయారు .కార్మికులు అప్పుడూ, ఇప్పుడూ ఒకేలా ఉన్నారు .అప్పుడైనా, ఇప్పుడైనా కోట్ల రూపాయల లాభాలను, ఆస్తులను సంపాదించుకుంది ఈ వర్గం . ఇదే వర్గం పాలిసి నిర్ణయాలను కూడా ప్రభావితం చెయ్యగలిగే పరిస్థితి నేడు ఉంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్ల కుంబకోణం ఈ విషయాన్ని మరింత దృఢపరచింది. కార్మికుడి జీతాలను ఒక యాభై రూపాయలు కూడా పెంచడానికి ఇష్టం లేని కార్పొరేటు వర్గం ఎలక్టోరల్ బాండ్లలో విపరీతంగా పెట్టుబడి పెట్టి పాలకవర్గాలను సంతృప్తి పరిచింది. ఇది ఈనాటి జాడ్యమే కాదు. ఇందిరా గాంధి ప్రభుత్వం లో కూడా దీరుభాయ్ అంబానీ ఇలానే విపరీతంగా ప్రయోజనం పొందాడని, తనకోసం పాలిసి నిర్ణయాలే మారిపోయాయని అశోకా మోదీ తన 'ఇండియా ఈజ్ బ్రోకెన్' పుస్తకంలో రాస్తున్నాడు. కానీ సాధారణ కార్మికుడికి అప్పుడూ, ఇప్పుడూ మిగిలింది ఒక చిన్న గది, చాలీచాలని జీవితం.

ఇటీవల పెరుగుతున్న విపరీతమైన హీట్ వేవ్స్ సమయాల్లో ఇంట్లోనే సాధారణ ప్రజలు ఉండలేని పరిస్థితి. అలాంటప్పుడు ఇదే ప్రజలు కార్మికులుగా పెద్ద పెద్ద కర్మాగారాల్లో విపరీతమైన ఉష్ణోగ్రతలో ఎలా పనిచేయగలరు? దేశం ఈ ఏడాది అత్యంత భయంకరమైన హీట్ వేవ్స్‌ను ఎదుర్కొంది. ఉష్ణోగ్రత అక్కడక్కడా 49 డిగ్రీలకు కూడా చేరుకుంది. పెరిగిన ఏసీల వాడకం ఉష్ణోగ్రతని మరింత పెంచింది. దేశం అమలుచేస్తున్న విధ్వంసక అభివృద్ధి ఈ సమస్యను మరింత సంక్షోభంలోకి నెట్టింది. ఇది ఒక్క భారత్ పరిస్థితి మాత్రమే కాదు. ఎన్నో పెట్టుబడిదారీ దేశాలు ఇలాంటి అభివృద్ధినే కొనసాగిస్తున్నాయి. కార్మిక వర్గం ఈ రకమైన విపత్కర పరిస్థితుల్లో కర్మాగారాల్లో పనిచెయ్యడం కష్టం. అలాగే, కొత్తగా ఏర్పడిన డెలివరీ బాయ్స్,గిగ్ వర్కర్లు అంత భయంకరమైన ఎండల్లో బైకుల మీద డెలివరీ లు ఎలా చెయ్యగలరు? బస్తాడు సామాన్లు వీపు మీద వేసుకుని లేదా మనం ఇంట్లోంచి ఆర్డర్ చేసిన ఫుడ్ ప్యాకెట్లు పట్టుకొని 48 లేదా 49 డిగ్రీల ఉష్ణోగ్రతలో మండే ఎండల్లో డ్రైవ్ చేస్తూ పనిచెయ్యడం ఆషామాషీ వ్యవహారం కాదు. అలాగే, ఫ్యాక్టరీలలో డాబా కింద పనిచేసే కార్మికుల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. కార్మికులకు అలాంటి సమయాల్లో చల్లదనం కలిగించే ఏర్పాటు, పనివేళల్ని తగ్గించే ఏర్పాట్లు, జీతం అలానే ఉంచి, పని వేళల్లో సర్దుబాటు, విరామ సమయాలు పెంచడం,ఇలా ఎన్నెన్నో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. మరోవైపు ఐటీ రంగంలో ని విప్లవం కారణంగా మరో కొత్తరకం కార్మికులు ఆవిర్భవించారు. వర్క్ ఫ్రం హోం అని వీరిని కోవిడ్ తర్వాత ఇంటికి పరిమితం చేశారు. ఎంత ఫ్యాషన్ గా ఈ ఉద్యోగులు చెప్పుకున్నా సరే వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉంది. ఇంటిని ఒక ఆఫీసుగా మార్చేశారు. ఈ శ్రామికులను ఇంటికి పరిమితం చెయ్యడం ద్వారా సంఘటితం అయ్యే శక్తి ఈ ఉద్యోగుల్లో లేకుండా చేశారు. తను కూడా ఒక కార్మికుడిని అనీ, అవసరమైతే హక్కులకోసం పోరాటం చెయ్యగలం అనే స్పృహ లేకుండా పోయింది. ఒక చిన్న ఈ మెయిల్ ద్వారా ఉద్యోగం నుంచి తీసెయ్యడం యజమాని వర్గానికి సులభం అయింది. ప్రజలు ఎన్నుకుంటున్న ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఈ కోణంలో ఆలోచించాల్సిన అవసరం ఉంది. డిజిటల్ రంగంలోనూ, పర్యావరణంలోనూ వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని, ఇటీవల పెరిగిన ఉష్ణోగ్రతల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్మికుల సమస్యలను పరిశీలించి కార్మికుల చట్టాలను తిరిగి రాయాలి కార్మికుల ప్రయోజనం కోసం.

**దేశం ఈ ఏడాది అత్యంత భయంకరమైన హీట్ వేవ్స్‌ను ఎదుర్కొంది. ఉష్ణోగ్రత అక్కడక్కడా 49 డిగ్రీలకు కూడా చేరుకుంది. పెరిగిన ఏసీల వాడకం ఉష్ణోగ్రతని మరింత పెంచింది. దేశం అమలుచేస్తున్న విధ్వంసక అభివృద్ధి ఈ సమస్యను మరింత సంక్షోభంలోకి నెట్టింది. ఇది ఒక్క భారత్ పరిస్థితి మాత్రమే కాదు. ఎన్నో పెట్టుబడిదారీ దేశాలు ఇలాంటి అభివృద్ధినే కొనసాగిస్తున్నాయి.**

(అధ్యాపకులు, రచయిత, జాగృతి సమీక్ష త్రైమాసిక పత్రిక సంపాదకులు)

జనంసాక్షి

## అంతా శూన్యం

అప్పులు చేసి గొప్పలు చెప్పడం
గొప్పలు చెప్పి అప్పులు మోపడం
రేపటి తరానికి బానిసలు చేయడం
నేటి నేతల మాటకారి తనం...

ఆదాయం దారి తప్పడం
ఆస్తులు అంతస్తులు పెంచుకోవడం
ఆముదం చెట్టు మహావటవృక్షం
జై పాతాళభైరవి తీర్చిన కోరిక కావడం
విస్తు పోవడం పేదలవంతు..

తిరుగుబాటు తుపాను రావడం
ఉన్నదంత ఊడి పోవడం
ఆనందైశ్వర్యాలు మాయం కావడం
నిజాలు తెలిసి వచ్చేవరకు
అహం ఐరావతమే...

వేరును మరచి పోయిన చెట్టుకు
కొమ్మలు రెమ్మలు ఎదగవు
తన ఉనికిని తానే కోల్పోతుంది
వేరులాంటి పేదను మరచి పోతే
కుంటి కుర్చీ కూడా మిగలదు

రేడియమ్
9291527757

జనంసాక్షి

# పిల్లలపై ఆగడాలను ఆపేదెలా...?



**మొన్నీమధ్య ఇరాక్ బాలికల వివాహ వయస్సును తగ్గించింది. ఇజ్రాయిల్ పిల్లలు చదివే పాఠశాల మీద బాంబుల దాడి జరిపింది. ఉక్రెయిన్ దేశంలో రష్యా కొనసాగిస్తున్న మారణహోమంలో ఎంతో మంది పిల్లలు అశువులు బాస్తున్నారు. మనదేశంలో పసి మొగ్గలపై అత్యాచారం జరిపి హత్య చేసేసారు. ఆగస్టు 12 సోమవారం అన్నమయ్య జిల్లాలో బాలిక పరువు హత్యకు గురికాబడింది. ఇవన్నీ పిల్లలపై జరుగుతున్న అకృత్యాలే.**

ఈ దేశం, ఆ దేశం అనే బేధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా పిల్లలు హానికి, వివిధ రకాల హింసకు, అనేక రకాలుగా శారీరక, మానసిక హింసకు గురవు తున్నారు. ఇవి చూస్తే మనమున్నది ఆధునిక సమాజంలోనేనా? లేదా ఆటవిక సమాజంలోనా..? అనే సందేహం కలుగుతుంది. నేటి పిల్లలే భవిష్యత్ నిర్మాతలని మనకు తెలియదా? లేదా తెలిసే చేస్తున్నామా? దేశాల మధ్య ఆధిపత్య పోరులో ఎక్కువగా బలవుతున్నది పిల్లలనేది కాదనలేని నిజం. లైంగిక వేధింపులు, దోపిడీ, అక్రమ రవాణా, అపహరణ ఇవి నేడు ప్రపంచవ్యాప్తంగా పిల్లలు ఎదుర్కొంటున్న కొన్ని ప్రమాదాలు. ఒక్కసారి జరుగుతున్న సంఘటనలు పరిశీలిద్దాం.

**దేశాల మధ్య యుద్ధాలు :** ఈ మధ్యన ఇజ్రాయిల్ దేశం గాజా నగరంలో ఉన్న చాలా పాఠశాలల మీద దాడులు జరుపుతునే ఉంది. దీని కారణాన అభమూ శుభమూ ఎరుగని పిల్లలు బలైపోతునే ఉన్నారు. ఇది అంతర్జాతీయ యుద్ధ నియమాలను ఉల్లంఘన కిందకే వస్తుంది. 7 అక్టోబర్ 2023 నాటినుండి నేటి వరకూ పాలస్తీనాలో సుమారు 21,000 మంది పిల్లలు చనిపోయారు. వందల మంది పిల్లలు భవన దిగువన శిథిలమైపోయారు. అనేక మంది గాయాల పాలయ్యారు. ఎంతో మంది వారి తల్లిదండ్రులకు దూరమయ్యారు. అలాగే ఉక్రెయిన్ మీద రష్యా కొనసాగిస్తున్న యుద్ధంలో కూడా సుమారు రెండు వేలకు పైగా పిల్లలు మరణించారు. ఇంకా సూడాన్ లాంటి దేశాలలో అంతర్గత పోరులో చాలా మంది పిల్లలు బలైపోతున్నారు.

**వీటి ప్రభావాలు :** ఈరోజు ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణ ప్రాంతాలలో నివసిస్తున్న సుమారు మూడు కోట్లకు పైగా పిల్లలు అధిక స్థాయి ఒత్తిడిని అనుభవిస్తున్నారని, తేలికపాటి నుండి మితమైన మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉన్నారని, అదనంగా ఏడు లక్షల మంది పిల్లలు తీవ్రమైన మానసిక ఆరోగ్య రుగ్మతలకు గురవుతున్నారని అంతర్జాతీయ నివేదికలు తెలుపుతున్నాయి. వీటి మూలాన వారు పాఠశాలలకు దూరమైపోతున్నారు. అనేక రోగాలకు దగ్గరవుతున్నారు. గాజాలో విద్య పూర్తిగా లేకపోవడంతో 6,25,000 మంది పిల్లలు పాఠశాలకు దూరంగా ఉన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందరూ పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. ఆహార అభద్రత లేదా అధ్వాన్నమైన సంక్షోభ స్థాయిలను ఎదుర్కొంటున్నారు. నిరంతర బాంబు దాడులు, ఆంక్షలతో ఆహారం, నీటికి అత్యంత కొరత వచ్చింది. ఇది పిల్లల్లో పోషకాహార లోపం పెరగడానికి కారణమయ్యింది. గాజాలో దాదాపు అందరు పిల్లలు కరువు బారిన ఉన్నారు. ఈ జూన్ నాటికి ఉక్రెయిన్‌లో పిల్లలు నాలుగు విద్యా సంవత్సరాలు కోల్పోయారని, దేశవ్యాప్తంగా దాదాపు ఒక పది లక్షలకు పైగా పిల్లలు అభద్రత కారణంగా వ్యక్తిగతంగా నేర్చుకోలేకపోతున్నారని యునిసెఫ్ తెలిపింది. ఉక్రెయిన్‌లోని దాడులు పిల్లల మానసిక ఆరోగ్యం, శ్రేయస్సును హానికరంగా ప్రభావితం చేశాయి. పిల్లలలో సగం మంది నిద్ర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.




**హక్కులు పుస్తకాలకే పరిమితం :** ఐక్యరాజ్య సమితి బాలల హక్కులు పుస్తకాల్లో తప్ప నిజ జీవితంలో మాత్రం అమలవడం లేదు. అంతర్జాతీయ స్థాయిలో పిల్లలకోసం అనేక సంస్థలు ఉన్నా ఏమి లాభం? కేవలం చర్చించడానికి, నీతులు వల్లించడానికి మాత్రమే ఇవున్నాయా? ఈ విషయాలన్నీ పెద్దన్న దేశానికి తెలియదా? లేదా వాళ్లకు తెలిసే జరుగుతుందా? నిజాలు బహిరంగ రహస్యాలే.

**వివాహ వయస్సు తగ్గించిన ఇరాక్ :** ఇరాక్ దేశంలో బాలికల కనీస వివాహ వయస్సును తొమ్మిది సంవత్సరాలకు తగ్గించాలని అక్కడ ప్రభుత్వం భావిస్తోంది. దేశ పర్సనల్ స్టేటస్ లాను సవరించాలని ఇరాక్ న్యాయ మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన ఈ వివాదాస్పద బిల్లు ప్రయత్నిస్తోంది. జూలై చివరిలో చట్టసభ సభ్యుల నుండి పెద్ద ఎత్తున అభ్యంతరాల రావడంతో ప్రతిపాదిత మార్పులను పార్లమెంటు ఉపసంహరించుకుంది. ఛాంబర్లో గణనీయమైన ఆధిపత్యం ఉన్న ప్రభావవంతమైన షియా కూటముల మద్దతు పొందిన తరువాత ఆగస్టు 4 న జరిగిన సెషన్లో ఈ బిల్లు తిరిగి కనిపించింది. ప్రస్తుతం 1959 పర్సనల్ స్టేటస్ చట్టం ప్రకారం బాలికల చట్టబద్ధ వివాహ వయస్సు 18 ఏళ్లుగా ఉంది. ఇరాక్ దేశంలో రాచరికం పతనమైన తరువాత ఈ చట్టం కుటుంబ విషయాలను నిర్ణయించే అధికారాన్ని మత పెద్దల నుండి ప్రభుత్వానికి, దేశంలోని న్యాయవ్యవస్థకు మార్చింది. ఇరాక్ లో 28 శాతం మంది అమ్మాయిలకు 18 ఏళ్లు నిండకముందే పెళ్లిళ్లు అయ్యాయని యూనిసెఫ్ తెలిపింది. ప్రతిపాదిత బిల్లులో వివాహం, విడాకులు, పిల్లల సంరక్షణ వంటి కుటుంబ విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని మతపరమైన అధికారులు లేదా పౌర న్యాయవ్యవస్థలో ఒకదాన్ని ఎంచుకోవడానికి పౌరులను ఈ బిల్లు అనుమతిస్తుంది. ఈ ప్రతిపాదిత బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు ఇప్పటికే నిరసనలు చేపట్టారు. ఇది వారసత్వం, విడాకులు, పిల్లల సంరక్షణ వంటి రంగాలలో హక్కులను హరిస్తుందని విమర్శకులు ఆందోళన చెందుతున్నారు. మహిళా హక్కుల న్యాయవాదులు ఈ బిల్లు ఆమోదించినట్లయితే "బాల అత్యాచారాలను చట్టబద్ధం చేనట్లేనని" మహిళా హక్కుల న్యాయవాదులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్పు మహిళల హక్కులకు భంగం కలిగిస్తుందని, దేశంలోని పితృస్వామ్య సమాజంలో బాల్య వివాహాలు పెరగడానికి దారితీస్తుందని హక్కుల న్యాయవాదులు హెచ్చరిస్తున్నారు. దురదృష్టవశాత్తూ ఈ చట్టాన్ని సమర్థించే పురుష ఎంపీలు మైనర్‌ని పెళ్లి చేసుకోవడంలో తప్పు ఏముంది అని అడుగుతున్నారు.

**మన దేశంలో..:** మన దేశంలో జాతీయ నేర గణాంక సంస్థ ( నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం గత రెండేళ్లలో భారతదేశంలో పిల్లలపై నేరాలు 26% పెరిగాయి. దేశ వ్యాప్తంగా 2020 సం.లో చిన్నారులపై నేరాలకు సంబంధించి 1.28 లక్షల కేసులు నమోదు చేయగా 2022 సం.లో 1.62 లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయి. ప్రతి లక్ష మంది పిల్లల జనాభాకు నమోదైన నేరాల రేటు 2021లో 33.6తో పోలిస్తే 2022లో 36.6గా ఉంది. నివేదిక 2022లో 83,350 మంది పిల్లలు తప్పిపోయారు. వీరిలో 20,380 మంది బాలురు, 62,946 మంది బాలికలు కాగా 24 మంది ట్రాన్స్‌జెండర్లు. ఇప్పటికీ 2,946 బాలికల ఆచూకీ తెలియడం లేదు. 2021లో తప్పిపోయిన పిల్లల సంఖ్య 77,535 నుండి 2022లో 7.5% పెరిగింది. పోక్సో చట్టం అమలులో ఉన్నా నేరాలు తగ్గడం లేదు.

**పరిష్కారాలు :** వివిధ దేశాల మధ్య యుద్ధాలు ఆపడానికి అంతర్జాతీయ సమాజం నడుం బిగించాలి. వినని దేశాలపై మిగిలిన దేశాలు ఆంక్షలు విధించాలి. బాలికలపై జరుగుతున్న హత్యాచారాల కారకులను తక్షణమే శిక్షించాలి. శిక్షలు ఎలా ఉండాలంటే పిల్లలపై హింస జరపాలంటే భయమేయాలి.



**జనక మోహన రావు దుంగ**
**8247045230**

జనంసాక్షి

# దళిత మహిళపై ఎస్ఐ కర్కశత్వం

- కొడుకు ఆచూకీ చెప్పాలని దౌర్జన్యం
- దారిలోకి రాకపోతే తుపాకీతో వేసేస్తా..
- బషీరాబాద్ ఎస్ఐ హుకుం
- సీఎం జిల్లాలో సంఘటన



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 16 (జనం సాక్షి):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర శాసనసభ పతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న వెనకబడిన జిల్లాలో దారుణం జరిగింది. ఇద్దరు రాష్ట్ర కీలక నేతలు ఉన్న జిల్లాలో దళిత మహిళపై దౌర్జన్యం జరిగింది. ప్రజలకు రక్షణ కల్పించవలసిన పోలీస్ భక్షక భటుడుగా మారాడు. సీఎం స్పీకర్ సొంత జిల్లాలో శాంతిభద్రతలు ఇట్లా ఉంటాయని సమాజం సమాజం ముక్కున వేలే కుంది. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండవలసిన పోలీస్ ఏ నేరం చేయకుండానే ఒక దళిత మహిళను ఎస్సై మానసికంగా చిత్రవధ చేశాడు. ఫలితంగా ఆ మహిళ రోజు పస్తులు ఉంటూ కచేరి చుట్టూ తిరుగుతూ మానసిక క్షోభకు గురైంది. షాద్ నగర్ తరహా ఈ సంఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో జరిగింది. బాధితురాలు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం నావల్గా గ్రామానికి చెందిన లోగడ సురేష్(17) అదే మండలం కాసింపూర్ గ్రామంలో మేస్త్రి పని కోసం వెళ్ళాడు. అదే గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలిక సురేష్ ప్రేమలో పడింది. ఇద్దరు మైనర్లు అయినప్పటికీ తల్లిదండ్రులకు తెలియకుండా ఇంట్లో నుంచి పరారయ్యారు. ఈ సంఘటన జరిగి దాదాపు మూడు నెలలు కావస్తుంది. తమ కూతురును మాయ మాటలు చెప్పి సురేష్ తీసుకెళ్లాడని బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో మైనర్ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో నిందితుడు సురేష్ పై కిడ్నాప్ కేసు నమోదు అయ్యింది. ఈ కేసు విచారణలో భాగంగా సురేష్ తల్లి లోగోడ కళావతిని రోజు పోలీస్ స్టేషన్ కు పిలిపించి స్థానిక ఎస్సై సురేష్ కుమార్ వేధింపులకు గురి చేస్తారు. రోజు కూలి నాలి చేస్తేనే కానీ పూట గడవని దళిత మహిళను కచేరి కి పిలిచి నానా బూతులు తిడుతూ లాటితో కొట్టి చిత్రవధ చేశారు. కొడుకు ఆచూకీ చెప్పాలని చెప్పకపోతే తుపాకీతో వేసేస్తానని ఎస్సై బెదిరిస్తున్నారని బాధితురాలు విలేకరులకు వివరించండి. కాకుండా థర్డ్ డిగ్రీ తరహా కాళ్లు చేతులపై లాఠీలతో కొట్టి మహిళలని చూడకుండా వయసుకు గౌరవం ఇవ్వకుండా దౌర్జన్యం చేశారని రోధిస్తూ విలేకరులకు తెలియజేశారు. రోజు కచేరి కి రావడం వల్ల కూలి పని చేసుకోలేక పస్తులు ఉండవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. గత మూడు నెలలుగా ఉదయాన్నే కచేరీకి వచ్చి సాయంత్రానికి ఇంటికి వెళు తున్నానని తెలియజేస్తుంది. తాను ఏ తప్పు చేయకున్నా వయవృద్ధురాలైన తనను వేధించడం ఏమిటని రోదించింది. ఏదన్న అయితే పోలీసులకు చెప్పుకుంటాం.. తప్పు చేసిన వాళ్ళను వదిలేసి వాళ్లే ఇట్లా చేస్తే ఎట్లా అని ఆవేదన వ్యక్తం చేసింది. తన కొడుకు ఆచూకీ తెలిస్తే పోలీసులతోని ఎందుకు దెబ్బలు తింటానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై వివిధ సంఘాలకు తెలియడంతో ఎస్సై వైఖరిపై మండిపడ్డారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమని దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యుడైన ఎస్సై పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## దొంగతనాలు నివారణకు పకడ్బందీ చర్యలు..!



**జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి**

**మెదక్ బ్యూరో, ఆగస్టు 16 (జనం సాక్షి):**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల్లో దొంగతనాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇటీవల కాలంలో ఏడుపాయల్లో జరిగిన దొంగతనం పరిసర ప్రాంతాలను స్వయంగా పరిశీలించి అక్కడి ఆలయ కమిటీ సిబ్బందితో మాట్లాడినారు అలాగే సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించినారు. ఆలయ ఈ వోతో ఫోన్లో మాట్లాడి త్వరలోనే ఒక కమిటీని ఏర్పాటు చేసి ఏడుపాయల రక్షణ, దొంగతనాల నివారణపై వచ్చే మంగళవారం చర్చించి ఆలయ పరిసర ప్రాంతాల పరిరక్షణకు దొంగతనాల నివారణలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డిఎస్పి.ప్రసన్న కుమార్ ,మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, పాపన్నపేట్ ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి



- ప్రతి శుక్రవారం డ్రైడే పనులు పక్కాగా చేపట్టాలి
- నీటి గుంటలు లేకుండా దోమల నివారణకు తగిన చర్యలు
- కలెక్టర్ హనుమంత్ కే.జెండగే

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ఆగస్టు 16 (జనంసాక్షి):**
వర్షాకాలం దృశ్య పారిశుధ్య పనులు నియంత్రణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ హనుమంతుకి జండేగా ఆదేశించారు ప్రతి శుక్రవారం డ్రైడే పనులు చేపట్టాలని నీటి గుంతలు లేకుండా నీటి నిల్వ కాకుండా చూడాలని దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం నాడు ఆయన రాజపేట మండలం నర్సాపూర్ గ్రామంలో శుక్రవారం డ్రైడే పనులను పరిశీలించారు. నర్సరీని చూసి ప్రైమరీ బెడ్ లకు సంబంధించి ఖాళీగా ఉన్న సంచులలో తిరిగి మొక్కలు పెంచాలని సూచించారు. పల్లె ప్రకృతి వనం మొత్తం తిరిగి చెట్లను పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ లో గ్యాపులు ఉన్నచోట తిరిగి పెద్ద మొక్కలు నాటాలని సూచించారు. సిగ్రిగేషన్ షెడ్లో వర్మి కంపోస్టు తయారీని పరిశీలించారు. తయారైన వర్మి కంపోస్టును తిరిగి నర్సరీలో, ప్లాంటేషన్ మొక్కలకు ఎరువుగా వాడుతున్నట్లు ఎంపీడీవో నాగవేణి వివరించారు. అమృత్ సరోవర్ ప్రాజెక్టు కింద చేపట్టిన చెరువు కూడికతీత పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కిషన్, పంచాయతీ సెక్రెటరీ పవన్ ఉన్నారు.

## ప్రభుత్వ మిగులు భూమి అన్యాకాంతం

- బిజెపి మండల నాయకుడిపై దాడి
- కాంగ్రెస్ నేత హస్తముందని బిజెపి నేతల ఆరోపణ






**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 16 (జనంసాక్షి):**
ప్రభుత్వం మిగిలిన భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని రెవెన్యూ ఉన్నత అధికారులు ఫిర్యాదు చేసిన మేరకు బాధితుడు పూడూరు బిజెపి అధ్యక్షుడు రాఘవేంద్ర పై దాడి జరిగింది. ఈ మేరకు బాధితుడు వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డికి చనుగోముల్ పోలీస్ స్టేషన్లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు కడుమూరు ఆనందం ఎంకేపల్లి శివారులో సర్వే నంబర్ 99.100 లో ప్రభుత్వం మిగిలిన భూమి కబ్జా చేశారని పూడూర్ మండల బిజెపి అధ్యక్షుడు రాఘవేందర్ గతంలో ఫిర్యాదు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని శుక్రవారం తెల్లవారుజామున కాంగ్రెస్ నాయకులు కనుమూరు ఆనందం తమపై హత్యాయత్నానికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద రెడ్డి మాట్లాడుతూ పూడూర్ మండల బిజెపి అధ్యక్షుడు రాఘవేందర్ ఎంకేపల్లి లోని ఒక వెంచర్లో పనిచేస్తుండగా కాంగ్రెస్ నాయకులు కడుము ఆనంద్ తమ అనుచరులతో దాడికి ప్రయత్నించగా అక్కడ నుంచి బాధితుడు తప్పించుకొని పరారీ అయినట్లు తెలియజేశారు. బాధితుడు వాహనంలో పరారీ అవుతుండగా వారు మరో వాహనంలో వెంబడించి పూడూరు గ్రామంలో హత్యయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. పూడూరు గ్రామంలో తన సర్వీస్ రివాల్వర్ వరకు తీసుకొని చంపేస్తానని బెదిరించారని అన్నారు. ప్రజా అవసరాల కోసం ప్రభుత్వం మిగిలి భూమిని కాపాడి పేదలకు పంచాలని తమ నాయకుడు ఫిర్యాదు చేస్తే కాంగ్రెస్ నాయకులు అధికార బలంతో దాడులకు పాల్పడడం దారుణ మని అన్నారు ఈ విషయమై చర్య తీసుకోవాలని వికారాబాద్ ఎస్పీ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు. అలాగే బాధితుడికి ప్రాణహాని ఉందని పోలీసులు రక్షణ కల్పించవలసిన అవసరం ఉందని అన్నారు. ఫిర్యాదుదారుపై దాడి చేస్తే పోలీసులు ఆయన వెంటే ఉండి బాధితురుని రక్షించకపోవడం దారుణమని అన్నారు

## విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదగాలి




**నాబార్డ్ మాజీ చైర్మన్ గోవిందరాజులు**

**మొయినాబాద్,16(జనం సాక్షి):**
విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదగాలని, నాణ్యమైన విద్యతో ఉన్నత విద్యకు వెళ్లాలని నాబార్డ్ మాజీ చైర్మన్ గోవిందరాజులు పేర్కొన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని హిమాయత్నగర్ సమీపంలో గల స్వామి నారాయణ్ ఇంటర్నేషనల్ గురుకుల్ పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర వేడుకల సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన చరిత్రలో అనుసంధానించే అందమైన రోజు స్వాతంత్ర్య దినోత్సవం అన్నారు. మనం పిల్చే స్వేచ్ఛ వాయువుల వెనుక ఎంతో మంది ప్రాణత్యాగం ఉందని ఏ దేశం కూడా స్వాతంత్రాన్ని పొందేందుకు పోరాడలేదన్నారు. మన భారత మాత పడినంత వేధన ఎవరు పడేలేదని సూచించారు. త్యాగం చేసి స్వేచ్ఛను అందించారని అన్నారు. ప్రతిసారి ఆ త్యాగధనులను గుర్తించుకోవాలని కొనియాడారు. భారతదేశం వ్యవసాయ దేశమని ప్రపంచాలన్నిటికి ఆహారాన్ని అందించగలిగిన సత్తా మన దేశానికి ఉందని మన రైతులను మనమే ఆదుకోవాలని పేర్కొన్నారు. అందు కోసం నాబార్డ్ వంటి సంస్థల ద్వారా సహాయ సహకారాలను అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతులకు సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. మన దేశం సర్వోతోముఖాభివృద్ధిని సాధించగలదని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం గురుకుల్ పాఠశాల స్వామిజీ సుఖ్వల్లభ్దాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో మన దేశంలో పుట్టినందుకు గర్వంగా తలెత్తుకోవాలని అన్నారు. కులం, మతం, భాషా, ప్రాంతాల వారిగా కాకుండా భారత పౌరులుగా గుర్తింపు పొందాలని పేర్కొన్నారు. పుట్టిన ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు, సమాన హక్కులు ఉంటాయని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనే మన దేశం అగ్రగామిగా నిలవాలని తమ సందేశంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ స్వామినారాయణ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.వి. ప్రవీణ్ కుమార్, విశ్వదర్శన్ స్వామిజీ, హరివల్లభదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులను పరిష్కరించాలి

**డిఎస్పీ ఎన్ లింగయ్య**



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
పెండింగ్ కేసులను ఛాలెంజ్గా తీసుకుని పరిష్కరించాలనీ నారాయణపేట డిఎస్పీ ఎన్.లింగయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం మక్తల్ సర్కిల్, మరికల్ సర్కిల్ పరిధి లోని పోలీసు అధికారులకు డిఎస్పీ. ఎన్ లింగయ్య సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాను గ్రేవ్ కేసుల గురించి సిఐ, ఎస్ఐలను అడిగి తెలుసుకొని పెండింగ్ కేసుల పూర్తి చేయడానికి పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతు గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి ఏఏ అంశాలు క్రోడికరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు ఛేదించాలి. కేసుల్లో శిక్షల శాతం పెంచాలి. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి. పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలి. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నికూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి. గంజాయి, గుట్కా, పేకాటపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలి. ఫోక్సో, ఎస్సీ ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, 60 రోజుల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. ఆత్మహత్యల కేసులలో అన్ని కోణాలలో ఇన్వెస్టిగేషన్ చేసి కేసు ఫైనల్ చేయాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలి, కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలి, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి చాలెంజిగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో సిఐలు చంద్ర శేఖర్, రాజేందర్ రెడ్డి, ఎస్సై లు భాగ్యలక్ష్మి రెడ్డి, ఎండి నవీద్, మురళి, రమేష్, కుర్మయ్య, స్టేషన్ రైటర్లు,తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఆరోగ్యమే ముఖ్యమంత్రి ధ్యేయం

**స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ**

**ఉప్పునుంతల ఆగస్టు 16 (జనంసాక్షి):**
ప్రజా ఆరోగ్యమే ముఖ్యమంత్రి ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు మండల పరిధిలోని మర్రిపల్లి మామిళ్ళపల్లి కంసాన్పల్లి గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్లో చెక్కులు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా వైద్యంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని అంతేకాకుండా అతి తక్కువ సమయంలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజలకు అండగా నిలిచిందని వారన్నారు. తెలంగాణ ప్రజలకు మహిళలకు గౌరవిస్తూ ఉచిత ప్రవేశ పథకాలు ప్రవేశ పెడుతుంటే చూసి ఓర్వచాలని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు సరి అయినవి కావని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, కాల్వ గోవర్ధన్ రెడ్డి, నరసింహారావు, మాజీ ఎంపిటిసి మల్లయ్య, బాల లక్ష్మయ్య స్థానిక నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శులే కీలకం

**జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్**




**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలకమని జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ అన్నారు. శుక్రవారం సింగారం చౌరస్తాలోని స్కిల్ డెవలప్మెంట్ కేంద్రంలో పంచాయితీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని అన్నారు గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమాలలో దూసుకుపోవాలన్నారు. అంగన్వాడి కేంద్రాలు పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేస్తే నిత్యం వాడే కూరగాయలకు లోటు ఉండదని అన్నారు.జిల్లాలో ఎన్ని ఎస్హెచ్జి గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రాలలో శ్యామ్ అండ్ మ్యామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచా లన్నారు. ప్రతి శుక్రవారం క్లీనింగ్ డేగా బ్లీచింగ్ పౌడర్ వెదజల్లుతూ పరుచుకోవాలన్నారు. గృహ జ్యోతి పథకం కింద వచ్చే దరఖాస్తులను తీసుకొని పంపాలన్నారు. ఉదయం ఏడు నుండి సాయంత్రం ఐదు వరకు పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ పరిధిలో అందుబాటులో ఉంటారని డిపిఓ తెలిపారు ట్రాక్టర్ల వాడకం బట్టి లాగ్ బుక్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి బుధవారం అంగన్వాడి కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులవిద్యపై దృష్టి సారిస్తామని సిడిపిఓ తెలిపారు. బాలిక మండలి ఏర్పాటు చేశామని బాల్యవివాహాలకు అరికడుతున్నట్లు సిడిపిఓ తెలిపారు. షీ టీంపై అవగాహనా కల్పించారు. మహిళా శక్తి ద్వారా 353 గ్రామ సంఘాలు ఉన్నాయని డిఆర్డిఓ తెలిపారు. ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన పెండింగ్ దరఖాస్తులను సత్వరం పరిష్కరించైనా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలలో డెంగీ మలేరియా టైఫాయిడ్ లాంటి వ్యాధులు ప్రబలకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. డెంగీ రెండు కేసుల నమోదు అయినట్టు అధికారులు కలెక్టర్కు తెలిపారు. మురుగు కాల్వలలో ఆయిల్ బాల్స్ వదలాలని కలెక్టర్ తెలిపారు. రైన్ వాటర్ కొరకు హార్వెస్టింగ్ పనులు చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ 2020 వెరిఫికేషన్, ప్రజాపాలన, మెర్జింగ్ స్టేట్మెంట్ మాపింగ్ ప్రేపరషన్ ఓటర్ లిస్ట్ పై అవగాహనా కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాయాంకుమిత్తల్, డిఆర్డిఎ కథలప్ప, డిపిఓ కృష్ణయ్య, అధికారులు ఎంపిడిఓలు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ధరణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
ధరణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా నవాబ్ పేట మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి దరఖాస్తుల పెండింగ్ ను ఆమె ఆన్లైన్లో పరిశీలించారు. ధరణి దరఖాస్తులపై తహసిల్దారు నాన్యా నాయక్, సిబ్బందితో సమీక్షిస్తూ దరఖాస్తులన్నింటిని నిబంధనల ప్రకారం అన్ని రకాలుగా పరిశీలించి పరిష్కరించాలని, అలాగే ఆర్ఎస్ఆర్ వంటి వాటి విషయంలో సమగ్రంగా విచారణ నిర్వహించి పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ధరణికి సంబంధించిన నివేదికలన్నింటిని సమగ్రంగా రూపొందించి పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయానికి పని నిమిత్తం వచ్చిన వారితో మాట్లాడి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు.





## ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**మఖ్తల్ ఆగస్టు 16 (జనంసాక్షి)**
ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఖానాపూర్ గ్రామనికి చెందిన రేవతి కి నార్మల్ డెలివరీ అయి పాప పుట్టడం తో జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా డెంగ్యూ కేసులు రోజు కు ఎన్ని చేస్తున్నారని కలెక్టర్ అడగగా రోజుకు 20టెస్ట్ లు చేస్తునామనీ తెలిపారు. ఇంకా 600 వందల కిట్స్ ఉన్నాయన్నారు. రోజు వైరల్ ఫీవర్ వస్తున్నయనీ రోజు 300 ఒపిలు చూడడం జరుగుతుందన్నారు. ఫీవర్ కేసులు 60 నుంచి 80 కేసులు వస్తున్నాయన్నారు. కిట్స్ మహబూబ్ నగర్కు పంపడం జరుగుతుందన్నారు. ఇక్కడ ఏఏ టెస్ట్లు చేస్తున్నారని, రోజు డెంగ్యూ కేసులు ఏమైనా నమోదు అయ్యాయా నమోదు అయిన వారి వివరాలు సేకరించలాన్నారు. కుక్క కాటుకు గురి అయినవారి సంఖ్య ఎక్కువ ఉండని కలెక్టర్ కు ఆసుపత్రి వైద్యులు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
17 ఆగస్టు 2024

# గ్యాస్ గోదాం భవనాన్ని తరలించండి

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు ఆగస్టు16(జనంసాక్షి)**
పటాన్చెరు పట్టణంలో జనావాసాల మధ్య గల ప్రభుత్వ హెచ్‌పి గ్యాస్ గోదాం భవనాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఎమ్మెల్యే జిఎంఆర్ భేటీ అయ్యారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పటాన్చెరు పట్టణంలో గ్యాస్ గోదాం భవనం వరకు విస్తరణ జరుగుతుందని, దీంతో పాటు గోదాం పక్కనే గల పాత తహసిల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు కాబోతోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నిత్యం వందలాదిమంది ప్రజలు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వస్తారని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మండల పరిధిలోని రామేశ్వరం బండ శివారులో గ్యాస్ గోదాం కి స్థలాన్ని కేటాయించి తరలించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రి సూచనల మేరకు.. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ ను కలిసి ప్రతిపాదన అందజేశారు.

### రేషన్ డీలర్ల రాష్ట్ర మహాసభలకు హాజరు కండి

రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న పటాన్చెరువు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించ తలపెట్టిన రచ్చ సాయి సదస్సుకు హాజరు కావాలని కోరుతూ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు పాల్గొన్నారు.

# వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను వంద శాతం సాధించాలి..!

### జిల్లా అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వాములు కావాలి

### రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు




**వనపర్తి,ఆగస్టు16 (జనంసాక్షి):**
వనపర్తి జిల్లా ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం బ్యాంకర్లకు ఇచ్చిన లక్ష్యాలను వంద శాతం సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. శుక్రవారం ఉదయం ఐడిఒసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమన్వయ సంప్రదింపుల సమావేశానికి రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2016 తర్వాత ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో సాగు నీటి లభ్యత పెరిగి వ్యవసాయంతో పాటు రైతుల ఆర్థిక స్థోమత పెరిగిందన్నారు. అదేవిధంగా రైతుల రుణమాఫీ సైతం జరిగి బ్యాంకుల రుణాలు అన్ని తిరిగి జమ అయ్యాయని, అందువల్ల అదేస్థాయిలో బ్యాంకర్లు రైతులకు తిరిగి రుణాలు ఇవ్వాలని కోరారు. రైతు రుణమాఫీ ద్వారా వనపర్తి జిల్లాలో దాదాపు 400 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని, వ్యవసాయ రుణాలు మాత్రం 10 శాతం దాటలేదని వాపోయారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 3454.92 కోట్లు వ్యవసాయ రుణాలు ఇచ్చేందుకు వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యంగా పెట్టుకోగా జూన్, 2024 వరకు కేవలం 324.92 కోట్లు మాత్రమే ఇవ్వడం జరిగింది. యంఎస్‌యం ఈ, ప్రయారిటీ సెక్టార్లు అయిన విద్యా, గృహ నిర్మాణం తదితర రంగాల్లో 3961 కోట్ల రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకోగ ఇచ్చింది మాత్రం 386.28 కోట్లనీ అన్నారు. జిల్లా అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వాములు కావాలని, వ్యవసాయ రుణాలతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రుణ సదుపాయం ఉన్న రంగాల పై యువతకు అవగాహన కల్పించాలని కోరారు. రైతులు పంట రుణాలకు వెళ్ళినప్పుడు ఇబ్బందులు పెట్టకుండా రుణాలు ఇవ్వాలని సూచించారు. కొన్ని బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయని, ఇంతకు ముందు రుణాలు పొంది రుణ మాఫీ జరిగిన తర్వాత తిరిగి రుణాలు అడిగితే అభ్యంతరాలు పెడుతున్నాయని కొంతమంది రైతులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. అసైన్డ్ ల్యాండ్, లావుని పట్టా భూములకు రుణాలు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అసైన్డ్ భూములు, లావుని పట్టాలు ఇచ్చింది ప్రభుత్వమేనని, ప్రభుత్వం వాటిని తిరిగి తీసుకునేది ఉంటే నష్టపరిహారం చెల్లిస్తారని అన్నారు. అలాంటప్పుడు రుణాలు ఎందుకు ఇవ్వడం లేదని బ్యాంకర్లను ప్రశ్నించారు. ఈ సమావేశంలో యల్‌డిఒ రిజర్వ్ బ్యాంక్ రెహమాన్, నాబార్డ్ ఏ.జి.యం మనోహర్ రెడ్డి, ఏపీ జీవిబి ఆర్.యం రంజిత్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, యూనియన్ బ్యాంక్ ఏజియం మురళీ, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు, బ్యాంకర్లు, కొంతమంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా ఇన్నోవేటర్ ప్రాజెక్ట్



### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ బ్యూరో, ఆగస్టు 16( జనం సాక్షి):**
మెదక్ జిల్లాలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కార్యక్రమంలో గ్రామ స్థాయి నుండి నూతన ఆవిష్కరణలను వెలికి తీయడానికి ఏర్పాటు చేసిన ఇంటింటా ఇన్నోవేటర్ ప్రాజెక్ట్ మంచి స్పందన తెచ్చుకుంది. ఈ ప్రాజెక్టును గ్రామ స్థాయిలో విస్తరించేందుకు జిల్లా మరియు జిల్లా అధికారులు ఎంతో కృషి చేశారని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ..ఈ ఏడాది ఇంటింటా ఇన్నోవేటర్ 2024 ప్రాజెక్టుకు రాష్ట్ర వ్యాప్తంగా 560 పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 170కి పైగా ఆవిష్కరణలు ఎంపికయ్యాయని చెప్పారు. మెదక్ జిల్లాకు చెందిన 14 అప్లికేషన్లలో 09 మంది ఆవిష్కర్తలు రాష్ట్ర స్థాయిలో సెలెక్ట్ అయ్యాయని అని వివరించారు. ఈ సెలెక్ట్ అయిన ఇన్నోవేటర్స్కి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తో కలిసి ప్రభుత్వం ప్రశంసా పత్రం అందించగా, ప్రతి ఒక్కరికీ 1000/- నగదు పురస్కారం జిల్లా కలెక్టర్ రాహుల్రాజ్ అందించి ప్రోత్సహించామన్నారు. ఈ ఇంటింటా ఇన్నోవేటర్ ప్రాజెక్ట్ ద్వారా గ్రామస్థాయి నుండి కొత్త ఆవిష్కరణలు వెలికి రావడం సంతోషకరం అని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ప్రాముఖ్యతను ప్రజలు గుర్తించి పాల్గొనడం అనేది జిల్లా అభివృద్ధికి చాలా కీలకం అని అన్నారు. ఎంపికైన ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడే విధంగా మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే నా ధ్యేయం

### త్వరలోనే కరెంట్ స్తంభాలను వేయిస్తా

### మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్



**మెదక్ బ్యూరో ఆగస్టు 16(జనం సాక్షి):**
సమస్యల పరిష్కారమే నా ధ్యేయం అని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం మెదక్ నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన ఎమ్మెల్యే శానాయిపల్లి గ్రామానికి చెందిన కొందరు వారి వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా..వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని హామినిచ్చారు.

# కేటీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### ఎమ్మెల్యే డా.చిట్టెం. పర్ణిక రెడ్డి



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
బస్సులో ఉచిత ప్రయాణం చేసే మహిళల పట్ల చులకనగా మాట్లాడిన మాజీ మంత్రి కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలలో ప్రత్యేకంగా మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణించే సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. మహిళల్లో ప్రభుత్వానికి మంచి పేరు రావడంతో ఓర్వలేని కేటీఆర్ బస్సులో మహిళలతో బ్రేక్ డాన్సులు, క్లబ్ డాన్సులు చేయించుకున్న పర్వాలేదు అంటూ మహిళల గురించి చులకనగా మాట్లాడడం తగదన్నారు.కేటీఆర్ మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యత గల హోదాలో పనిచేసిన కేటీఆర్ మాట్లాడిన మాటలకు రాష్ట్రంలోని మహిళలందరూ మనోవేదన గురవుతున్నారన్నారు. ఇకమీదట మహిళల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేకుంటే వారికి మహిళలే తగిన బుద్ధి చెప్తారన్నారు.

# తలుపులు తెరుచుకోని రైతు వేదికలు

- గ్రామాల్లో అందుబాటులో ఉండని ఏఈవోలు
- అధికారి భర్త వచ్చాడు అంటే వణికి పోతున్న ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు






**కొల్చారం ఆగస్టు 16 (జనం సాక్షి)**
కొల్చారం మండల వ్యవసాయ శాఖ సిబ్బంది పనితీరు అస్తవ్యస్తంగా మారింది. మండల స్థాయి అధికారి విధుల్లో భర్త జోక్యం విపరీతంగా పెరిగిపోయింది. అధికారి భర్త వసూల్ రాజాగా మరి మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు అనే విధులకు సరిగా హాజరు కాకపోవడం క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడంతో సిబ్బంది సైతం విధులకు గైర్హాజరవుతున్నారు రోజుల తరబడి మండలంలోని రైతు వేదికలు తాళాలు తీయడం లేదు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు రైతు వేదికల్లో రైతులకు అందుబాటులో ఉండాల్సిన ఏఈవోలు టూర్ పేర విధులకు ఎగనామం పెడుతున్నారు. దీంతో రైతు వేదికలో సమస్య పరిష్కారం కాక రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయానికి వస్తే మండల కార్యాలయంలో సైతం ఖాళీగా కుర్చీలు దర్శనమిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం మండల స్థాయి అధికారి భర్త అవినీతి అక్రమాల కారణంగా మండల రైతులు, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు గతంలో ప్రతిరోజు తమ రైతు వేదిక పరిధిలో రైతు పంట పొలాలకు వెళ్లి జియో ట్యాగింగ్ ద్వారా హాజరు నమోదు చేసేవారు. దీంతో ఏఈవోలు ప్రతిరోజు విధులకు హాజరయ్యేవారు. రైతుల సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అయ్యేవి. కానీ కొన్ని నెలలుగా వ్యవసాయ ఉన్న శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామస్థాయిలో ఏఈఓలు అందుబాటులో ఉండడం లేదు... ఇక మండల కార్యాలయానికి వచ్చిన దాఖలాలు సైతం కనిపించడం లేదు..కొల్చారం మండల వ్యవసాయ అధికారి భర్త, భార్య విధుల్లో జోక్యం చేసుకుంటూ ఎరువుల దుకాణాల వద్ద వసూలు చేస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. యధారాజా తథా ప్రజా అన్నట్లు..మండల వ్యవసాయ అధికారి విధులకు ఎగనామం పెడుతూ ఉండడంతో కిందిస్థాయి సిబ్బంది కూడా అదేవిధంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ ప్రకటించిన నేపథ్యంలో రుణమాఫీ రాని రైతులు శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయానికి రాగా 11గంటలు అయినప్పటికీ అధికారులు ఎవరూ రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ సిబ్బంది సమయపాలన పాటించనప్పటికీ కార్యాలయం తెరిచి ఫ్యాన్లు తిరుగుతుండడం పలువురుని విస్మయానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారు లు జోక్యం చేసుకొని మండలంలో వ్యవసాయ అధికారుల పనితీరులు మార్పు వచ్చేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



# కౌకుంట్ల మండల కేంద్రానికి అన్ని సౌకర్యాలు కల్పించాలి

### రెవెన్యూ మంత్రికి వినతి పత్రంఅందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
దేవరకద్ర నియోజకవర్గంలోని కౌకుంట్ల మండల కేంద్రానికి అన్ని సౌకర్యాలు కల్పించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కౌకుంట్ల మండలం కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కలిశారు . కౌకుంట్ల మండలం గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని , మండల కేంద్రంలో ఎంపీడీవో , పోలీస్ స్టేషన్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు లేవని, ఈ మండలం కాగితాలకే పరిమితమైంది తప్ప అభివృద్ధికి నోచుకోలేకపోయిందనీ ఎమ్మెల్యే జిఎంఆర్ రెవెన్యూ మంత్రికి వివరించారు. కౌకుంట్ల మండలానికి సంబంధించి గత బిఆర్ఎస్ ప్రభుత్వం గెజిట్ పై నోటిఫై చేయకపోవడంతో తహసిల్దార్ తదితర ప్రభుత్వ అధికారులకు గత సంవత్సర కాలంగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మండలంకు సంబంధించి గెజిట్ పై నోటిఫై చేసి ఎంపీడీవో ఆఫీస్, పోలీస్ స్టేషన్ తదితర ప్రభుత్వ కార్యాలయాలను కౌకుంట్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి కి మండల కాంగ్రెస్ నాయకులతో కలసి ఎమ్మెల్యే జీఎంఆర్ వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి , మరియు పలువురు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళాలకు కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలి

### మహబూబ్ నగర్ జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు బి. సాహితీ రెడ్డి



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు మహిళలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని మహబూబ్ నగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బి. సాహితీ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె 'జనం సాక్షి'తో మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవని దెబ్బతీసే విధంగా సభ్యసమాజం తలదించుకునేలా కేటీఆర్ వ్యాఖ్యలు ఉన్నాయని అన్నారు. కేటీఆర్‌కు మహిళలంటే ఏమాత్రం గౌరవం లేదని, ఆయన ఓ సంస్కారహీనుడని ఆమె ఘాటుగా విమర్శించారు. ఎంతో సంతోషంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతం జరుపుకునే మహిళలకు కేటీఆర్ వ్యాఖ్యలు బాధ కలిగిస్తున్నాయన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారంతా పేద, మధ్యతరగతి మహిళలే అని కేటీఆర్ అనడాన్ని బట్టి చూస్తే, కేటీఆర్‌కు డబ్బుందనే అహంకారంతో పేద, మధ్య తరగతి మహిళలను అవమానిస్తున్నారనీ ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల విషయంలో అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో రకంగా మాట్లాడటం కేటీఆర్ నైజమన్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ముక్కు నేలకు రాసి రాష్ట్ర మహిళాలోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలనీ ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేటీఆర్ ను బయట తిరగనీయమని, బీజేపీ మహిళా మోర్చా పక్షాన తగిన బుద్ధిచెబుతామని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కేటీఆర్ పై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

# సంక్రమిత వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి,ఆగస్టు 16 (జనంసాక్షి):**
డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి జ్వరాలు నమోదు అవుతున్న ప్రాంతాలలో ఫీవర్ సర్వే పకడ్బందీగా చేయాలని ,సంక్రమిత వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. డ్రై డే సందర్భంగా శుక్రవారం వనపర్తి మున్సిపాలిటీలో బ్రహ్మం గారి వీధి, గోపాల్ పేట మండలంలో జయన్న తిర్మలాపూర్ ప్రాంతాల్లో జరుగుచున్న డ్రై డే కార్యక్రమాలను పరిశీలించారు. జయన్న తిర్మలాపూర్ గ్రామంలో గత నెల డెంగ్యూ కేసు నమోదు అయిన ఇంటిని సందర్శించారు. ఇంటి వారితో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చుట్టుపక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిలువ ఉన్న నీటిలో డెంగ్యూ కారకమయ్యే దోమలు గుడ్లు పెడతాయని, అందువల్ల ఎక్కడ నిలువ నీరు ఉండకుండా పారవేయాలని, వర్షపు నీరు గుంతల్లో చేరకుండా ఏర్పాట్లు చేసుకోవాలని కాలని వాసులకు అవగాహన కల్పించారు . ప్రతి శుక్రవారం అర గంట సమయం కేటాయించి నిలువ నీరు పారబోస్తే దోమల వ్యాప్తిని అరకట్టవచ్చు అన్నారు. జ్వరాలు నమోదు అవుతున్న ప్రాంతాల్లో జ్వరం సర్వే నిర్వహించి రక్త నమూనాలు సేకరించి వ్యాధి లక్షణాలు కనుక్కోవాలని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లు, స్టాక్ నిల్వలు పరిశీలించారు. గోపాల్ పేట మండల ప్రత్యేక అధికారి లక్ష్మి బాయి, వైద్య శాఖ నుండి ప్రోగ్రాం ఆఫీసర్ డా. సాయినాథ్ రెడ్డి, తహసిల్దార్ తిలక్, ఎంపీడీఓ శంకర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, కౌన్సిలర్ బ్రహ్మ చారి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



### నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

### మంత్రి దామోదరకు విన్నవించిన ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్చెరు ఆగస్టు16(జనంసాక్షి)
పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని మంత్రి నివాసంలో కలిసి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ప్రధానంగా మౌలిక సదుపాయాల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కోరారు. పటాన్చెరు పట్టణంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.





# మహాయాన బౌద్ధ మతంలో.. మహిళల స్థానం

**స్త్రీల పట్ల వివక్ష అనేది ప్రపంచంలో సర్వసాధారణ విషయం. కొన్ని మతాలలో ఆత్మ కేవలం పురుషులలో మాత్రమే ఉంటుందని, స్త్రీలలో ఉండదని భావన. కానీ, గౌతమ బుద్ధుడు తన భిక్కుని సంఘం ద్వారా మొట్టమొదటి ఆధ్యాత్మిక రంగంలో సాంస్కృతిక విషయాలలో స్త్రీలను వంటింటి నుండి బాహ్య ప్రపంచంలోకి మార్గాన్ని తన రచనలు మరియు ఆచరణాత్మక విధానమైన భిక్కుని సంఘం ద్వారా స్త్రీలను ప్రోత్సహించారు. పూర్వ విమర్శకుల అభిప్రాయాలు, బుద్ధ భిక్కుణీల అనుభవాలను క్రోడీకరిస్తూ వివిధ పూర్వ పరిశోధనల వ్యాసాల ఆధారంగా విశ్లేషనాత్మక పద్ధతిలో ఈ వ్యాసాన్ని అందించడం జరిగింది. ఆధ్యాత్మిక వికాస రంగంలో మహిళలకు సమానమై న అవకాశాలను కల్పించిన మొదటి మత గురువు గౌతమ బుద్ధుడు. మహిళల సహజ ధోరణులు, బలహీనతలను ఆయన అనేక సందర్భాల్లో ఎత్తి చూపినప్పటికీ, స్త్రీల సామర్థ్యాలు గుర్తించి ప్రోత్సహించాడు.**

**– డాక్టర్ చింతల వెంకట శివసాయి**

బిక్కుని సంఘం అని పిలువబడే సన్యాసినుల క్రమం సన్మార్గంలో ప్రవేశానికి అర్హత కల్పించడం ద్వారా మత రంగంలో మహిళల పూర్తి భాగస్వామ్యానికి బుద్ధుడు ద్వారాలు తెరిచాడు. ఇది నిజంగా మహిళలకు సంస్కృతి మరియు సామాజిక సేవ చేయడానికి కొత్త మార్గాన్ని తెరిచింది. ఇది నిజంగా మహిళలకు సంస్కృతి మరియు సామాజిక సేవ చేయడానికి కొత్త మార్గాన్ని తెరిచింది. ప్రజా జీవితానికి అవకాశాలు సమాజానికి వారి ప్రాముఖ్యత గుర్తించి మహిళల స్థాయిని బాగా పెంచింది. బుద్ధుని బోధనలను రెండు భాగాలుగా విభజించవచ్చు: 1) తాత్విక 2) నైతికత. ఒకదాని కొకటి తెలియకుండా సరిగ్గా అర్థం చేసుకోలేని విధంగా రెండు సమూహాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. బుద్ధుని తత్వశాస్త్రం యొక్క ప్రాథమిక సూత్రం ఒక జీవి యొక్క నిరంతర ఉనికి కారణాలు, ప్రభావాల చక్రం లాంటి సిద్ధాంతం. అతను ప్రతి ఒక్కరి సంక్షేమం, ఆనందం కోసం ధర్మాన్ని బోధించాడు. బుద్ధుడు మూఢ ఆచారాలు, వేడుకలు, అవమానకరమైన సన్యాసి పద్ధతులను అంగీకరించలేదు. కుల భేదాలను తొలగించడానికి ప్రయత్నించాడు. ఒకరి పుట్టుకతో బ్రాహ్మణుడు కాలేడు. ఒకరు పుట్టుకతోనే బహిష్కరించబడరు. ఒక వ్యక్తి చర్య ద్వారా బ్రాహ్మణుడు అవుతాడు. ఒకరు చర్య ద్వారా బహిష్కరించబడతారు. ఈ ఉపమానం నుండి బుద్ధుని బోధన మనిషిని భద్రత, శాంతి, ఆనందం, ప్రశాంతత, మోక్షం కోసం తీసుకువెళ్ళడానికి ఉద్దేశించబడినది. బుద్ధుడు బోధించిన మొత్తం సిద్ధాంతం ఈ ముగింపుకు దారి తీస్తుంది. అతను ఆచరణాత్మక ఉపాధ్యాయుడు. మనిషికి శాంతి, ఆనందాన్ని కలిగించే విషయాలను మాత్రమే బోధించాడు. బుద్ధుడు అందరికీ విముక్తి కల్పించాడు. బుద్ధుడు తన శిష్యులలో ఎవరిపైనా గ్రహించినప్పుడు మగ, ఆడ ఇద్దరికీ ప్రకృతి ఆధ్యాత్మిక జ్ఞానం ఉందని, వారికి తన దయగల మార్గదర్శకత్వాన్ని అందించాడు. భిక్కుం సోనా అరాహత్‌షిప్‌ను పొందింది. ప్రభువు ఆమె జ్ఞానం పరిపక్వం చెందడం చూసి, కీర్తిని పంపి, ఆమె (ఆమె ముందు కూర్చున్నట్లుగా కనిపించింది. హోమర్ స్త్రీ పట్ల బుద్ధుని యొక్క సాధారణ వైఖరిని ఈక్రింది విధంగా సంగ్రహించాడు.

మాస్టర్ యొక్క వ్యక్తిత్వం, అతను స్త్రీలను కలిగి ఉన్న గౌరవం, అతను వారిపట్ల స్థిరంగా చూపిన వ్యత్యాసం, పరిశీలన, సమకాలీన సమాజాన్ని ఆకట్టుకోవడంలో విఫలం కాలేదు. అతని జీవితంలోని ఈ అంశం ఉద్యమం యొక్క ప్రారంభ వ్యాప్తిలో సన్యాసుల ఉద్యమ స్థాపకుడి వ్యక్తిత్వం ప్రధాన కారకంగా ఉన్న విధానానికి ఉదాహరణ.

మహిళలతో గౌతమ యొక్క పద్ధతులు, పురుషులకు సెట్ చేసిన ఉదాహరణ మహిళల స్థితిని పెంచడంలో శక్తివంతమైన శక్తులుగా ఉండాలి. వారు తిరిగి చెల్లించిన ఒక వరం. బుద్ధుని సిద్ధాంతం మహిళలపై ప్రభావం: ధనవంతులు లేదా పేదలు, వివాహితులు లేదా అవివాహితులు, వారు బుద్ధుని ధర్మం యొక్క ఆకర్షణీయమైన శక్తితో కదిలిపోయారు. సంతోషకరమైన పునర్జన్మను ఆశించి లేదా వినాశనం కోసం పవిత్రమైన జీవితాన్ని గడపడానికి ప్రపంచాన్ని త్యజించారు. ప్రతి మతతత్త్వవేత్త సంప్రదాయం నుండి కొన్ని లక్షణాలను వారసత్వంగా పొందుతాడు. అతని స్వభావం, వైఖరులు పర్యావరణం మరియు అతను నివసించే సమాజం నుండి నేరుగా అతనిపై పనిచేసే వివిధ శక్తులచే రూపొందించబడ్డాయి. "గౌతమ బుద్ధుడు ఈ వాస్తవానికి మినహాయింపు కాదు. అందువల్ల, మహిళల పట్ల సాధారణ వైఖరిని అర్థం చేసుకోవడానికి ఒక ప్రయత్నం చేయాలి. ఇది వారిలో అతని సన్నిహిత అనుబంధం ఫలితంగా అతని మనస్సులో అభివృద్ధి చెందింది. స్త్రీల పట్ల తన భావాల గురించి ఏదైనా తీర్పు చెప్పే ముందు అతని జీవిత కథ యొక్క ప్రారంభ కాలాన్ని పరిశీలించడం చాలా ముఖ్యం. ఒక విషయం స్పష్టంగా ఉంది". పురుషులు వలె స్త్రీలు ఆధ్యాత్మిక లక్ష్యాలను సాధించగలరని బుద్ధుడు భావించాడు. ఇది మహిళల జీవితంలోని మతపరమైన రంగంలో ఒక ప్రత్యేకమైన సంప్రదాయాన్ని స్పష్టంగా ఏర్పాటు చేస్తుంది. బౌద్ధ మతానికి ముందు, ఒక కుమార్తె పుట్టుకను విపత్తుగా, ఆధ్యాత్మిక సాధనకు అడ్డంకిగా చూడటం సాధారణ సంప్రదాయం. కానీ, బౌద్ధ ఉద్యమం ఈ అన్యాయమైన ధోరణిని ముగించింది. స్త్రీలను పూర్తిగా సమర్థులుగా అంగీకరించింది. దీనికి సంబంధించి పురుషులతో సమానమైన పాత్రను పోషించగలదు. ఆధ్యాత్మిక అభివృద్ధి. గౌతముడు కుమార్తెలను అంగీకరించే ప్రగతిశీల దృక్పధానికి మద్దతు ఇచ్చాడు. మల్కి రాణి ఒక కుమార్తెకు జన్మనిచ్చిందని ఒక దూత రాజు ప్రసేనుడికి చెప్పినప్పుడు, అతను చాలా బాధపడ్డాడు. బుద్ధుని దృక్పథం, ఆ సందర్భంగా రాజు ప్రసేనుడికి చెప్పిన దాని నుండి స్పష్టంగా తెలుస్తుంది. ఆ సమయంలో ప్రబలంగా ఉన్న సాధారణ ప్రజాభిప్రాయానికి చాలా భిన్నంగా ఉంటుంది. స్త్రీల లక్షణాలపై ఆయనకున్న ప్రశంసలు అద్భుతమైన భాషలో ఉన్నాయి. "ఒక స్త్రీ బిడ్డ, ఓ ఆర్డ్ ఆఫ్ మెన్, చాలా మంది నిరూపించారు. మగవారి కంటే మెరుగైన సంతానం కూడా ఎందుకంటే ఆమె తెలివైన, సద్గుణ వంతురాలిగా పెరుగుతుంది. ఆమె భర్త తల్లి గౌరవం, నిజమైన భార్య ఆమె భరించే బిడ్డ గొప్ప పనులు చేయవచ్చు, గొప్ప భార్య అతని దేశం యొక్క గైడ్ అవుతుంది. ఇక్కడ బుద్ధుడు ఒక ప్రకటన ఇచ్చాడు. ఇది తెలివైన, సద్గుణవంతులైన స్త్రీ పురుషుల కంటే మెరుగ్గా ఉండవచ్చు. అంతేగాక, స్త్రీలు, పురుషుల తల్లుల కంటే బుద్ధుని ఎత్తి చూపాడు. ఒక వ్యక్తి గొప్ప రాజ్యం యొక్క ప్రసిద్ధ నియమాలు లేదా మతపరమైన జీవితానికి దారితీసే మార్గం అయితే, అతనికి జన్మనిచ్చిన లేదా ఈ ప్రపంచంలోకి తీసుకువచ్చిన తల్లి ఉందని అంగీకరించాలి. నిజం ఏమిటంటే, స్త్రీలు కూడా నైతికత, ధర్మం యొక్క మార్గంలో నడుస్తారని మనం తిరస్కరించలేము. మహాప్రజాపతి, సవతి తల్లి, బుద్ధుని అత్త, బహుశా చాలా మంది హిందూ వితంతువుల వలె ఆధ్యాత్మిక ఆసక్తిని కలిగి ఉండవచ్చు. ఆమె భర్త రాజు శుద్ధోదన మరణించినప్పుడు, ఆమె ఆర్డర్‌లో చేరాలనే కోరికను వ్యక్తం చేసింది. మైత్రేయి ఉపనిసాదిక్ కాలంలో ఉన్నందున ఆమె భిక్షుణీ సంఘ చరిత్రలో అత్యుత్తమ సంస్కృతి మరియు మతపరమైన వ్యక్తిగా మారింది. గౌతముడికి తెలిసిన మొదటి మహిళ మహాప్రజాపతి మరియు ఆమె తన సొంత కొడుకు కంటే కూడా అతనిని చాలా జాగ్రత్తగా చూసుకుంది. ఈ సన్నిహిత సంబంధం ద్వారా ఆమె తన చిత్తశుద్ధి మరియు భక్తితో గౌతముని విపరీతంగా ప్రభావితం చేసి ఉండాలి. ఆమె అంకితభావం కలిగిన మహిళ ఆమె ఆర్డర్ మహిళల ప్రవేశం కోసం ఛాంపియన్‌గా తగినంతగా అంగీకరించబడుతుంది. ప్రసిద్ధ వేశ్య అంబపాలి కథను మేము చదివాము. ఆమె మామిడి చెట్టు పాదాల వద్ద రాజు తోటలోని వైసాలిలో జన్మించింది. నగరం యొక్క తోటమాలి ఆమె పైకి ఆమె మామిడి తోటమాలి అమ్మాయి అని పిలుస్తారు. అంబపాలి అని పేరు పెట్టారు. ఆమె పెద్దయ్యాక ఆమె చాలా అందంగా మారింది. వేశ్యగా మారింది. వైసాలిలో ఒక చట్టం ఉంది. ఒక పరిపూర్ణ మహిళ వివాహం చేసుకోవడానికి అనుమతించబడదు. కానీ, ప్రజల ఆనందాల కోసం ప్రత్యేకించబడినవి. ఆమె అందమైన మనోహరమైన ఆహ్లాదకరమైన రంగు యొక్క అత్యున్నత సౌందర్యంతో బహుమతిగా ఉంది. డ్యాన్స్, గానం మరియు వీణ వాయించడంలో బాగా ప్రావీణ్యం కలవారు. ఆమెను కోరుకునే వ్యక్తులు ఎక్కువగా సందర్శించేవారు. ఆమె యాఖ్కె కహనాస్‌ని ఒక రాత్రి కోసం అడిగారు. బింబిస్మా మగధ రాజు ఆమెను వైసాలిలో సందర్శించి ఏడు రోజులు ఆమెతో ఉన్నాడు. అంబసాలి రాజు బిడ్డను గర్భం దాల్చాడు. అతనికి ఒక కొడుకు పుట్టాడు. అతను తరువాత అభయ నిర్భయ అని పిలువబడ్డాడు. ఒకరోజు అంబసాలి బుద్ధుడు వైశాలిలోని తన తోటలో ఉన్నాడని విన్నాడు. ఆమె అతనిని చూడటానికి వెళ్ళింది. బుద్ధుడు ఆమెకు ధర్మాన్ని బోధించాడు. ఆమె అతనితో సంతోషించి తన ఇంట్లో ఆహారం తీసుకోమని ఆహ్వానించింది. లిచ్చావిలు అంబపాలిని బుద్ధుడిని వారి స్థానంలో భోజనం చేయడానికి అనుమతించమని అడిగారు. కానీ, ఆమె నిరాకరించింది. వేశ్య బుద్ధునికి విలాసవంతంగా తినిపించింది. తరువాత ఆమె తన అరమను భిక్కు సంఘానికి అందించింది. దానిని బుద్ధుడు అంగీకరించాడు. బుద్ధుడు ఇష్టపడినప్పుడు అరమాలో ఉండి ఆపై వేలువగ్గమకకి వెళ్ళాడు. మరో సందర్భంలో బావి వద్ద ఉన్న స్త్రీల సంఘటన తక్కువ కులానికి చెందిన బాలిక కేసు వివరించబడినది. ఆనంద నీరు కోరిన మాతంగ కులానికి చెందిన ప్రకృతి అనే అమ్మాయి అతని అభ్యర్థనను అంగీకరించడానికి నిరాకరించింది. ఆమె తక్కువ కులానికి చెందిన నేను కులం కోసం కాదు వాటర్ కోసం అడుగుతున్నాను ఆనంద చెప్పాడు. ఆమె ఆనందానికి త్రాగడానికి నీరు ఇవ్వడంతో మాతంగ అమ్మాయి హృదయం ఆనందంగా దూకింది. ఆచార్య వారిని సమానంగా చేసింది. ఆ తర్వాత ఆమె దూరంలో ఉన్న ఆనందను అనుసరించడం ప్రారంభించింది. ఆశీర్వాదం పొందిన వ్యక్తి కోసం వెతకడం ప్రారంభించింది. ఆమె అతని శిష్యుడు, అతని కోరికలను పరిచర్య చేసే ప్రదేశంలో నివసించడానికి అనుమతి కోరింది. ఎందుకంటే ఆమె చెప్పింది నేను ఆనందను ప్రేమిస్తున్నాను. బుద్ధుడు ఆమె చేసిన అభ్యర్థన కోసం అమ్మాయిని దూషించలేదు. బదులుగా అతను ఆమె ఆలోచనలను ఉన్నత ఛానెల్‌లోకి మళ్ళించాడు. బౌద్ధ పూర్వ కాలంలో బుద్ధుని కాలంలో స్త్రీల స్వభావం మరియు స్థితిపై వివరణ అన్నికాలాలలో స్త్రీల స్వభావం ప్రతి మానవుని స్వభావానికి పర్యాయ పదంగా పరిగణించబడుతుందని సూచించింది. పురుషులు మరియు స్త్రీలలో సానుకూల మరియు ప్రతికూల స్వభావం రెండూ ఉన్నాయి.



.. మిగతా రేపటి సంచికలో

## ఆర్ఎంపీ,పీఎంపీలకు నిర్దేశిత సమావేశం

- ప్రథమ చికిత్స కేంద్రంలోని బోర్డులో డాక్టర్ అని పెట్టకూడదు
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్
- ఆర్.యం.పి. లకు నిర్దేశిత సమావేశం



**పెద్దపల్లి,ఆగస్టు 16(జనంసాక్షి) :** కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని ఆర్. ఎం. పి. లకు నిర్దేశత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. ప్రమోద్ కుమార్, మాట్లాడుతూ ఆర్.ఎం.పి.లు ఎవరు కూడా వారి పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదని,వారి క్లినిక్ ల యందు ప్రథమ చికిత్స కేంద్రము అని మాత్రమే పెట్టుకోవాలని కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని అన్నారు. ప్రిస్క్రిప్షన్ వ్రాయడం గాని, ల్యాబ్ టెస్టులు వ్రాయడం గాని చేయరాదన్నారు. ఇంజక్షన్లు ఇవ్వడం, ఐ.వి. ప్లూయిడ్స్ ఇవ్వడం, యాంటీబయాటిక్ మందులు ఇవ్వడం లాంటివి చేయరాదని అన్నారు. వారి ప్రాథమిక చికిత్స స్థాయికి మించి ఎటువంటి వైద్యం చేయరాదని, ఇవి పాటించని యెడల చట్టపరమైన చర్యలకు గురికావాల్సి వస్తుందని వారికి తెలిపారు. వివిధ అనారోగ్య సమస్యలకు ప్రథమ చికిత్స లు ఏమి చేయవచ్చును అనే అంశం పైన వారికి అవగాహన కల్పించారు. ఆర్ఎంపీలు డెంగ్యూ రాపిడ్ టెస్టు చేయవద్దు అని అన్నారు. డెంగ్యూ అనుమానిత కేసులను మీ సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు పంపాలని సూచించారు. ఆర్.యం,పి.లు ప్రతి శుక్రవారం జరిగే డ్రైడే అండ్ ఫ్రైడే కార్యక్రమములో పాల్గొనవలసినదిగా కోరారు. ప్రైవేట్ హాస్పిటల్స్ డాక్టర్స్ కు విర్చువల్ సమావేశం ,ప్రైవేట్ హాస్పిటల్ డాక్టర్స్ కు విర్చువల్ గా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రైవేట్ హాస్పిటల్ లను ఉద్దేశించి మాట్లాడుతూ వారు తప్పకుండా రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయించుకోవాలని హాస్పిటల్స్ ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం నడపాలని అన్నారు. అన్ని హాస్పిటల్స్ ల యందు ఇంగ్లీష్ తెలుగులో టారిఫ్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆ రేట్స్ ప్రకారమే పేషెంట్స్ వద్ద ఫీజులు తీసుకోవాలని అన్నారు. డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్. ప్రసన్న కుమారి, డాక్టర్. శ్రీరాములు సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాల్సిందే..

- రియల్ ఎస్టేట్ అసోసియేషన్



**జగిత్యాల బ్యూరో(జనంసాక్షి):**ఇళ్ల స్థలాల సాధన కోసం జగిత్యాల జర్నలిస్టులు చేపట్టిన నిరసన దీక్ష 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. జర్నలిస్టుల న్యాయమైన కోరికలు ప్రభుత్వం వెంటనే తీర్చాలని కోరారు. సమస్య పరిష్కారమయ్యే వరకు తాము మద్దతు ఇస్తామని ప్రకటించారు. జగిత్యాల రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు దీక్షా చేపట్టిన జర్నలిస్టులకు తమ సంఘీభావం తెలుపుతూ 14వ రోజు దీక్షలను నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగు శ్రీనివాస్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్లస్థలాలు మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రజా సేవ కోసమే పనిచేస్తున్న జర్నలిస్టుల న్యాయమైన కోరికను తీర్చే విధంగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు జమాల్, తిరుపతి, శేఖర్, అబ్దుల్ సలాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ దీక్షలో జగిత్యాల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

## పద్మశాలి రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక

- సంఘం సభ్యులందరూ పాల్గొనాలి
- సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య



**రాజన్న సిరిసిల్ల బ్యూరో(జనంసాక్షి)**

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుని ఎన్నిక కోసం జరిగే ఎన్నికల్లో పద్మశాలి కులస్తులు పాల్గొనాలని జిల్లా అధ్యక్షులు గాజుల బాలయ్య కోరారు. శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో గాజుల బాలయ్య తో పాటు పలు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక కోసం ఈనెల 18న ఎన్నికల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ పరిధిలో ఎన్నికలు జరుగుతాయి అన్నారు. 1803 మందికి ఎన్నికలు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా పరిధిలో ని అన్ని మండలాల నుండి పద్మశాలి కులస్తులు హాజరై ఫోటోకు వినియోగించుకోవాలని కోరారు. సభ్యత్వం రసీదు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని అన్నారు. సిరిసిల్ల పరిధిలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో ఉదయం7 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ఉంటుందని అన్నారు.. అధ్యక్షులుగా బూర మల్లేశం,వి. రాజ్ కుమార్, పోటీ పడుతున్నారని నచ్చిన వారికి ఓటు వేయచ్చు అని తెలిపారు. ఎన్నికల ఇన్చార్జిగా గోనె ఎల్లప్ప బాధ్యులుగా ఉన్నట్లు తెలిపారు. జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కొండ ప్రతాప్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోనె ఎల్లప్ప, కోశాధికారి గడ్డం విట్టల్, ఉపాధ్యక్షులు జక్కని లక్ష్మీనారాయణ ,నాగుల విష్ణు ప్రసాద్ ,గాజుల హరి, వెంగళ రవీందర్ ,వెంగళ కృష్ణ హరిరిక్కు మల్ల సంపత్ , యేళ్లే బాలకృష్ణ, మెరుగు నాగభూషణం పాల్గొన్నారు.

## రామగుండం జెన్కో స్థలాల పరిశీలన

**రామగుండం(జనంసాక్షి):** పట్టణంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ థర్మల్ విద్యుత్ కేంద్రానికి చెందిన స్థలాలను. శుక్రవారం హైదరాబాద్ నుండి వచ్చిన సివిల్. హెచ్ ఆర్ డైరెక్టర్లు సచ్చితనంద. అజయ్ కుమార్ లు క్షేత్రస్థాయి పరిశీలన చేసారు. రామగుండం చేరుకున్న వీరికి బీ థర్మల్ ఎస్ఈ విజేందర్. ఇతర అధికారులు. ఆర్ టీఎస్. జెఏసి నాయకులు పుష్ప గుచ్చం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. స్థానిక బీ థర్మల్ కేంద్రం మూత పడిన నేపథ్యంలో. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మఖన్ సింగ్ ఇటీవల అసెంబ్లీలో 800 మెగావాట్ల నూతన విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం సైతం నూతన విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు సానుకూలంగా స్పందించింది. ఈ నేపథ్యంలో రామగుండంలో నూతన విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు సరిపడా స్థలం అనుకూలంగా ఉందా. యాష్ పాండ్ ఎక్కడ ఏర్పాటు చేయాలి అనే విషయాలపై చేర్చించి. గతంలో బీ థర్మల్ విద్యుత్ కేంద్రం స్థాపన కోసం సేకరించిన రాయదండి. మల్యాల పల్లి గ్రామాలలోని లోని జెన్కో కు చెందిన స్థలాలను పరిశీలించారు వీరి వెంట ఎస్ఈ విజేందర్. ఇతర అధికారులు డి శంకరయ్య. కే శ్రీనివాస రావు. సూర్యనారాయణ రెడ్డి. తదితరులు ఉన్నారు.

## గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షల సమయంలో మార్పులు

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల సమయంలో మార్పులు చేసినట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. తాజాగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్చినట్లు వెల్లడించింది. ఇది వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపామని, ఆ సమయాన్ని మార్చుతూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది. అక్టోబర్ 21 నుంచి అక్టోబర్ 27 వరకు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంది.

## కవిత బెయిల్‌కు.. భాజపాకి సంబంధం లేదు

**హైదరాబాద్(జనంసాక్షి):**త్వరలోనే కాంగ్రెస్‌లో భారాస విలీనం అవుతుందని భాజపా నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఏఐసీసీ, కేటీఆర్‌కు పీసీసీ, కవితకు రాజ్యసభ సీటు ఖాయమన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. "పొత్తు పెట్టుకొని పదువులు పంచుకున్న చరిత్ర కాంగ్రెస్, భారాసది. కవిత బెయిల్‌కు.. భాజపాకి ఏం సంబంధం? భారాసను విలీనం చేస్తే బెయిల్ వస్తుందనడం మూర్ఖత్వం. కవిత బెయిల్ విషయంలో కావాలనే భాజపాపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయట్లేదు?"అని ప్రశ్నించారు. భాజపాలో భారాస విలీనంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై భాజపా నేత, ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. అదంతా నిజం కాదని, ఊహాజనితమని అన్నారు. అది కాంగ్రెస్ విషప్రచారమని మండిపడ్డారు. అది జరగదని, భాజపాలో అలాంటి చర్చ ప్రస్తావనే లేదని తెలిపారు. రుణమాఫీ పూర్తిగా జరిగిందన్న ప్రభుత్వం ప్రకటన బోగస్ అన్నారు. రుణమాఫీ రూ. 72వేల కోట్లు ఉండగా.. విధివిధానాల పేరుతో రూ.34వేల కోట్లకు కుదించారని ఆరోపించారు. హైడ్రా పేరుతో జరుగుతోన్న హైడ్రామాను ఆపాలని, అక్రమ కట్టడాల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పుకొంటున్న ప్రభుత్వం.. చిత్తశుద్ధి ఉంటే నిర్మాణాలు జరగకుండా చూడాలని అన్నారు.

## ఎలిగేడులో రైతు రుణమాఫీ సంబరాలు



**సుల్తానాబాద్,ఆగస్టు 16(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీకి హర్షం వ్యక్తం చేస్తూ ఎలిగేడు మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే విజయరమణ రావు ఆధ్వర్యంలో రైతులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎడ్లబండి తో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని వరంగల్ డిక్లరేషన్ లో హామీ ఇచ్చిన విధంగా ఈరోజు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసి చూపించారని అన్నారు. ఎలిగేడు మండల రైతులు, రైతు నాయకులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**శుద్ధ జల కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణ రావు**

సుల్తానాబాద్,ఆగస్టు 16(జనంసాక్షి) : ఓదెల మండలం, బయమ్మపల్లి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే మాతృమూర్తి అయిన విజయలక్ష్మి ట్రస్ట్ ఆధ్వర్యంలో శుద్ధ జల కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం 5 లక్షల రూపాయల నిధులతో అంతర్గత సి.సి రోడ్డు శంకుస్థాపన బోర్ వేల్ ను పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,బయమ్మపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ



**సుల్తానాబాద్(జనంసాక్షి):** సుల్తానాబాద్ పట్టణానికి చెందిన నమస్తే తెలంగాణ రిపోర్టర్ బైరగోని రవీందర్ బిఆర్ఎస్ నాయకులు బైరగోని ప్రభాకర్ గౌడ్ తండ్రి భైరగోని బక్కయ్య ఇటీవల అనారోగ్యం తోమృతి చెందడంతో శుక్రవారం ఆల్ ఫోర్స్ పాఠశాలల అధినేత నరేందర్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి బక్కయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## స్టాక్‌మార్కెట్‌పై అవగాహన అవసరం

**ఒడిదుడుకులపై అప్రమత్తంగా ఉండాలి:వెంకట కుమార్**

**సుల్తానాబాద్,ఆగస్టు 16(జనంసాక్షి) :**

స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులపై పెట్టుబడిదారులకు అవగాహన అవసరమని ఎంసీఎక్స్ మెటల్ అండ్ ఎనర్జీ సంస్థ ప్రతినిధి వెంకట కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శ్రీవాణి డిగ్రీ,పిజి కళాశాలలో మూలధన మార్కెట్లలో మదుపు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట కుమార్ మాట్లాడుతూ స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టే ముందుగా ఆయా సంస్థల పురోగతి, వ్యాపార వాణిజ్యస్థాయి, మార్కెట్లో షేర్ క్యాపిటల్, టర్నోవర్, ఉద్యోగుల సంఖ్య తదితర విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. అగ్రశ్రేణి కార్పొరేట్ సంస్థల పనితీరును పరిశీలించాలని తెలిపారు. స్టాక్ కు కమోడిటీకి వ్యత్యాసాలతోపాటు కమోడిటీ లో వర్తకం చేస్తున్నప్పుడు కలిగే ప్రయోజనాలు వాటిలో రిస్క్, నష్టాలను వివరించారు. సదస్సులో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక ప్రిన్సిపల్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్ ఆధ్యాపకులు అంబటి కుమార్, రహీం రచన మేడం విద్యార్థినిలు పాల్గొనడం జరిగింది.



## స్పందించిన అధికార యంత్రాంగం

**సుల్తానాబాద్,ఆగస్టు 16(జనంసాక్షి) :**

ర్యాకల్దేవ్‌పల్లి శివారు లో ఉన్నటువంటి శ్రీ మల్లకార్జున రైస్ మిల్ యాజమాన్యం మిల్ నుండి వచ్చే వేస్టేజ్ నీటిని ఎస్సారెస్పీ కెనాల్ కి వదలడం వల్ల నారాయణపూర్ (కొత్తపేట) కెనాల్ చుట్టుపక్కల ఉన్న కుటుంబాలకు దుర్వాసన తో పాటు దోమల తో ఇబ్బంది పడుతున్న విషయం పై జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత శుక్రవారంపరిశీలించారు. ఇట్టి విషయంపై సంబంధిత శ్రీ రైస్ మిల్ యాజమాన్యాన్ని ఇలాంటి సంఘటన మళ్ళీ పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా ఆరోగ్యం దృష్ట్యా రైస్ మిల్ యాజమాన్యం జెసిబిఏర్పాటు చేసి ఎస్ ఆర్ ఎస్ పిలో నిలువ ఉన్న రైస్ మిల్ కి సంబంధించిన మురుగు నీటిని తీసివేయాలని కోరారు. జిల్లా పంచాయతీ అధికారి వెంట ఎంపీడీవోదివ్యదర్శన్ రావు, ఎమ్మార్వో మధుసూదన్ , నారాయణపూర్ గ్రామ కార్యదర్శి మంగా రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సమస్య పై అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీఓ, ఎమ్మార్వో,కార్యదర్శి నారాయణపూర్ మాజీ ఎంపీటీసీ మండల రమేష్, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా కంచర్ల సుధీర్ రెడ్డి..?



**కూసుమంచి ఆగస్టు 16 ( జనంసాక్షి ) :**
రాజకీయంలో ఎంత ఒదిగి ఉంటే అంత మంచి జరుగుతది అని చెప్పుకోవడానికి నిదర్శనమే నేడు కంచర్ల సుధీర్ రెడ్డికి నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావడానికి నిదర్శనం వాళ్ల కుటుంబము కాంగ్రెస్ ఆయన ఊహ తెలిసిన దగ్గర నుంచి కాంగ్రెస్ ఆయనకు ఓటు వచ్చిన దగ్గరనుంచి కాంగ్రెస్ మరీ ముఖ్యంగా చెప్పాలంటే తెలంగాణ రాష్ట్ర మంత్రి స్థానిక శాసనసభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి నియోజకవర్గంలో ఉన్న అత్యంత సన్నిహితులలో సుధీర్ రెడ్డి ఒకరు అతనికి నేడు నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి రాబోతున్నది అని తెలియగానే ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సుధీర్ రెడ్డి మొదటినుంచి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని గత 15 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రతి ఒక్కరి మంచి చెడులో పాలుపంచుకుంటూ ఉన్న వ్యక్తికి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్ష పదవి ఇవ్వాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# అభాగ్యునికి 'ఆధార్'తో బాసట

## యూడాయ్ ఉన్నతాధికారల చొరవ



**భద్రాచలం ఆగస్టు 16 (జనంసాక్షి):**
కాలు విరిగి చికిత్స చేయించుకోవటానికి ఆధార్ కార్డు లేక అవస్థలు పడుతున్న ఓ అభాగ్యునికి యూడాయ్ ఉన్నతాధికారులు బాసటగా నిలిచిన సంఘటన శుక్రవారం భద్రాచలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాచలంలో శిల్పినగర్ ప్రాంతంలో చెల్లూరి మల్లయ్య అనే వృద్ధుడు బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తుండు. గత ఆరు నెలల క్రితం చిన్నజీయర్‌స్వామి మఠం వద్ద డ్రైనేజీలో పడి కాలు విరిగింది. చికిత్స చేయించుకోవటానికి ఆర్థిక స్థోమత సరిపోలేదు. ప్రభుత్వాసుపత్రికి వెళ్తే ఆరోగ్యశ్రీలో సర్జరీ చేయటానికి ఆరోగ్య శ్రీ అడిగారు. ఈ క్రమంలో బిక్షాటన చేసుకుంటూ శుక్రవారం అంబేద్కర్ సెంటర్‌లోని చేతనా మీ సేవా వద్దకు వచ్చి తన గోడును నిర్వహకులు భూక్యా రంజిత్ నాయక్‌కు వెల్లడించారు. దీంతో స్పందించిన రంజిత్ యుడాయ్ ఉన్నతాధికారి చైతన్య రెడ్డిను సంప్రదించి వివరాలు పంపాడు. సత్వరమే స్పందించిన చైతన్య రెడ్డి ఆయన పేరు, ఇతర వివరాలతో ఆధార్ నెంబర్‌ను తెలపటంతో రంజిత్ ఉచితంగా ఆధార్ కార్డును ప్రింట్ చేసి పట్టణ ప్రముఖులు వాసిరెడ్డి రమేష్‌బాబు చేతుల మీదుగా అందచేశారు. ఆరు నెలలుగా పడుతున్న కష్టానికి మీ సేవ నిర్వహకులు స్పందనతో వెంటనే లభించటంతో కన్నీళ్లతో మల్లయ్య చైతన్య రెడ్డి, రంజిత్‌నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీ సేవా సిబ్బంది ఈశ్వర్, విజయ్, ఉపాధ్యాయులు ధారావత్ భాస్కర్, బాసు తదితరులు పాల్గొన్నారు.

# నేడు వైద్య సేవల నిలిపివేత

## సూర్యాపేటలో నేడు హాస్పిటల్స్ బంద్

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు 24గంటల పాటు దేశ వ్యాప్తంగా వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సూర్యాపేట అధ్యక్షులు డాక్టర్ ఆనంద్ డాంగే, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎల్.రమేష్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.కలకత్తాలో మహిళా డాక్టర్ దారుణ హత్యను నిరసిస్తూ నేటి ఉదయం 6 గంటల నుండి రేపు ఉదయం 6 గంటల వరకు హాస్పిటల్‌కి వచ్చే రోగులకు వైద్య సేవలను బంద్ చేయడం జరుగు తుందన్నారు.కేవలం హాస్పిటల్ లో అంతకు ముందు ఉన్న రోగులకు మాత్రమే సేవలను కొనసాగిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. నేటి ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల నుండి పాత బస్టాండ్, పీఎస్ఆర్ సెంటర్, వాణిజ్య భవన్, శంకర్ విలాస్ సెంటర్, కొత్త బస్టాండ్ వరకు బారీ ర్యాలీని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రోగులు సహకరించాలని కోరారు.

# జిల్లా ఉత్తమ సిఐ గా ప్రశంసా పత్రం అందుకున్న సిఐ ధనుంజయ

**కొండమల్లేపల్లి, ఆగస్టు 16 ( జనంసాక్షి ) :**
78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ, ఉత్తమ విధుల నిర్వహణ, మాదకద్రవ్యాల నిర్మూలనలో విశేషంగా కృషి చేసినందుకుగాను కొండమల్లేపల్లి సర్కిల్ పరిధిలో పోలీస్ స్టేషన్ల పనితీరు, కేసుల దర్యాప్తు ఖచ్చితమైన విశ్లేషణ, నేరాల నివారణ, సమర్థవంతమైన విచారణ, ప్రోయాక్టివ్ పోలిసింగ్ కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ మొదలైన రక్షణ క్రియాత్మక రంగాలలో వారు సాధించిన ప్రతిభ ఆధారంగా ఉత్తమ జిల్లా సిఐ గా ఎన్నికై జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, ఎస్పీ శరత్చంద్ర పవార్ ల చేతుల మీదుగా జిల్లా ఉత్తమ సిఐ అవార్డు అందుకున్న కొండమల్లేపల్లి సిఐ ధనుంజయ.జిల్లా ఉత్తమ అవార్డును అందుకున్న సిఐ ధనుంజయ ను దేవరకొండ డిఎస్పి గిరిబాబు, ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి, గుర్రంపోడు, పీఏ పల్లి, గుడిపల్లి మండలాల పోలీసు ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది, డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, పలువురు ప్రముఖులు, పత్రికా విలేకరులు, మాజీ ప్రజా ప్రతినిధులు వివిధ అసోసియేషన్ సంఘాల నాయకులు సిఐ ధనుంజను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- వ్యాధి నిర్ధారణ అయిన తర్వాతనే చికిత్స అందించాలి
- నిరంతరం శానిటేషన్, డ్రై డే నిర్వహించాలి
- సమన్వయంతో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అరికట్టాలి
- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్





**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి నిర్ధారణ అయిన తర్వాతనే వారికి చికిత్స అందించాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలోని సమావేశ మందిరం నందు సీజనల్ వ్యాధులపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి వైద్య ఆరోగ్య శాఖ,పంచాయతీ రాజ్ అధికారులు , మున్సిపల్ కమిషనర్లు ,సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో, పట్టణాలలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.మురుగు నీటి నిల్వలు లేకుండా ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. అడల్ట్ దోమలు నివారించటానికి సాయంత్రం పాగింగ్ చేయాలని,నీటి నిల్వలలో యాంటీ లార్వా స్ప్రే చేయాలని,డ్రై డే నిర్వహించాలని , అయిల్ బాల్స్ ఉప యోగించాలని అన్నారు.ఎక్కడైనా డెంగ్యూ వ్యాధి లక్షణాలు కనిపిస్తే ముందుగా ర్యాపిడ్ టెస్ట్ చేయాలని, అప్పుడు డెంగ్యూ అనిపిస్తే వెంటనే బ్లడ్ శాంపిల్స్ ని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కి పంపించాలని, అక్కడ డెంగ్యూ గా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలని పేర్కొన్నారు.రాపిడ్ యాక్షన్ టీమ్ కుటుంబ సభ్యులకి, పరిసర ప్రాంత ప్రజలకు టెస్టులు చేయాలని సూచించారు.డెంగ్యూ వ్యాధి ఎక్కువగా వ్యాపించే ప్రాంతాలను గుర్తించి అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రైవేట్ హాస్పిటళ్లలో జ్వరం రాగానే ర్యాపిడ్ టెస్ట్ చేసి వెంటనే డెంగ్యూ వ్యాధి చికిత్స అందిస్తున్నారని, అలా చేయకూడదని, అలాంటి కేసులను ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కి ఎలిజా టెస్ట్ కోసం పంపించాలని అన్నారు.డెంగ్యూ నిర్ధారణ అయినా తర్వాత చికిత్స అందించాలన్నారు.ప్రతి రోజు ప్రైవేట్ హాస్పిటల్స్ లో ఉన్న డెంగ్యూ కేస్ ల వివరాలు తెలుసుకోవాలని డిఎంహెచ్ఓకి సూచించారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ ఒక డెంగ్యు కేస్ నమోదైన గ్రామం,వార్డులో పీవర్ సర్వే నిర్వహించాలని సూచించారు. డెంగ్యూ కేస్ నమోదైతే వెంటనే సంబంధిత మండల ఎంపిడిఓకి, మున్సిపల్ కమిషనర్లకు తెలపాలన్నారు.ర్యాపిడ్ టెస్ట్ కిట్ ని ప్రతి హాస్పిటల్ లో ఉండాలని డాక్టర్లకి సూచించారు. అంతకుముందు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ని సందర్శించారు. బ్లడ్ కంపొనెంట్ సపరేట్ మిషన్ ని,మైక్రో బయలాజీ ల్యాబ్, బయో కేమిస్ట్రీ ల్యాబ్ లను సందర్శించారు. జనరల్ వార్డ్ సందర్శించి పలు కేస్ షీట్ లను పరిశీలించారు. జ్వరం తో వచ్చే చిన్న పిల్లల కొరకు ప్రత్యేక వార్డును ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బిఎస్.లత, జడ్పీ సిఈఓ అప్పారావు, డిపిఓ యాదగిరి,వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయలత, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ గురు రాజ్,సంక్షేమ అధికారులు శంకర్, లత, అనసూయ, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# రైతు రుణమాఫీ చేసి దేశంలో చరిత్ర సృష్టించాం..

- ఏకకాలంలో రుణమాఫీ..దేశ చరిత్రలోనే మొదటిసారి
- వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట
- రైతులకు రెండు లక్షల రుణమాఫీ..
- దేవరకొండ శాసనసభ్యులు నేనవత్ బాలు నాయక్

దేవరకొండ, ఆగష్టు 16 (జనంసాక్షి):
ఏకకాలంలోనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ దేశ చరిత్రలోనే మొదటిసారి అని, రైతు రుణమాఫీ చేసి దేశంలో చరిత్ర సృష్టించామని దేవరకొండ శాసనసభ్యులు నేను బాలు నాయక్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రైతులను ఆదుకోవడం తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గతంలో 2009 లో కూడా ఒక లక్ష రైతు రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం , ఇప్పుడు రెండు లక్షలు రుణమాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుంది అని అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వాలు రైతులకు లక్ష రుణమాఫీ చేసినట్లు చేసి అవి వారి వడ్డీలకే సరిపోలేదని గుర్తు చేశారు. చిన్నచిన్న కారణాల చేత కొంత రైతులకు రుణమాఫీ జరగకుంటే వెంటనే స్పెషల్ డ్రైవ్ మొదలుపెట్టి అర్హత కలిగిన ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేస్తామని అన్నారు. ఆగస్టు 15 లోపు రెండు లక్షల రైతు రుణ మాఫీ చేస్తే హరీష్ రావు రాజీనామా చేస్తానని ఇచ్చిన మాట ప్రకారం రాజీనామా చేసి చూపెట్టాలని అన్నారు. బేషరతుగా రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద సంవత్సరానికి 15000 ఇవ్వడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తుందని అన్నారు. గత పాలకుల చేత మరుగున పడ్డ దేవరకొండ నియోజకవర్గం అధిక నిధులు కేటాయించి పూర్వ వైభవం తెస్తామని అన్నారు. బిఆర్ఎస్ పాలనలో దేవరకొండ ఎడారిగా మారిందని అన్నారు. పెండింగ్ లో ఉన్న అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసి దేవరకొండ నియోజకవర్గన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతామని అన్నారు. పెండింగ్ లో ఉన్న ఐదు లిఫ్టులను పూర్తిచేసి మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. ఆర్టీసీ బస్సులో ఉచిత మహిళల ప్రయాణం కొరకు 2100 కోట్లు వెచ్చించి మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని, అదేవిధంగా టిఆర్ఎస్ ప్రభుత్వంలో మరుగున పడ్డ ఆర్టీసీని పూర్వ వైభవం తెస్తామని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్లగాసు జాన్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నరసింహ, పి ఎస్ ఎస్ చైర్మన్ జాలే నర్సింహా రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ మొహమ్మద్ యూనుస్, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవేందర్ నాయక్, మారుపాకల సురేష్ గౌడ్, శిరందాసు కృష్ణయ్య, ముక్కమల్ల వెంకటయ్య, లోకసాని శ్రీధర్ రెడ్డి, ముత్యాల సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అమ్మవారి వరలక్ష్మీ వ్రతం

## పాల్గొన్న ఎమ్మెల్యే వేముల దంపతులు



**చిట్యాల ఆగస్టు 16(జనం సాక్షి)**
శ్రావణమాసం పురస్కరించుకొని రెండవ శుక్రవారం రోజున చిట్యాల పట్టణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం సుప్రభాతం, పంచామృత అభిషేకం, అమ్మవారికి అలంకారము, నైవేద్యం, అర్చనలు, గణపతి పూజ, స్వస్తివాచనము, మంటపారాధన, మధ్యాహ్నం మంత్రపుష్పము, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు.

**ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే దంపతులు:**
నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయన సతీమణి వేముల పుష్పతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకటరెడ్డి, అర్చకులు వాసుదేవ శర్మ లు వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి కరుణ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఆలయంలో జరుగుతున్న కుంకుమార్చన కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు రావడం సంతోషంగా ఉందన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయటం పట్ల ఆలయ చైర్మన్ ఆంజనేయులు గౌడ్ ను, డైరెక్టర్లను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బుద్ధ విమల కృష్ణమూర్తి, గంజి వెంకటేశం, వరకాంతం నర్సిరెడ్డి, రుద్రారపు లింగయ్య, జిట్టా సాయిలు, వనమా నిఖిల్ కుమార్, ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి తోపాటు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోకల దేవదాసు, పార్టీ పట్టణ అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య యాదవ్, కౌన్సిలర్లు పందిరి గీత, రేముడాల లింగస్వామి, బెల్లి సత్తయ్య, నాయకులు ఎద్దులపురి కృష్ణ,దుబ్బాక అమరేందర్ రెడ్డి, కుక్కల మోహన్, పూస బాలకృష్ణ మల్లెబోయిన మల్లేశం, నూతి సైదులు, జమాండ్ల శ్రీనివాస్ రెడ్డి, బొబ్బల రాంరెడ్డి, వరకాంతం శ్రీనివాస్ రెడ్డి, బూరుగు దశరథ, చెరుకుపల్లి శ్రీశైలం, మెట్టు మనోహర్ యాదవ్, జంపాల వెంకన్న, అర్చకులు గోవింద్, శుభం మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.



# జస్టిస్ శరత్ చంద్ర నీ మర్యాదపూర్వకంగా కలిసిన రోటరీ క్లబ్ సభ్యులు



**భద్రాచలం , ఆగస్టు 16 (జనంసాక్షి):** శుక్రవారం సీతారామచంద్రస్వామి దర్శనానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి శరత్ చంద్ర ని ఐటీసీ గెస్ట్ హౌస్ లో భద్రాచలం రోటరీ క్లబ్ అధ్యక్షులు ధారా బాలాజీ రావు, ఉపాధ్యక్షులు షేక్ అజీమ్, కార్యదర్శి నూకల విద్యాసాగర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంలో భద్రాద్రి రామున్ని దర్శించేందుకు హై కోర్ట్ జడ్జి భద్రాచలం చేరుకున్న సందర్భంగా రోటరీ క్లబ్ తరపున శాలువతో సత్కరించారు. భద్రాచలం ప్రాంతానికి చెందిన శరత్ చంద్ర హైకోర్టు జడ్జి కావటం, ఈ ప్రాంతానికే వన్నెతెచ్చారాని, భద్రాద్రి రాముని దీవెనలు వారికి ఎల్లప్పుడూ ఉండాలని రోటరీ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు.

# రామాలయం భూముల్లో అక్రమ నిర్మాణాలు

- ఆలయ అధికారులకు, ఆక్రమణ దారులు మధ్య తోపులాట
- సరిహద్దు ప్రాంతంలో వేడెక్కిన వాతావరణం



**భద్రాచలం ఆగస్టు 16 (జనంసాక్షి)**
ఆంధ్రలోని ఎటపాక మండలం, పురుషోత్తమ పట్నం గ్రామంలో ఉన్న రామాలయం భూములో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న విషయం తెలుసుకున్న రామాలయం అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని, అక్రమ కట్టడం తొలిగించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆలయ అధికారులకు, ఆక్రమణ దారులు మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనతో భద్రాచలం వాతావరణమంతా ఉద్రిక్తత నెలకొంది.
ఈ వివాదంలో ఆక్రమణ దారులు రామాలయం ఈ ఓ రమాదేవి పై తిరగపడ్డారు. అనేక సంవత్సరాలుగా ఇక్కడే జీవిస్తున్నామని, తమకు వేరే ప్రాంతంలో పునరావాసం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎటపాక రెవిన్యూ, పోలీస్ అధికారులు సంఘటన ప్రాంతానికి చేరుకొని వివాదం సద్దుమనిగేలా చేశారు. రామాలయం భూములలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని గతంలో ఎం ఆర్ ఓ చెప్పినా, ఎందుకు నిర్మాణం చేపట్టారని ఆక్రమణ దారులను ప్రశ్నించారు. ఇది తెలుసుకున్న కొందరు రామ భక్తులు కట్టడాన్ని కొంతమేర కూలగొట్టగా, అక్రమ నిర్మాణం చేపట్టినవారే తొలిగించాలని అధికారులు పేర్కొన్నారు.

# వర్గీకరణకు వ్యతిరేక oగా భారత్ బంద్ జయప్రదం చేయండి..



**భద్రాచలం ఆగస్టు 16 (జనంసాక్షి)**
సుప్రీం కోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా ఈ నెల 21 వ తారీఖున న జరిగే భారత్ బందు ని జయప్రదం చేయాలని మాల మహానాడు అధ్యక్షులు అల్లాడి పౌల్ రాజు పిలుపునిచ్చారు. స్థానిక ఏఎంసీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఈ బందులో మాల మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు ఐకమత్యంగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతూరు డివిజన్ అధ్యక్షులు దేగల వంశీ, పుట్టి రవి, నక్కా సందీప్, కనకరాజు దేగల శివయ్య చీకటి దశింబాబు బర్ల రామకృష్ణ, బన్నీ , నాని , వినయ్ ,పల్లాంటి వెంకన్న , ప్రవీణ్ ప్రకాశ్,చిన్నా , సంజీవ్..తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించి పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్ టీ పూర్ణచంద్ర



**నల్లగొండ బ్యూరో,ఆగస్టు 16, (జనం సాక్షి):**
ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తు లను క్షేత్రస్థాయిలో తనికి నిర్వహించి జాగ్రత్తగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అన్నారు. ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై శిక్షణ లో భాగంగా ఈ నెల14 న జిల్లాలోని15 మండల బృందాలకు శిక్షణ ఇవ్వగా,శుక్రవారం తక్కిన మండల బృందాలకు శిక్షణ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్ లో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిష్కారాని కై శిక్షణ పొందిన బృందాలన్నీ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా దరఖాస్తులను పరిష్కరించాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల్లో స్థాయిలో సందర్శించి నియమ నిబంధనలన్ని సక్రమంగా పాటించి దరఖాస్తులను పరిష్కరించాలని,దరఖాస్తుల పరిష్కారంలో సందేహం వచ్చినట్లయితే ఉన్నతాధికారులను సంప్రదించాలని కోరారు.జిల్లా పంచాయతీ అధికారి మురళి, డిటిసిపి లక్ష్మీనారాయణ,డి ఎల్పిఓలు, తహసిల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు,ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్లు,రెవిన్యూ ఇన్స్పెక్టర్లు,ఎంపీఓలు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.



# రూపాయికి శస్త్రచికిత్స చేసేదెలా?

- దిగుమతుల భారం తగ్గిస్తేనే ఫలితం
- రూపాయి బలహీనంతో భారంగా విదేశీ విద్య



**ముంబై, ఆగస్టు16 (జనంసాక్షి) :** రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం 2014 ఆగస్టు 14న డాలర్‌కు 61.05 పైసలు. ఈ పదేళ్లలో అది ఇప్పుడు రూ.83 నుంచి 84 మధ్యకి చేరుకుంది. ఇదొక్కటి చాలు మనమెంతగా ఆర్థికంగా చితికి పోయామో చెప్పడానికి. రూపాయి బలపడిందంటే మన ఎగుమతులు పెరిగాయని అర్థం చేసుకోవచ్చు. దీనివల్ల మన విదేశీ మారక నిల్వలు హరించుకు పోతున్నాయి. ఇదంతా కేవలం దిగుమతుల ప్రభావం అనడంలో ఎలాంటి సందేహం లేదు. మోడీ సాధించిన ఆర్థిక ప్రగతి ఎలా ఉన్నా రూపాయిని మాత్రం పట్టుకోలేకపోతున్నారు. నిజంగా రూపాయికి శస్త్రచికిత్స చేసే కార్యాక్రమాలు కానరావడం లేదు. మనవాళ్లను అమెరికా పంపించాలంటేనే భయం వెన్నాడుతోంది. చదువుకునేందుకు వెళ్లే పిల్లలకు రూపాయలను బస్తాల్లో పంపినా అక్కడ పిడికెడు డాలర్లు రావడం లేదని వాపోతున్నారు. 78 ఏళ్ల స్వాతంత్ర్య చరిత్రలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి దిగజారిపోయి రూపాయి విలపిస్తుండగా, నిత్యావ సరాల ధరలు పెరిగి, ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్న తీరు ఎక్కడా ప్రధాని మోడీ ప్రసంగంలో కానరావడం లేదు. 1947లో రూపాయి విలువ డాలర్‌తో సమానం. అంటే ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతావనిలో మనం బాగా అభివృద్ధి సాధించామని ఈ రకంగా పోల్చుకోవాలేమో. డాలర్‌తో రూపాయి మారకం దారుణంగా మారింది. అమెరికా, టర్కీల మధ్య తలెత్తిన విభేదాల నేపథ్యంలో టర్కీ కరెన్సీ అయిన లిరా ఒడిదుడుకుల కు గురికావడంతోనే ఇంతటి పెను మార్పులని అప్పట్లో ఆర్థికమంత్రిగా ఉన్న అరుణ్ జైట్లీ సెలవిచ్చారు. అంటే ప్రపంచంలో ఏ దేశంలో ఏ ఉపద్రవం వచ్చినా మన రూపాయి తట్టుకుని నిలబడేంత బలంగా లేదు. ఇంతటి బలహీనమైన రూపాయి ఎప్పుడు బలపడుతుందా అన్నదే అనుమానం. సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు వచ్చాక ద్రవ్యమారక రేట్లతో ప్రజా జీవనం తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన చమురు ధరలకు నిర్ణయాత్మకమవుతోంది. రూపాయి మారకం విలువ పడిపోతోందని 2014 ఎన్నికలకు ముందు మోడీ కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శిస్తూ వచ్చారు. ఇప్పుడు మోడీ వికసిత భారత్ ప్రకటించారు. అయితే రూపాయికి శస్త్రచికిత్స చేయకుండా దీనిని సాధించడం దుస్సాధ్యం. ఇది సాధిస్తే ప్రజలు ఎవరికి వారు ఆర్థికంగా ఎదగలరు. ఎవరి ఆరోగ్యం వారు చూసుకోగలరు. దివంగత ప్రధాని పివి నరసింహారావు మాత్రమే ఇలాంటి దార్శనికతను ప్రదర్శించారు. ఆయన తీసుకున్న సాహసోపేత సంస్కరణలే ఇప్పటికీ మనకు రక్షగా నిలిచాయి. ప్రధాని మోడీ ఇప్పుడు ఈ దిశగా దృష్టి సారించాలి. కఠిన పరిశ్రమ చేయాలి. పివి-మన్మోహన్ ద్వయం తెచ్చిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంకు ఆదేశిత ఆర్థిక విధానాలనే వాజ్‌పేయ్ ప్రభుత్వం అమలు చేసింది. అలాగే మన్మోహన్ సర్కారు బాటలోనే మోడీ ప్రభుత్వం నడుస్తోంది. కాబట్టి ఆ పార్టీలు పరస్పరం విమర్శించుకోవడం రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప నిజంగా మాత్రం కాదు. రిజర్వు బ్యాంకు రంగంలోకి దిగి రూపాయిని నిలబెట్టాల్సిఉందని చాలామంది సూచిస్తున్నారు. 80శాతం చమురు ఎలాగూ దిగుమతి చేసుకొనేదే కనుక, క్రూడాయిల్ ధర పెరిగి, దేశీయ మార్కెట్‌లో పెట్రో ఉత్పత్తుల రేట్లు మరింత హెచ్చి నిత్యావసర, వినియోగ వస్తువులు ఖరీదు కాక తప్పదు. ఉక్రెయిన్ యుద్ధంతో చమురు లభ్యత మరింత తగ్గి కొత్త కష్టాలు తెచ్చిపెట్టిందన్న ఆందోళనా ఉంది. ద్రవ్యోల్బణం అదుపు చేయడానికి ఆర్‌బిఐ కష్టాలు పడుతున్న తరుణంలోనే రూపాయి మరింతగా కృశించి పోతున్నది. రూపాయిని కాపాడటానికి రిజర్వుబ్యాంకు వద్ద అనేక మార్గాలు ఉండివుంటాయని, తగిన సమయంలో నిర్ణయాలు చేస్తుందని ఆర్థిక నిపుణులు హామీ ఇస్తున్నప్పటికీ, ఈ దుస్థితి ఎంతకాలం కొనసాగుతుందన్నది అర్థంకాని ప్రశ్న. రిజర్వుబ్యాంకు చర్యలు సామాన్యుడికి ఉపశమనం ఇవ్వలేని కాలం కూడా దాపురించవచ్చు. రూపాయి బలహీనతలను గుర్తించి తగు శస్త్ర చికిత్సలకు దిగాలి. లేకుంటే ఆర్థిక ద్రవ్యోల్బణం,ధరల స్వారీ పెరగగలదు. పెద్దనోట్ల రద్దు వంటిచర్యల కారణంగానే ఆర్థిక సంక్షోభం ఉత్పన్న మైందన్న వాదన ఇప్పటికీ ఉంది. ఎందుకంటే ఆనాటి నుంచి నేటి వరకు ఆర్థికరంగం తిరోమనంలోనే ఉంది. తన అధికారాన్ని దుర్వినియోగ పరుస్తూ మోదీ ప్రభుత్వం రిజర్వుబ్యాంకును నోరులేని దానిగా మార్చి వేసిందని విపక్షాలు అంటున్నాయి. ఆర్థిక రంగంలో కొత్త ఉత్పాతాలను తట్టుకొని నిలబడగల స్థితిలో ప్రజలు లేరు. ద్రవ్యోల్బణం అదుపు తప్పితే మరిన్ని కష్టాలు తప్పవు. బ్యాంకు వడ్డీరేట్లు పెరగడం, రుణాలమీద ప్రభావం వంటి సమస్యలు కూడా అనేకం. రూపాయి పతనమవుతున్నందున పెట్టుబడిదారులు డాలర్ సురక్షిత మైనదిగా భావించడంతో విదేశీ మారకద్రవ్య నిల్వలు కూడా తరిగి పోతున్నాయి. డాలర్ విలువ కారణంగా వాణిజ్యలోటు హెచ్చుతూ ఐదేళ్ళ గరిష్టానికి చేరింది. రూపాయి విలువ తగ్గుదలతో ఎగుమతులకు మేలు జరగవచ్చని కొందరంటున్నారు. అయితే ఇప్పటికే అమెరికా, ఐరోపా మార్కెట్లలో విధించిన నిబంధనలవల్ల వాటికి ముప్పు ఏర్పడిన వాస్తవాన్ని విస్మరించరాదు. అంతేగాక దిగుమతుల భారం వల్ల ఆర్థిక వ్యవస్థకు కలిగే నష్టాన్ని గుర్తించాలి. డాలర్లు మన దేశం నుంచి తరలి పోకుండా పరిమితం చేయడానికి విలాస వస్తువుల విచ్చలవిడి దిగుమతులపై ఆంక్షలు విధించడం అవసరం అన్న భావనా ఉంది. దేశ ప్రజల కొనుగోలు శక్తిని పెంచే ఆర్థిక విధానాల వైపు ఇప్పటికైనా మళ్లాల్సి ఉంది. భారతీయ రిజర్వుబ్యాంకు జోక్యం పూర్తిస్థాయిలో లేనందునే రూపాయి ఇంతగా ఉన్నదని కొందరి వాదన. రూపాయి పతనం ఐటీ, ఎగుమతులు ఇత్యాది రంగాలకు మేలుచేస్తుందని అంటున్నారు కానీ, సామాన్యుడిపై ధరాఘాతం తప్పడం లేదు. దిగుమతి చేసుకొనే ఉత్పత్తుల ధరలు పెరిగిపోతున్నాయి. ఎగుమతులు, దిగుమతులను విశ్లేషించాలి. తాము తీసుకుంటున్న నిర్ణయాలు ఫలితం ఇవ్వడం లేదని గుర్తించి అందుకు కారణాలు విశ్లేషించాలి. చమురు దిగుమతులే మన కొంప ముంచుతు న్నాయని ఆర్థికవేత్తలతో సహా ప్రభుత్వాలు కూడా అంటున్నాయి. విపరీతంగా పెరిగిన చమురు ధరల కారణంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు కరగి పోతున్నాయి. అంతేగాకుండా రూపాయి మారకవిలువ దిగజారిపోతోందని అంటున్నారు.

## విపణి

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 407 | ₹ 49 |
| వరంగల్ | ₹ 407 | ₹49 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

₹70,310 (24 క్యారెట్లు) | ₹64,450 (22 క్యారెట్లు)

చెన్నై

₹64,450 (22 క్యారెట్లు) | ₹70,310 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 88,100

# విప్లవాత్మక జిఎస్టీపై పునరాలోచన ఏదీ?

- ఈ భారాలపై ఎక్కడ మొర పెట్టుకోవాలి
- ఇన్సూరెన్స్‌లపై జిఎస్టీ విధించడం ఎంతకాలం
- మధ్యతరగతి ప్రజలకు భారంగా సొంతింటి కల



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 16 (జనంసాక్షి) :** భారత్ లాంటి దేశాల్లో పన్నులు సరళీకృతంగా ఉండాలి. ఒకే పన్ను విధానం అంటూ జిఎస్టీని తీసుకుని వచ్చినా పన్నుల భారాలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించడం లేదు. ప్రతి పనికి జిఎస్టీని విధించడం దారుణం కాక మరోటి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, బీమా మొత్తాలపై జిఎస్టీ విధించడం దారుణం కాక మరోటి కాదు. దీనిపై ఇటీవల పార్లమెంటులో ప్రస్తావనకు వచ్చినా ఆర్థికమంత్రి చెప్పిన సమాధానం ప్రజలను అవమానిం చేదిగా ఉంది. దీనిని ప్రస్తావించిన కేంద్రమంత్రి నితిని గడ్కరీని కూడా నిర్మలా సీతరామన్ అవమానించారు. ఒక్కరు ప్రస్తావించిన అంశాన్ని 200మంది పట్టుకుని సాగదీసారని తన తలబిరుసు సమాధానంతో చెప్పారు. పెట్రో ధరలపై జిఎస్టీ విధించడం లేదు. గ్యాస్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచేశారు. ప్రజలు కడుతున్న పన్నులతో పాలకులు రాజ్యాలు ఏలుతున్నారు. తమ సుఖాలకు ఖర్చు చేస్తున్నారు. పథకాల పేరుతో వంచన చేస్తున్నారు. నిజానికి జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి పరిమితం చేయాలి. పన్నుల పేరుతో ఎలా బాదుతున్నారో చర్చించాలి. ఇల్లు కొనాలంటే రకరకాలు పన్నుల రూపంలో బాదేస్తున్నారు. రిజస్ట్రేష్లనకు రాష్ట్రాలు లక్షల్లో వసూలు చేస్తున్నారు. మధ్య తరగతి ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు. ఇలా రకరకాల పన్నులపై చర్చించాలి. అవసరమైతే పార్లమెంటులో ప్రత్యేకంగా చర్చించే ధైర్యం చేయాలి. బ్యాంకుల రుణ వితరణలో లక్ష కోట్ల రూపాయల తరుగుదల కనిపించిందని గతేడాది రిజర్వుబ్యాంకు వెల్లడించడం గమనిస్తే, గిరాకీ మందగించడం వల్లనే కొత్త పరిశ్రమలు, వ్యాపారాలను పెట్టడానికి రుణాలు తీసుకునేవారు కరవవుతు న్నారని స్పష్టమవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తరచూ మాంద్యానికి గురవుతూనే ఉంటుంది. అది సహజ పరిణామం కూడా. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు ఒక సరళ సూత్రాన్ని పాటించి విజయం సాధించాయి. భారత్ కూడా అలాంటి ఉద్దీపన విధానాన్ని చేపట్టాలి. కొన్ని రంగాలు తమ సామర్థ్యం మేరకు ఉత్పత్తి సాగించలేక పోయాయి. ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచితే ఆర్థిక వ్యవస్థలోకి ధన ప్రవాహం, దానితోపాటే గిరాకీ పెరిగి, పరిశ్రమలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత ఎక్కువగా వినియోగించుకుంటాయి. దీనికి ఉద్దీపనలు ఇవ్వాలే తప్ప కొందరు కార్పోరేట్లకు రుణాలను మాఫీచేయడం, ఎగవేతదారుల రుణాలను మాఫీ చేయడం దేశ అభివృద్ధి కాదు.

## జాతీయం అంతర్జాతీయం

# సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కేసులో నిందితుడి విడుదల

**న్యూఢిల్లీ, ఆగస్ట్16 (జనంసాక్షి) :** బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కన్నుమూసి కొన్ని సంవత్సరాలు గడిచాయి. అయితే ఇప్పటికీ అతని మరణాన్ని చాలా మంది జీర్ణించుకోలేకపోతున్నారు. దీనికి తోడు సుశాంత్ ది హత్యా? ఆత్మహత్యా? అన్నది ఇప్పటివరకు సస్పెన్స్ గానే ఉంది. ఒక్కొక్కరు ఒక్కో రకంగా ఈ నటుడి మరణంపై ప్రకటనలు చేస్తున్నారు. తాజాగా సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. హీరో మరణానికి కారణమైన డ్రగ్స్ కేసులో నిందితుడిగా ఉన్న ఆస్ట్రేలియా వ్యక్తిని కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. అతను తప్పు చేశాడని చెప్పడానికి సరైన పత్రాలు లేనందున కోర్టు ఈ ఆదేశాలిచ్చింది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ జూన్ 2020లో మరణించారు. ముంబైలోని తన ఫ్లాట్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఇది హత్య అని పలువురు ఆరోపించారు. పోలీసులు దీనిని హై ప్రొఫైల్ కేసుగా పరిగణించారు. సుశాంత్ మరణంలో డ్రగ్స్ పాత్ర కూడా ఉందని పసిగట్టారు. దీంతో ఈ కేసును నార్కోటిక్స్ కంట్రోల్ బోర్డు విచారణ ప్రారంభించింది. ఇందులో బార్టెల్స్ అనే ఆస్ట్రేలియన్ అరెస్టయ్యాడు. 2020 నవంబర్ లో నార్కోటిక్స్ కంట్రోల్ బోర్డ్ బరాటెల్స్ బార్టెల్స్ ను అరెస్టు చేసింది. అయితే కేసును విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి మహేశ్ జాధవన్.. బార్టెల్స్ పాత్రకు సంబంధించిన సరైన ఆధరాలు, రికార్డుల లేవని అభిప్రాయపడ్డారు. 'బారాటేల్స్ నేరస్థుడని నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు లేవు, దీంతో వారిని విడుదల చేస్తున్నాం. ఈ ఉత్తర్వు లు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కేసుపై ఎలాంటి ప్రభావం చూపవు' అని న్యాయ మూర్తి తీర్పులో పేర్కొన్నారు.ప్రస్తుతం సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కేసును సీబీఐ విచారిస్తోంది. ఇది హత్యగా అనుమానిస్తున్నారు. జూన్ 13న సుశాంత్ కన్నుమూశారు. ఆత్మహత్య చేసుకున్నారా లేక హత్య చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తన ట్యాలెంట్ తో ఇండస్ట్రీలో ఎన్నో కలలు అధిరోహిస్తాడనుకున్న సుశాంత్ అనూహ్యంగా ఈ లోకాన్నే విడిచి పెట్టి వెళ్లిపోయాడు.

# చట్టాన్ని ఉల్లంఘిస్తే సహించేది లేదు

- ప్రజలను, కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారిని వదిలేది లేదు
- బాండ్ బుక్ విషయంలో ఊరూరూ వెళ్లి మాట్లాడ
- మంత్రి నారా లోకేష్
- ఏపీలో మరో 99 అన్న క్యాంటీన్లు ప్రారంభం



**తాడేపల్లి, ఆగస్ట్16 (జనంసాక్షి) :** శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నులకపేట ప్రాంతంలో అన్న క్యాంటీన్‌ను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఆయన స్వయంగా పలువురికి అల్పాహారం వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడా రు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారిని వదిలేది లేదని ప్రచారంలో చెప్పానన్నారు. రెడ్ బుక్ విషయంలో ఊరూరూ వెళ్లి మాట్లాడనని వివరించారు. దీనిపై ప్రజలకు తాను హామీ ఇచ్చానన్నా రు. దానికి కట్టుబడి ఉన్నానని తెలియజేశారు. అందుకే ఎన్నికల్లో ప్రజలు మాకు మంచి తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. పనిలోపనిగా గత ప్రభుత్వం చేసిన కొన్ని అంశాలపై యాక్షన్ తప్పదన్నారు. ముఖ్యంగా లిక్కర్, ఇసుక దందాలు కొనసాగాయని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి జోగి రమేష్ కొడుకు వ్యవహారం గురించి కీలక విషయాలు వెల్లడించారు మంత్రి. అగ్రిగోల్డ్ భూమి పత్రాలు తీసుకుని, ఫేక్ పత్రాలు క్రియేట్ చేసి.. ఆయా భూములను సొంతం చేసుకున్నారని తెలిపారు. ఆ తర్వాత వాటిని అమ్మేశాడన్నారు. ఇలాంటి వాటిపై యాక్షన్ తీసుకోకూడదా? అంటూ ప్రశ్నించారు. ఇంకా లిక్కర్, ఇసుక దందాలపై చర్యలు తప్పవంటూ సంకేతాలు ఇచ్చేశారు.ఒక అబద్దాన్ని పదేపదే చెబితే నిజం అవుతుందని జగన్ భావిస్తున్నారని అన్నారు మంత్రి నారా లోకేష్. అందుకే ఫేక్ జగన్ అని పేరు పెట్టామన్నారు. చివరకు అన్న క్యాంటీన్ల నిర్వహణకు వచ్చే విరాళాలపైనా ఆ పార్టీ ఏడుస్తోందని దుయ్యబట్టారు. సైకోల బారి నుంచి పేదలని రక్షించడానికే విరాళాలు సేకరిస్తున్నట్లు తెలియజేశారు. మొత్తానికి జగన్ చేసిన కామెంట్స్‌కు ఫుల్ స్టాప్ పెట్టారు మంత్రి నారా లోకేష్. కాగా మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్.. అందులో ఏముంది? జగన్ ఎందుకు భయపడు తున్నారు? పదేపదే జగన్ ఆ విషయాన్ని ఎందుకు ప్రస్తావిస్తున్నారు? ఏదో విధంగా అధికార ప్రభుత్వంపై బురద జల్లడానికేనా? టీడీపీ ఎందుకు సైలెంట్‌గా ఉంటోంది? ఆయా ప్రశ్నలకు సమాధానం బయటకు వచ్చేసింది. వైసీపీ అధినేత జగన్ మీడియా ముందుకొచ్చిన ప్రతీసారీ రెడ్ బుక్ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తున్నా రు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని పదేపదే దుయ్యబడుతున్నారు. ఈ వ్యవహారంపై టీడీపీ నుంచి పెద్దగా కౌంటర్లు లేకపోవడంతో నేరుగా మంత్రి నారా లోకేష్ రంగంలోకి దిగేశారు. ఈ విషయంలో వైసీపీ లేవనెత్తిన ప్రశ్నలకు తనదైనశైలిలో రిప్లై ఇచ్చేశారాయన. శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నులకపేట ప్రాంతంలో అన్న క్యాంటీన్‌ను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఆయన స్వయంగా పలువురికి అల్పాహారం వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడా రు.

చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారిని వదిలేది లేదని ప్రచారంలో చెప్పానన్నారు. ఏపీలో అన్న క్యాంటీన్లు తిరిగి పున:ప్రారంభమవుతున్నాయి. గురువారం సీఎం చంద్రబాబు గుడివాడలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించగా.. శుక్రవారం రాష్ట్రంలో మరో 99 అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఇప్పటికే పలు జిల్లాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ప్రారంభిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో మండలానికో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ అన్న క్యాంటీన్లను ట్రస్ట్ ద్వారా శాశ్వతంగా నసాగించనున్నట్లు ప్రకటించారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించాలని మొదట భావించినప్పటికీ భవన నిర్మాణ పనులు పూర్తికానందున విడతలవారీగా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇక, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని నులకపేటలో శుక్రవారం ఉదయం మంత్రి నారా లోకేశ్ అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. అనంతరం అల్పాహారం వడ్డించారు. ఒంగోలులో అన్న క్యాంటీన్ ను మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ప్రకాశం జిల్లా చీమకుర్తిలో ఎమ్మెల్యే విజయ్ కుమార్ ప్రారంభించారు. కుప్పంలో అన్న క్యాంటీన్ ను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో అన్న క్యాంటీన్ ను ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. పేదలకు అవసరమైన ప్రదేశాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 99 క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. అన్న క్యాంటీన్ల పున: ప్రారంభం సంతోషకర విషయమని, అయితే వీటిని ఆస్పత్రుల వద్ద ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని చూడటానికి వచ్చేవారు, లేదా కుటుంబ సభ్యులు రోజులో ఒక్కపూట భోజనం చేసేందుకు కనీసం రూ.50 నుంచి రూ.80 వరకు ఖర్చు అవుతుందన్నారు. ఈ అన్న క్యాంటీన్లను ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేస్తే.. రూ.15కే మూడు పూటలు తినేందుకు అవకాశం ఉంటుందన్నారు.

# ఏపీకి పొంచి ఉన్న భారీ వర్షముప్పు

- వచ్చే రొండు రోజులపాటు కురువనున్న వర్షాలు



**అమరావతి, ఆగస్ట్ 16 (జనంసాక్షి) :** వాయువ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌కు ఆనుకుని ఉన్న ప్రాంతాల మీద అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుసంధానంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 4.5 కిమీ ఎత్తు వరకు విస్తరించి, ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశగా వంగి ఉన్నది. తదుపరి 2 రోజులలో ఇది ఉత్తర వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. గంగ పరివాహక-పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌పై తీవ్ర అల్పపీడన ప్రాంతంగా మారుతుంది. ఆ తర్వాత తదుపరి 3 రోజులలో పశ్చిమ వాయువ్య దిశగా, గంగ పరివాహక-పశ్చిమ బెంగాల్, జార?ండ్, పరిసర ప్రాంతాల మీదుగా పయనించే అవకాశం ఉంది. రుతుపవన ద్రోణి ఇప్పుడు ఫలోడి, బనస్థలి, శివపురి, సిధి, రాంచీ, పశ్చిమ వాయువ్య బంగాళాఖాతం దానిని ఆనుకొని ఉన్న పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మీద ఉన్న అల్పపీడన ప్రాంత కేంద్రం గుండా సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉన్నది.ఆగ్నేయ అరేబియా సముద్రం, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కేరళ తీరం మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక, పొరుగు ప్రాంతాలపై ఉంది. సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ వరకు విస్తరించి ఎత్తుకు వెళ్ళేకొలది నైరుతి దిశగా వంగి ఉన్నది. కొంకణ్ నుండి ఆగ్నేయ అరేబియా సముద్రం వరకు ఉన్న ద్రోణి, ఇప్పుడు ఉత్తర అంతర్గత కర్ణాటక నుండి కొమోరిన్ ప్రాంతం వరకు దక్షిణ అంతర్భాగ కర్నాటక, పొరుగు ప్రాంతాల మీద ఉన్న ఉపరితల ఆవర్తనం మీదుగా వ్యాపించి, సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉంది.

# వైసీపీ నేత అవినాష్‌కు బిగ్ షాక్..

- దుబాయ్ వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు

**అమరావతి, ఆగస్ట్16 (జనంసాక్షి) :** వైసీపీ నాయకుడు దేవినేని అవినాష్‌కు బిగ్ షాక్ తగిలింది. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నించగా..శంషాబాద్ విమానాశ్రయం అధికారులు మంగళగిరి పోలీసులకు సమాచారం అందించారు.అవినాష్‌పై కేసులు ఉన్నందున ప్రయాణానికి అనుమతి ఇవ్వొద్దని పోలీసులు కోరారు. ఇమ్మిగ్రేషన్ సమయంలో అవినాష్‌పై లుకౌట్ నోటీసులు ఉండటంలో అప్రమత్తమైన పోలీసులు అవినాష్ దుబాయ్ ప్రయాణాన్ని అడ్డుకున్నారు. దీంతో చేసేది ఏమిలేక అవినాష్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి వెనక్కి వెళ్లిపోయారు. కాగా, టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడితోపాటు టీడీపీ నాయకుడు పట్టాభి ఇంటిపై జరిగిన దాడి ఘటనల్లో దేవినేని అవినాష్‌పై కేసులు నమోదయ్యాయి. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో అవినాష్ నిందితుడిగా ఉన్నారు. అంతకుముందు మూడేళ్ల క్రితం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో విధ్వంసం సృష్టించారు. ఈ దాడి వెనుక అవినాష్ హస్తం ఉందనే ఆరోపణలు వినిపించాయి. ఇందులో భాగంగానే ఆయనపై పలు కేసు నమోదయ్యాయి. దేవినేని అవినాష్ దుబాయ్ పారిపోయేందుకు ప్రయత్నం చేశారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా, అంతకుముందు 2019 ఎన్నికల్లో గుడివాడ నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. తర్వాత వైసీపీలో చేరారు. గత ఎన్నికల్లో వైసీపీ తరఫున దేవినేని అవినాష్ విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. వైసీపీ హయాంలో టీడీపీ నేతలపై దూకుడుగా వ్యవహరించిన ఆయన టీడీపీ కార్యాలయాలపై దాడిలో ప్రధాన పాత్ర పోషించారనే అనుమానాలు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, శంష్షాబాద్ విమానాశ్రయంలో దేవినేని అవినాష్ విదేశీ పర్యటనను అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైందని, ప్రయాణానికి అనుమతి ఇవ్వొద్దని మంగళగిరి పోలీసులు శంషాబాద్ పోలీసులకు సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
17 ఆగష్టు 2024
తెలంగాణ

# కుల సంఘాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం..

## ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్..





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 (జనంసాక్షి):** రాష్ట్రంలో కుల సంఘాలను బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం వేములవాడ మున్సిపల్ పరిధిలో 14,19 వ వార్డులలో ఎస్డిఎఫ్ నిధులతో పలు కుల సంఘ భవనాల నిర్మాణనికి భూమి పూజ కార్యక్రమములో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేములవాడలో 34 కుల సంఘ భవనాల నిర్మాణనికి ఎస్డిఎఫ్ నిధులను మంజూరు చేసమని,కొన్ని భవనాలకు టెండర్ పూర్తి చేసుకొని నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయన్నారు.కులం అంటే ఒక బలం బలగం అన్నారు.గ్రామాల్లో ఏమయినా సమస్యలు ఉంటె వాటిని పరిష్కరించడానికి, గ్రామాభివృద్ధి కోసం కులాలు అన్ని ఏకం అవుతాయన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను భాగంగా ఆరు గ్యారంటీలలో ఇప్పటికే కొన్ని అమలు చేస్తున్నమన్నారు.దేశ చరిత్రలో కని విని ఎరగని రీతిలో రైతులకు రుణమాఫీ చేసమన్నారు. త్వరలోనే నూతన పెన్షలను,రేషన్ కార్డు మంజూరు చేస్తమన్నారు.రాజన్న ఆలయం అభివృద్ధికి మొన్న బడ్జెట్ లో 50 కోట్లు కేటాయించామని,మురుగు నీరు గుడి చెరువులో కలవకుండ నూతన కల్వర్టుల నిర్మాణనికి భూమి పూజ చేసుకున్నమన్నారు. అసంపూర్తిగా ఉన్న షాది ఖానా నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు.మైనార్టీ శాఖ ద్వారా వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తమన్నారు.త్వరలోనే మూలవాగునుండి రాజన్న ఆలయం వరకు రోడ్డు వెడల్పుతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ కౌన్సిలర్ ఇప్పపుల అజయ్, నాయకులు అన్నారం శ్రీనివాస్, నామాల లక్ష్మీరాజం,తూము మధు,పుల్కం రాజు,చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కనికరపు రాకేష్,పొంచేట్టి శంకర్ ఆ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించిన టిఎన్జీవో నేతలు

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించిన టిఎన్జీవో నేతలు



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 16 (జనంసాక్షి) :** శుక్రవారం రోజు స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్నటువంటి శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయంలో నూతనంగా సూడ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేం లక్ష్మణరావు ల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన సంఘం నేతలు సూడా చైర్మన్ కి సుడా పరిధిలో గ్రామ పంచాయతీలో ఉన్నటువంటి ఇంటి పర్మిషన్లకు సంబంధించి గ్రామస్తులు అదే విధంగా పంచాయతీ సెక్రటరీలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటికి సంబంధించి సరైనటువంటి గవర్నమెంట్ ఆర్డర్లను వచ్చే విధంగా చర్యలు తీసుకోని ప్రభుత్వానికి నివేదికలు పంపాలని చైర్మన్ కోరినారు. ఈ సమస్యలు విన్నటువంటి చైర్మన్ సానుకూలంగా స్పందించి మంత్రులు శ్రీధర్ బాబు, ప్రభాకర్ లతో చర్చిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా టిఎన్జీవోల తరపున సుడా చైర్మన్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నాయకులు నరసింహ స్వామి, ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్ ,అర్బన్ అధ్యక్షులు సర్దార్ హర్మేందర్ సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, జిల్లా నాయకులు జలాలుద్దిని అక్బర్, రమేష్ గౌడ్, సుస్మిత, ప్రవీణ్రావు, రాజిరెడ్డి, బరిగెల శ్రీనివాస్, అజయ్ కుమార్, నారాయణ, కరుణాకర్, సీనియర్ ఇన్స్పెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ మోయిజ్ ,4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కోట రామస్వామి, శంకర్, రాజేశ్వరరావు, అల్లే శ్రీనివాస్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 (జనంసాక్షి):** శ్రావణ మాసంలో వరలక్ష్మి శుక్రవారం రావడంతో మహిళలు అమ్మవారి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారు. వేములవాడలో శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ అలయమైన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుండి మహిళలు బారులు తీరారు.అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం పోసి ,కుంకుమ పూజలు నిర్వహించుకున్నారు.అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. సాయంత్రం రాజన్న ఆలయం నుండి అర్చకులు మేళతాళాలతో మహాలక్ష్మి ఆలయానికి చేరుకుని ఆలయ అర్చకులు అమ్మవారికి షోడోప చార పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ గట్టు గౌతం,అర్చకులు,భక్తులు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత బస్సు రవాణ సౌకర్యం పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కెటిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

### క్షమాపణ చెప్పాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్..



**కరీంనగర్ బ్యూరో, ఆగష్టు 16 (జనంసాక్షి) :** మహిళల ఉచిత బస్సు సౌకర్యం పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చర్ల పద్మ ఆధ్వర్యంలో దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... పది సంవత్సరాలు ప్రజలను మోసం చేసి అధికారం కోల్పోగానే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన చూసి ఓర్వలేక కెటిఆర్ మహిళల ఉచిత బస్సు రవాణ సౌకర్యం పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కెటిఆర్ వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని లేకపోతే మహిళల ఆగ్రహానికి గురిగాక తప్పదని అన్నారు. చర్ల పద్మ మాట్లాడుతూ... మహిళలు పని లేకుండా బస్సులల్లో తిరుగరని ఎంతో బాధ్యతతో కుటుంబాన్ని నెట్టుకొస్తారని అవినీతి డబ్బులతో కళ్ళు నెత్తికెక్కిన కెటిఆర్ మహిళలను అవమాన పరుస్తున్నాడని వెంటనే క్షమాపణ చెప్పకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాజొద్దిన్, ముక్క భాస్కర్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, జ్యోతి రెడ్డి, రజితా రెడ్డి, మెరుగు స్వప్న, మాలోతు మహాలక్ష్మి, అస్తపురం తిరుమల, నెన్నెల పద్మ, రాచర్ల లత, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జిడి రమేష్, కుర్ర పోచయ్య, మహమ్మద్ చాంద్, దండి రవీందర్, షేక్ షేహెన్ష, సుదర్శన్, మిరాజ్, అష్రఫ్, మాసుం ఖాన్, పొంద్రాల లింగమూర్తి, పెద్దిగారి తిరుపతి, జిలకర రమేష్, గణపతి,అనీఫ్,జమిల్,రాజ్ కుమార్,అబ్దుల్ భారీ,బషీర్,సయ్యద్ ఖలీల్, అనిల్,జుబెర్,సతీష్ రావు,ఇమ్రాన్, లింగంపల్లి లక్ష్మణ్, ఆంజనేయులు,కీర్తి కుమార్,ఆల్వాల భరత్ తదితరులు పాల్గొన్నారు.



## మాదిగ శక్తి మంథని నియోజకవర్గ అధ్యక్షునిగా మొగిలి..

**రామగిరి, జనంసాక్షి :** మాదిగ శక్తి మంథని నియోజకవర్గ అధ్యక్షులుగా రామగిరి మండలం బేగంపేట్ కు చెందిన మడిపెల్లి మొగిలి ని నియామకం చేసినట్లు జిల్లా అధ్యక్షులు కల్లెపల్లి రవి తెలిపారు. ఈమేరకు శుక్రవారం మాదిగ శక్తి వ్యవస్థాపకులు సురేందర్ సన్నీ తో కలిసి మొగిలికి రవి పెద్దపల్లి లో నియామక పత్రం అందజేశారు.మాదిగలు విద్య, ఉద్యోగ, రాజ కీయ రంగాలలో రాణించాలని, ఆర్థికంగా ఎదిగేలా కృషి చేయుట ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మాదిగలకు పిలుపునిచ్చారు. తన నియామకానికి సహకరించిన సన్నీ, రావిలకు మొగిలి కృతజ్ఞతలు తెలిపారు.

## ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి..

### - మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు..



**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని గోదావరిఖని చౌరస్తా, మార్కండేయకాలనీ-రాజేష్ టాకీస్ వద్ద మున్సిపల్ చౌరస్తా, మేడిపల్లి సెంటర్, ఎఫ్‌సీఐ సెంటర్ వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నగరంలో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో వీటి కారణంగా తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.ఈ ట్రాఫిక్‌లో రోడ్డుపై ప్రయాణించాలంటే భయపడవలసి వస్తుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌కు తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కౌన్సిల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఈదునూరి శంకర్ లేఖ ఇచ్చారు. అత్యవసరంగా ఈ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను మరమ్మత్తు చేయించి ఉపయోగంలోకి తీసుకువచ్చి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఆయన కోరారు.కమిషనర్ దీనికి సంబంధించిన చర్యలు వెంటనే చేపడుతామని హామీ ఇచ్చారు.

# నేటి వరకు కానరాని రుణమాఫీ అర్హుల లిస్ట్..

- అయోమయంలో అన్నదాతలు
- సమాచారం లేదంటున్న అధికారులు




**ఇబ్రహీంపట్నం , ఆగస్టు 16,( జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 15 లోపు కచ్చితంగా రుణమాఫీ చేసి తీరుతామని వివిధ సభలలో ప్రకటించి ప్రతిపక్ష నేతలకు సవాల్ కూడా విసిరారు. జూలై 15వ తేదీన రుణమాఫీ మొదటి దశను ప్రారంభిస్తున్నట్లు జీవనం జారీ చేశారు. దీంతో అన్నదాతలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. జూలై నెలాఖరు వరకు 1 లక్ష 50 వేల రూపాయలను కలిగి ఉన్న రైతులకు రుణమాఫీకి నిధులు విడుదల చేస్తూ , అర్హుల లిస్టును సైతం ప్రకటించారు. ఈ క్రమంలో ఆగస్టు 15 న ఖమ్మం జిల్లాలోని వైరాలో 2 లక్షల రుణాలు ఉన్న రైతుల రుణమాఫీ కి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కానీ నేటి వరకు రుణమాఫీ అర్హుల లిస్టును ప్రకటించకపోవడంతో , రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమకు రుణమాఫీ వచ్చిందేమోనని తెలుసు కోవడానికి బ్యాంకుల వద్ద బారులు తీరారు. కొందరు రైతులు వ్యవసాయ అధికారికి ఫోన్ చేసి అడిగారు. అయితే అధికారులు మాత్రం ఇప్పటి వరకు ఎటువంటి లిస్టు తమ వద్దకు రాలేదని , మరో రెండు రోజుల సమయం పట్టొచ్చు అన తెలిపినట్లు సమాచారం. అయితే రుణమాఫీ లిస్టును ప్రకటించి, రైతుల ఆందోళన తొలగించాలని రైతులు కోరుతున్నారు.



## శ్రీ మహాశక్తి దేవాలయంలో కన్నుల పండుగగా శ్రావణ శుక్రవార వరలక్ష్మి వ్రత వేడుకలు

- మహిళా భక్తులతో కిటకిటలాడిన దేవాలయ ప్రాంగణం.. అశేషంగా తరలివచ్చిన భక్తులు..
- అమ్మవార్లకు ఓడి బియ్యం సమర్పించి, వరలక్ష్మీ వ్రతం, కుంకుమార్చనలో పాల్గొన్న సుహాసినులు..

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 16 (జనంసాక్షి) :** కరీంనగర్ పట్టణంలోని శ్రీమహా దుర్గ, శ్రీమహా లక్ష్మి , శ్రీమహా సరస్వతి అమ్మవార్ల మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శ్రీ వరలక్ష్మి వ్రత వేడుకలు కన్నుల పండుగగా సాగాయి. శ్రీ మహాశక్తి దేవాలయంలోని ముగ్గురు అమ్మవార్లు భక్తుల పాలిట కొంగు బంగారంగా మారిన నేపథ్యంలో ఆలయంలో శ్రీ వరలక్ష్మి వ్రతం వేడుకకు అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముఖ్యంగా మహిళా భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి దివ్య మంగళా శాసనాలతో ఆలయ అర్చకులు దేవాలయంలో ప్రాతః కాలం 5 గంటలకు శ్రీ మహదుర్గ, శ్రీమహాలక్ష్మి , శ్రీమహాసరస్వతి అమ్మవార్లకు అభిషేక పూజలు, సాయంత్రం 7 గంటలకు సామూహిక శ్రీ వరలక్ష్మి వ్రతం, కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. సుహాసినులు అమ్మవార్లుకు ఒడి బియ్యం సమర్పించి , వరలక్ష్మి వ్రతం, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ తీగల కుటుంబాన్ని పరామర్శించిన క్రీడాకారులు

**రామగిరి, జనంసాక్షి :** రామగిరి మండలంలోని నాగపెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య తల్లి తీగల మల్లక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. వారి కుటుంబాన్ని సెంటినరీ కాలనీ కి చెందిన పలువురు వాలీబాల్ క్రీడాకారులు పరామర్శించారు. కీర్తిశేషులు తీగల మల్లక్క చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డా. బోద్దుల.జగన్,పీవీరావు, సంగం రాజేందర్,డా. సుంక ప్రవీణ్, బుద్దుల రవి,బూర్గు రాజు,బుడిగే. శ్రీధర్,చింతం కిరణ్,తన్నీరు ప్రదీప్,పాలేటి.రవి.మట్ట కనికేష్ పాల్గొన్నారు.





# 20న పెద్దపల్లిలో బీసీ సదస్సుకు తరలిరావాలి

### - యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లేశం

**పెద్దపల్లి,ఆగస్టు 16(జనంసాక్షి) :** ఈనెల 20న పెద్దపల్లిలో ఎంబి గార్డెన్ లో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం సదస్సు కరపత్రాలను విడుదల చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న యాదవులు, యాదవ యువత పెద్ద సంఖ్యలో బీసీ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మనమెంతో మనకంత అనే నినాదంతో దేశంలో, రాష్ట్రంలో సమగ్ర కుల జనగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్రంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ అమలు పరిచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే బీసీ సదస్సుకు స్వచ్ఛందంగా యాదవులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ స్టేట్ కౌన్సిల్ మెంబర్ శిలారపు పర్వతాలు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, బత్తిని లక్ష్మణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై శ్రావణ్ కుమార్ ప్రశంసా పత్రం



**సుల్తానాబాద్, ఆగస్టు 15 (జనంసాక్షి) :** విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి నందుకు గాను సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమార్ కు ప్రశంస ప్రతిభ పత్రాన్ని స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎమ్మెల్యే విజయ రమణారావు చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా విధి నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణలో సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమార్ ప్రజలకు అందుబాటు లో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్నారు. గంజాయి నిర్మూలన షీ టీం పై అవగాహన సదస్సులు దొంగతనాల నివారణ లో ఎస్సై శ్రావణ్ కుమార్ పై అధికారుల ఆదేశాల మేరకు అన్నదైన శైలిలో విధులు నిర్వహించారు.

## టి ఎస్ ఆర్ టి సి పెద్దపల్లి బస్టాండులో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు

**పెద్దపల్లి,ఆగస్టు 16(జనంసాక్షి) :** పెద్దపల్లి బస్టాండ్ ఆవరణలో లో 78వ గణతంత్ర దినోత్సవం పెద్దపల్లి బస్టాండ్ సిబ్బంది ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్ఎం కె ఆర్ రెడ్డి కంట్రో లర్ మాట్లాడుతూ పెద్దపల్లి బస్టాండ్ నుండి ప్రయాణం చేస్తున్నా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహనీయుల త్యాగాలు మరువలేనివనీ అన్నారు. ఈ కార్యక్రమంలో జన్నె ప్రభాకర్,లక్ష్మణ్ మోని దిన్ బస్సు పాస్ తుమ్మ రమేష్,ఆర్టీసీ విజిలెన్స్ కానిస్టేబుల్ రమేష్ మరియు అక్షయ్ ఇతర ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



## మాదిగ శక్తి మంథని నియోజకవర్గ అధ్యక్షునిగా మొగిలి

**పెద్దపల్లి,ఆగస్టు 16(జనంసాక్షి) :** మాదిగ శక్తి మంథని నియోజకవర్గ అధ్యక్షులుగా రామగిరి మండలం బేగంపేట్ కు చెందిన మడిపెల్లి మొగిలి ని నియామకం చేసినట్లు జిల్లా అధ్యక్షులు కల్లెపల్లి రవి తెలిపారు. ఈమేరకు శుక్రవారం మాదిగ శక్తి వ్యవస్థాపకులు సురేందర్ సన్నీ తో కలిసి మొగిలికి రవి పెద్దపల్లిలో నియామక పత్రం అందజేశారు.మాదిగలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రాణించాలని, ఆర్థికంగా ఎదిగేలా కృషి చేయుట ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మాదిగలకు పిలుపునిచ్చారు. తన నియామకానికి సహకరించిన సన్నీ, రావిలకు మొగిలి కృతజ్ఞతలు తెలిపారు.

# నాకు సాయం చేయండి

## నా కోచ్‌కు 'ఒలింపిక్స్' వీసా రాలేదు



పారాలింపిక్స్‌లో పతక వేటకు సిద్ధమైన బ్యాడ్మింటన్ స్టార్ కృష్ణా నగర్‌కు ఊహించని పరిస్థితి ఎదురైంది. విశ్వ క్రీడల కోసం అతడితో వెళ్లాల్సిన కోచ్ వీసాను పారిస్ అధికారులు పక్కన పెట్టేశారు. దాంతో, కృష్ణా సాయం కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించాడు. 'ప్లీజ్ నాకు సాయం చేయండి' అంటూ అతడు ఎక్స్ వేదికగా అభ్యర్థించాడు. 'నా వ్యక్తిగత కోచ్ వీసాను పారిస్ ఒలింపిక్ నిర్వాహకులు తిరస్కరించారు. నా విజయంలో అతడి పాత్ర ఎంతో ఉంది. అందుని ఫ్రాన్స్ దౌత్య కార్యాలయాన్ని మరోసారి అతడి వీసా దరఖాస్తును పరిశీలించాల్సిందిగా మనవి చేస్తున్నా. మీ విలువైన సలహాలు, సూచనలకు అభినందనలు' అని కృష్ణ తన పోస్ట్‌లో రాసుకొచ్చాడు. టోక్యో పారాలింపిక్స్ పురుషుల సింగిల్స్‌లో కృష్ణ అదరగొట్టాడు. ఎస్‌హెచ్ 6 విభాగంలో పసిడి పతకంతో రికార్డు నెలకొల్పాడు. ఈసారి కూడా అతడు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. కృష్ణతో పాటు 13 మంది షట్లర్లు పారిస్ ఆతిథ్యమిస్తున్న పారాలింపిక్స్‌కు అర్హత సాధించారు. ఆగస్టు 28 బుధవారం నుంచి పారాలింపిక్స్ షురూ కానున్నాయి. సెప్టెంబర్ 8వ తేదీతో ఈ పోటీలు ముగుస్తాయి. ఈసారి కనీసం 25 పతకాలు గెలుస్తామని పారాలింపిక్స్ ఇండియా చీఫ్ దేవేంద్ర ఝఝారియా చెప్పిన విషయం తెలిసిందే. డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల తర్వాత రెజ్లర్ల అభ్యర్థన మేరకు ఢిల్లీ హై కోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. డబ్ల్యూఎఫ్ఐ అధికారాలకు కళ్లెం వేస్తూ నిర్ణయాధికారాన్ని ఐఓఏకు చెందిన అడ్‌హక్ కమిటీకి అప్పగించింది. దాంతో, రెజ్లింగ్ సమాఖ్య సొంతంగా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. అందువల్ల కోర్టును ఆశ్రయించాలని సంజయ్ సింగ్ బృందం ఆలోచిస్తోంది. 'హై కోర్టు ఆర్డర్‌ను మేము ద్విసభ్య ధర్మాసనం దృష్టికి తీసుకెళ్తాం. ఇప్పటికే అడ్‌హక్ ప్యానెల్‌ను ఐఓఏ రద్దు చేసింది. ఈ విషయమై యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్, అంతర్జాతీ ఒలింపిక్ కమిటీని కూడా మేము సంప్రదిస్తాం. ఎందుకంటే.. బయటి సంస్థల, వ్యక్తుల జోక్యం కారణంగా అథ్లెట్ల ప్రదర్శనపై ప్రభావం పడుతుందని ఇవి హెచ్చరించాయి' అని సంజయ్ సింగ్ తెలిపాడు.

### బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా..

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా కుస్తీ వీరులు ఉద్యమించిన విషయం తెలిసిందే. వినేశ్ ఫోగాట్, భజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్‌ల పోరాటంతో బ్రిజ్ భూషణ్‌పై వేటు పడింది. అనంతరం జరిగిన డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల్లో అతడి సన్నిహితుడు సంజయ్ సింగ్ గెలుపొందాడు. దాంతో, ఆందోళన వ్యక్తం చేసిన రెజ్లర్లు భారత ఒలింపిక్ సంఘాన్ని ఆశ్రయించారు. ఫలితంగా ఐఓఏ ఒక అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసి డబ్ల్యూఎఫ్ఐ ఏకపక్ష ధోరణికి ముకుడతాడు వేసింది.

# జనవరిలో దక్షిణాఫ్రికా 20 లీగ్

### వేలం ముహూర్తం ఖరారు

ప్రపంచ క్రికెట్‌లో టీ20ల క్రేజ్ తగ్గట్లేదు. ఏడాది పొడవునా పొట్టి లీగ్స్ జరుగుతూనే ఉన్నాయి. త్వరలోనే మరో టీ20 లీగ్ అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతోంది. అవును.. దక్షిణాఫ్రికా 20 లీగ్ మూడో సీజన్ వచ్చే ఏడాది జనవరి 9న మొదలవ్వనుంది. అంతకంటే ముందుగా మినీ వేలానికి యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీన ఎస్ఏ20 మూడో సీజన్ మినీ వేలం జరుగనుంది. ఈ విషయాన్ని శుక్రవారం బెట్‌వే ఎస్ఏ20 చైర్మన్ గ్రేమ్ స్మిత్ ఓ ప్రకటనలో వెల్లడించాడు. ఐపీఎల్ స్ఫూర్తితో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు సైతం ఎస్20 లీగ్‌కు 2023లో శ్రీకారం చుట్టింది. తొలి రెండు సీజన్లు రంజుగా సాగడంతో మూడో సీజన్‌ను మరింత ఉత్సాహంగా జరపాలని నిర్వాహకులు భావిస్తున్నారు. మూడో సీజన్‌లో ప్రతి జట్టుకు 13 మంది ఆటగాళ్లను కొనడానికి వీలుంటుంది. 'ఎస్ఏ20 మూడో సీజన్‌లో పలువురు అంతర్జాతీయ స్టార్లు పాల్గొంటారు. దినేశ్ కార్తిక్, జో రూట్, కేన్ విలిమయ్సన్, రహ్మానుల్లా గుర్బాజ్, జానీ బెయిర్‌స్టో, డెవాన్ కాన్వే.. ఫేమస్ క్రికెటర్లంతా తమ జట్ల తరఫున దంచేందుకు రెడీగా ఉన్నారు. ఈ వేలంలో పాల్గొనాలనుకునే వాళ్లు ఆగస్టు 16 నుంచి తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సెప్టెంబర్ 6వ తేదీతో రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుంది. ఎస్ఏ 20కి వరల్డ్ క్లాస్ గుర్తింపు రావడానికి కష్టపడ్డ ప్రతిఒక్కరికి ధన్యవాదాలు' అని స్మిత్ తెలిపాడు.



### రెండు సీజన్లు ఆ జట్టే

ఎస్ఏ20 మూడో సీజన్ 2025 జనవరి 9న మొదలవ్వనుంది. నెల రోజుల పాటు జరిగే ఈ టోర్నీల్ ఎడెన్ మర్క్‌రమ్ సారథ్యంలోని సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్‌కు చెందిన పార్ల్ రాయల్స్ జట్టు జెర్సీతో కార్తిక్ తళుక్కుమననున్నాడు. దాంతో, ఎస్ఏ 20లో ఆడనున్న తొలి భారత క్రికెటర్‌గా కార్తిక్ రికార్డు సొంతం చేసుకున్నాడు.




## భారత గ్రాండ్‌మాస్టర్‌కు షాక్..!

### బ్లిట్జ్ రౌండ్‌లో అద్భుతం చేస్తాడా..!

భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానందకు ఊహించిన షాక్ తగిలింది. ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో ఈ యంగ్‌స్టర్ తీవ్రంగా నిరాశపరుస్తూ పదో స్థానానికి పరిమితమయ్యాడు. ప్రపంచ టెస్ టోర్నీలో వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌కు ముచ్చెమటలు పట్టించిన ప్రజ్ఞానంద సెయింట్ లూయిస్‌లో జరుగుతున్న ఈ చెస్ టోర్నీలో సత్తా చాటలేకపోయాడు. ఎనిమిది మ్యాచుల్లో ఒక్కదాంట్లోనూ ప్రజ్ఞానంద గెలవలేకపోయాడు. దాంతో, 18 పాయింట్లు గెలవాల్సిన చోట నాలుగు పాయింట్లతో అడ్డడుగున నిలిచాడు. ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్‌లో ప్రజ్ఞానంద ఎత్తులు ఫలితమివ్వలేదు. మూడింటా ఓడి.. మరో మూడు మ్యాచులను డ్రా చేసుకున్న భారత గ్రాండ్‌మాస్టర్ ఆఖరి రోజు కూడా నిరాశపరిచాడు. ఏడో రౌండ్‌లో లినియెర్ డిమింగెజ్ చేతిలో ఓడిపోయాడు. ఆ తర్వాత మరో అమెరికా ఆటగాడు హికరు నకమురాపై కూడా ప్రజ్ఞానంద పైచేయి సాధించలేకపోయాడు. అయితే.. ఫ్రాన్స్ ఆటగాడైన అలిరెజా ఫిరౌజాతో మ్యాచ్ డ్రా చేసుకొని పరువు కాపాడుకున్నాడు. ఈ పరిస్థితుల్లో ప్రజ్ఞానంద ముందంజ వేయాలంటే బ్లిట్జ్ రౌండ్‌లో అసాధారంగా ఆడాల్సి ఉంటుంది. ప్రస్తుతం టూర్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్న అతడు అద్భుంగా ఆడితే భారత్‌కే చెందిన డి.గుకేశ్‌కు పోటీగా మారుతాడు. నాలుగో స్థానంలో ఉన్న గుకేశ్ త్వరలో జరుగబోయే సింక్వెఫీల్డ్ కప్‌లో ఆడనున్నాడు.

# షూటింగ్‌కు విరామం..!

### మను గురి ఇక హాబీలపై

పారిస్ ఒలింపిక్స్ షూటర్ మను భాకర్ కెరీర్‌ను మరో మెట్టు ఎక్కించాయి. విశ్వ క్రీడల్లో రెండు కాంస్య పతకాలతో చరిత్ర సృష్టించిన ఆమె యావత్ దేశం గర్వపడేలా చేసింది. ఒలింపిక్ విజేతగా స్వదేశంలో అడుగుపెట్టిన మను కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోనుంది. ఈ సమయంలో ఆమె తన హాబీలపై గురి పెట్టనుంది. అలాగని ఒకటో రెండో ఉన్నాయనుకుంటే పొరపాటే. అవును.. మను హాబీల జాబితాలో మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీ.. భరతనాట్యం.. ఇలా చాలానే ఉన్నాయండోయ్. 'ఒలింపిక్స్ తర్వాత చిన్న బ్రేక్.. ఈ గ్యాప్‌లో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలనుకున్నా. చిన్నప్పుడు కరాటే అంటే ఇష్టం. కానీ, అనుకోకుండా షూటింగ్ వైపు మళ్లాను. అయితే ఇప్పటికిప్పుడు మార్షల్ ఆర్ట్స్ సాధ్యం కాకపోవచ్చు. అందుకని నాకెంతో ఇష్టమైన గుర్రపు స్వారీ, స్కేటింగ్ నేర్చుకుంటా. వీటితో ఫిట్‌నెస్ మెరుగుపడుతుంది. ఇక భరతనాట్యం అన్నా కూడా నాకు ప్రేమనే. ఫ్రాన్స్‌లో కొన్ని రోజులు నేర్చుకున్నాను' అని మను తెలిపింది. టోక్యో ఒలింపిక్స్ వైఫల్యంతో పాఠాలు నేర్చిన మను భాకర్.. పారిస్‌లో పతక గర్జన చేసింది. మాజీ కోచ్ జస్పాల్ రానా సలహాలతో మెరుగైన భాకర్ వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో కంచు మోత మోగించింది. తద్వారా ఒకే విశ్వక్రీడల్లో రెండు పతకాలు కొల్లగొట్టిన భారత తొలి షూటర్‌గా ఆమె రికార్డు నెలకొల్పింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత పోటీల్లో మను మూడో స్థానంతో దేశానికి తొలి మెడల్ అందించింది. అనంతరం సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మళ్లీ సత్తా చాటిన ఆమె కాంస్యంతో మెరిసింది. ఒలింపిక్స్ కోసం సుదీర్ఘంగా శిక్షణ పొందిన మను మూడు నెలలు బ్రేక్ తీసుకోనుంది. దాంతో, అక్టోబర్‌లో ఢిల్లీ వేదికగా జరగనున్న షూటింగ్ వరల్డ్ కప్‌లో ఆమె పాల్గొనడంపై సందేహాలు నెలకొన్నాయి.




## ఐఓఏ కమిటీ పెత్తనంపై గుస్సా

### కోర్టును ఆశ్రయించనున్న రెజ్లింగ్ సమాఖ్య

ఒలింపిక్స్ ముగియడంతో భారత రెజ్లింగ్ సమాఖ్య కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ హై కోర్ట్ ఆర్డర్‌ను సవాల్ చేసేందుకు సిద్ధమైంది. రెజ్లింగ్ సమాఖ్యపై భారత ఒలింపిక్ సంఘానికి చెందిన అడ్ హక్ కమిటీ జోక్యం కొనసాగుతుందని హైకోర్టు చెప్పడమే అందుకు కారణం. దాంతో, తమపై ఐఓఏ కమిటీ పెత్తనం ఏంటని? రెజ్లింగ్ సమాఖ్య గుర్రుగా ఉంది. ఈ విషయాన్ని కోర్టులో తేల్చుకోవాలని డిసైడ్ అయ్యామని శుక్రవారం డబ్ల్యూఎఫ్ఏ వెల్లడించింది. డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల తర్వాత రెజ్లర్ల అభ్యర్థన మేరకు ఢిల్లీ హై కోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. డబ్ల్యూఎఫ్ఐ అధికారాలకు కళ్లెం వేస్తూ నిర్ణయాధికారాన్ని ఐఓఏకు చెందిన అడ్‌హక్ కమిటీకి అప్పగించింది. దాంతో, రెజ్లింగ్ సమాఖ్య సొంతంగా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. అందువల్ల కోర్టును ఆశ్రయించాలని సంజయ్ సింగ్ బృందం ఆలోచిస్తోంది. 'హై కోర్టు ఆర్డర్‌ను మేము ద్విసభ్య ధర్మాసనం దృష్టికి తీసుకెళ్తాం. ఇప్పటికే అడ్‌హక్ ప్యానెల్‌ను ఐఓఏ రద్దు చేసింది. ఈ విషయమై యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్, అంతర్జాతీ ఒలింపిక్ కమిటీని కూడా మేము సంప్రదిస్తాం. ఎందుకంటే.. బయటి సంస్థల, వ్యక్తుల జోక్యం కారణంగా అథ్లెట్ల ప్రదర్శనపై ప్రభావం పడుతుందని ఇవి హెచ్చరించాయి' అని సంజయ్ సింగ్ తెలిపాడు.



## రోడ్డు ఇచ్చేదాకా వదిలిపెట్టాం

### గ్రామస్తుల ఆందోళన:నచ్చజెప్పిన తహసీల్దార్

**శివ్వంపేట ఆగస్ట్ 16 (జనంసాక్షి):**

మండల పరిధిలోని బిజిలిపూర్ గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన దుర్గమ్మ, దేవాలయానికి రోడ్డు ఇవ్వాలని గ్రామస్తులందరూ ముక్తకంఠంతో విజ్ఞప్తి చేయగా అందుకు నెల రోజుల క్రితం అంగీకరించిన భూ యజమానులు ఒక పట్టాదారు భూమిలో నుంచి 15 ఫీట్లు, మరొక పట్టాదారు భూమిలో నుంచి 15 ఫీట్ల రోడ్డు మొత్తం 30 ఫీట్ల రోడ్డు దేవాలయానికి ఇవ్వడానికి పట్టాదారులు స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ చారి, స్థానిక ఎస్ఐ మహి పాల్ రెడ్డిలతో మాట్లాడి వారి సమక్షంలోనే రోడ్డు ఇవ్వడానికి అంగీకరించారని గ్రామస్తులు చెప్పారు. అదే రోజున దుర్గమ్మ ఆలయం వద్దకు రోడ్డు నిర్మాణానికి తహసిల్దార్ చేత భూమి పూజ నిర్వహించి, మాజీ ఉపసర్పంచ్ జాంగిర్ అతడి సోదరుడు చంద్ పాషా లు ఒప్పుకొని కొబ్బరికాయలు కొట్టించారు. తాను 15 ఫీట్ల రోడ్డు ఇవ్వనని కేవలం 5 ఫీట్లు మాత్రమే ఇస్తానని, మరో పట్టాదారు సమీనా మాటమీద నిలబడకుండా వెనుకకు తిరగడంతో ఆగ్రయించిన గ్రామస్తులు శుక్రవారం గ్రామంలోని ప్రధాన రోడ్డుపై నిరసన వ్యక్తం చేసి, తహసిల్దార్ శ్రీనివాస్ చారి కారుకు అడ్డుగా నిలబడి ఘోరావ్ చేశారు. ఏది ఏమైనా భూ యజమానులు ఇచ్చిన మాటపై నిలబడి రోడ్డు ఇస్తే సరి అని లేదంటే ఎక్కడిదాకా అయినా పోరాడుతామని గ్రామస్తులు హెచ్చరించారు. గ్రామంలో గందరగోళ, ఉద్రిక్త పరిస్థితులు వద్దని సమస్యను ఈ వర్గాలను కార్యాలయానికి పిలిచి మాట్లాడి దారి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తహసిల్దార్ శ్రీనివాస్ చారి గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

## ఖమ్మం జిల్లా మాజీ వైస్ చైర్మన్ మృతి పట్ల శ్వేత సంతాపం

**ఖమ్మం ఆగస్టు 16 (జనం సాక్షి):**

ఖమ్మం జిల్లా మాజీ వైస్ చైర్మన్ అఫ్జల్ మృతి పట్ల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దోరేపల్లి శ్వేత సంతాపం తెలిపారు. అఫ్జల్ మృతదేహాన్ని సందర్శించి పూల పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ 10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామకృష్ణ, సూర్య, ముత్తయ్య గుండ్ల కృష్ణ పాల్గొన్నారు.

# మాఫీ కాని రైతుల రుణాలకు గ్రహణం వీడేనా..!

- సాంకేతిక లొసుగులను సరి సరి చేసే వారెవరు..?
- నమ్మకం కలిగించని నాలుగో విడత రుణ మాఫీ ..

**వనపర్తి,ఆగష్టు 16 (జనంసాక్షి):**

రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేసి నట్లు ప్రకటించింది. కాని రూ.2 లక్షల లోపు రుణాల మాఫీ సొమ్ము ఎంత మంది రైతుల ఖాతాల్లో జమ అయిందో పక్కా లెక్కలు చెప్పడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలం అయ్యారన్న విమర్శలు సర్వత్రా కొనసాగుతున్నాయి. దీంతో రుణ మాఫీ ప్రక్రియకు పట్టిన గ్రహణం పట్టినట్లేనని పలు రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. 15 ఆగష్టు లోగా 2 లక్షల రుణాలను మాఫీ చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా రాష్ట్ర మంత్రులు పదే పదే ప్రకటనలు చేసినప్పటికీ, రుణ మాఫీకి అర్హుల జాబితాలను మాత్రమే విడుదల చేశారే తప్ప ఇప్పటి వరకు లబ్ది పొందిన వారి పేర్లను బయట పెట్టలేదని విపక్షాల నాయకులు విమర్శిస్తున్నారు. తొలి విడతలో లక్ష వరకు, రెండో విడతలో లక్షన్నర వరకు, మూడో విడతలో రూ. 2 లక్షల వరకున్న బకాయిలను మాఫీచేసింది. అయితే ఈ కేటగిరీల్లో ఇంకా కొందరు రైతులు మిగిలిపోయారు. రేషన్ కార్డులులేని, సాంకేతిక సమస్యలతో అనర్హుల జాబితాలో చేరిన రైతులకు ఇంకా రుణమాఫీ చేయాల్సి ఉంది.2023 డిసెబర్ 12వ తేదీనాటికి రూ.2లక్షల లోపు రుణాలున్న రైతుల జాబతాలను పంపాల్సిందిగా ప్రభుత్వం బ్యాంకర్లను కోరింది మొదట లక్ష లోపు వారి పేర్లు రెండో విడతలో లక్షన్నర రూ లోపు అర్హుల జాబితాలను కమర్షియల్ బ్యాంకులు సహకార సంఘాలు డీసీసీ కోఆపరేటివ్ బ్యాంకులు తాము ఇచ్చినప్పుడు ఉన్న మాదిరిగా పేర్లను వ్యవసాయ శాఖ కమీషనర్‌కు పంపారు.



### బ్యాంకర్ల అలసత్వమే రైతుల పాలిట శాపం

అయితే రుణాలను మంజూరీ చేసిన సందర్భంగా పట్టాదారు పాసు పుస్తకాల్లో కొంత మంది రైతుల ఇంటి పేర్లు పూర్తి గా ఉండగా, మరి కొంత మంది పేర్ల ముందు ఇనిషియల్స్ అంటే ఏకాక్షరాన్ని (ఉదాహరణకు పసుల బాలస్వామికి బదులుగా పి. బాలస్వామి అని) బ్యాంకర్లు రాశారు. ప్రస్తుతం బ్యాంకర్ల అలసత్వమే రైతుల పాలిట శాపంగా మారింది. అంతేకాకుండా రేషన్ కార్డు ప్రామాణి ఒకే ఇంటి నంబరు కంగా అర్హులను నిర్ణయించడం వలన కుటుంబంలో ఇద్దరికి పైగా పాసు పుస్తకాలు కలిగి ఆ మేరకు తీసుకున్న రుణాలు రెండు లక్షల రూపాయలకు మించినా సరే ఆయా రైతుల రుణాలు మాఫీ కానందున గందరగోళం ఏర్పడింది. వాటన్నింటిని సరి చేయాలంటే సవాలక్ష కొర్రీలను అధిగమించాల్సి ఉంటుంది. దీనికి తోడు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల ఎత్తుగడల మధ్య నలుగుతున్న ధరణి ,భూమాత అనే వ్యవసాయ భూముల రికార్డుల మార్పులు చేర్పుల ప్రఛన్న యుద్ధం,రాజకీయ ప్రయోజనాలు కలగలిపి అన్నదాతలను మరింత ఆందోళనలకు గురి చేస్తున్నది.

### నమ్మకం కలిగించని నాలుగో విడత రుణ మాఫీ

రూ. 2 లక్షలకు పైగా ఉన్న పంట రుణాలను నాలుగో విడతలో మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. కాని గత మూడు విడతలుగా ప్రకటించిన మాఫీ జాబితాలో పేర్లు లేని రైతులు నాలుగో విడతను నమ్మడం లేదు. 15 ఆగష్టులోగా రెండు లక్షలు మాఫీ చేశామని పంతం నెగ్గించుకోవడానికి ఇచ్చిన ప్రాధాన్యతను, గత మూడు జాబితాల్లో ఉన్న లొసుగులను సవరించడం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి చూపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 22,22,067 మంది రైతులకు రూ. 17,869.26 కోట్ల మాఫీ

మూడో విడత రుణమాఫీలో భాగంగా పంద్రాగస్టు రోజున రూ. 5,644.24 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రెండు లక్షల కేటగిరీలో ఉన్న 4,46,832 మంది రైతులకు గురువారం రుణమాఫీ చేసింది.ఆపై రుణాలున్న రైతులకు 4వ విడతలో మాఫీ చేస్తామని ఆ తర్వాతే గత 3 స్లాబుల్లో మిగిలినవారికి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.దీంతో ఇప్పటి వరకు 22,22,067 మంది రైతులకు రూ. 17,869.26 కోట్ల మాఫీ జరిగింది.

### వనపర్తి జిల్లాలో...

ఈ మేరకు వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు, అమరచింత, చిన్నంబావి, వీపనగండ్ల, పాన్ గల్ ,వనపర్తి, ఏదుల, గోపాల్ పేట, రేవల్లి, ఘనపురం, పెద్దమందడి, కొత్తకోట, మదనాపురం, పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో గత రెండు విడతలైన లక్ష 2లక్షల లోపు జాబితాల్లో 41,780 మంది రైతులకు రూ.28,30,45,345 మాఫీ కాగా మూడో విడతలో 51355 మందికి రూ.407 కోట్ల 71 లక్షల రూపాయలు మాఫీ అవడంతో 93135 మంది రైతులకు రూ.435 కోట్ల 30 లక్షలలకు పైగా మాఫీ కావడం గమనార్హం.

## పూర్తిస్థాయి రుణమాఫీ చేయని కాంగ్రెస్ ప్రభుత్వం



- స్థానిక సంస్థల్లో బిఆర్ఎస్ మెజార్టీ స్థానాలు సాధిస్తుంది
- ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు

**సంగారెడ్డి, ఆగష్టు 16, (జనంసాక్షి)**

అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని సంగారెడ్డి ఎమ్మెల్యేచింత ప్రభాకర్,జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. రైతు రుణమాఫీ పేరిట మోసం చేసింద నిఅన్నారు. తెలంగాణ వ్యాప్తంగా పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదని తూతూ మంత్రంగా రుణమాఫీ చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ అధిక సంఖ్యలో స్థానాలు కైవసం చేసుకుంటుందని జోష్యం చెప్పారు. హరీష్ రావుపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదని అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రాల సీఎం కూడా రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష మాట్లాడరని, సీఎం రేవంత్ రెడ్డి భాష మార్చుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శివకుమార్, జైపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, జలేంధర్ రావు, శ్రీనివాస్, మోహన్ సింగ్, శ్రవణ్ కుమార్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి పథకం పేదింటి ప్రజలకు వరం

- స్త్రీలను గౌరవ పరిచిన కేటీఆర్ కు ప్రజలు గుణపాఠం చెబుతారు
- ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్

**మెదక్ బ్యూరో, ఆగస్టు 16 (జనం సాక్షి):**

కళ్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపడుచులకు ఒక వరం అని నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. మెదక్ నియోజక వర్గంలోని పాపన్నపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే మండలంలోని లబ్దిదారులకు శుక్రవారం కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. స్త్రీలను అగౌరవపర్చుతూ మాట్లాడిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటిఆర్‌కు ప్రజలు తగిన బుద్ది చెపుతారని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ మండిపడ్డారు. శుక్రవారం పాపన్నపేట మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే కేటిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. గ్రామపంచాయితీ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం పాపన్నపేట మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ కు గ్రామపంచాయితీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి పత్రాన్ని అందజేశారు. చెట్లను నాటడమే కాకుండా ప్రతి ఒక్క చెట్టును కాపాడడం మనందరి బాధ్యత అని మెదక్ ఎమ్మెల్యే అన్నారు. పాపన్నపేట మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే మండల కేంద్రంలో చెట్ల మొక్కను నాటారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన మార్కెట్ యార్డ్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే ఎంకేపల్లి గ్రామంలో 50 మంది బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు చందన ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
17 ఆగస్టు 2024

# నిండుకుండలా నాగార్జున సాగర్

- పెద్ద ఎత్తున వరద.. 4 క్రస్ట్ గేట్లు ఎత్తివేత



**నల్లగొండ, ఆగస్ట్16 (జనంసాక్షి) :** నాగార్జున సాగర్ జలాశయానికి వరద పెరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరద పోటెత్తింది. ఎగువ కురిసిన వర్షాలకు కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టులకు వరద రాగా.. డ్యామ్ జలకళను సంతరించుకున్నది. ఇప్పటికే జలాశయం నిండకుండను తలపిస్తున్నది. దీంతో సాగర్‌లోని 4 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 79,528 క్యూసెక్కులుగా ఉంది. సాగర్ ప్రస్తుత, పూర్తి నీటిమట్టం 590 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 312 టీఎంసీలు. నాలుగు రోజుల కిందటి వరకు వరద ప్రవాహం రావడంతో 24 గేట్లు.. ఆ తర్వాత 18 గేట్లను ఎత్తి నీటి దిగువకు వదిలారు. రెండు రోజుల క్రితం వరద రావడంతో బుధవారం రెండు గేట్లను ఎత్తగా.. గురువారం వరద మరింత పెరిగింది. దాంతో ఆరు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. వరద మరింత పెరగడంతో ఇవాళ నాలుగు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ పరవళ్లను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో సాగర్‌కు క్యూ కట్టారు. వరుసగా సెలవులు రావడంతో సాగర్ వద్ద రద్దీ పెరిగే అవకాశం ఉన్నది.

# త్వరలోనే పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభం

- డిజైన్, నిర్మాణ అంశాలపై వర్క్ షాప్ ఏర్పాటు
- నీటి మట్టం 8 మీటర్ల దిగువన ఉండేలా పంపింగ్
- విదేశీ నిపుణుల బృందం కీలక సూచనలు
- ప్రాజెక్టను పర్యవేక్షించిన ఇంజినీర్ల బృందం

**అమరావతి, ఆగస్ట్16 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రాజెక్టుల్లో కీలకమైనది పోలవరం ప్రాజెక్టులు.. అయితే, పోలవరం ప్రాజెక్టు సవాళ్లపై అధ్యయనం చేసిన విదేశీ నిపుణుల బృందం కీలక సూచనలు చేసింది. వర్షాకాలం దాటగానే పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు వీలుగా డిజైన్, నిర్మాణ అంశాలు చర్చించేందుకు వర్క్ షాప్ ఏర్పాటు చేయాలని సూచించింది. ఇందులో పోలవరం ప్రాజెక్ట్ డిజైనర్, ప్రాజెక్టను పర్యవేక్షించే ఇంజినీర్ల బృందం, విదేశీ నిపుణుల బృందం ఉండాలని సూచించింది. డిజైన్ల రూపకల్పన, నిర్మాణ షెడ్యూలు నిర్ణయించడం, అందుకుతగ్గ వనరులు ఏవేంకావాలో ఈ వర్క్‌షాప్‌లో ఒక స్పష్టతకు రావాలని అభిప్రాయపడింది.. ప్రధాన డ్యాం ప్రాంతం పొడవునా సీపేజీ నీటిమట్టానికి 8 మీటర్ల ఎత్తులో ఒక ప్లాట్‌ఫాం నిర్మించాలని.. దాన్నుంచి ఎప్పుడూ నీటి మట్టం 8 మీటర్ల కన్నా దిగువన ఉండేలా పంపింగ్ ఏర్పాట్లు చేయాలని బృందం స్పష్టం చేసింది.. ఈ ఏర్పాట్లు వచ్చే వానాకాలంలో కూడా డయాఫ్రం వాల్ నిర్మాణానికి అవాంతరాలు కలిగించని స్థితిలో ఉండేలా చూడాలని విదేశీ నిపుణుల బృందం సూచించింది. కాగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన సీఎం చంద్రబాబు.. అప్పటి వరకు జరిగిన పనులపై ఆరా తీశారు.. ఆ తర్వాత.. పోలవరం ప్రాజెక్టు సవాళ్లపై అధ్యయనం చేసేందుకు విదేశీ నిపుణుల బృందాన్ని నియమించిన విషయం విదితమే.. ఇక, ఆ విదేశీ నిపుణుల బృందం.. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టును పరిశీలించింది.. ఇప్పుడు డిజైన్ మార్పులతో కొత్త డయాఫ్రం వాల్, ప్రధాన డ్యాం నిర్మించాలని కీలక సూచనలు చేసింది.. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల సీపేజిని పూర్తిగా నియంత్రించాలంటే ఎక్కువ ఖర్చవతుంది కాబట్టి.. వాటి జోలికి పోకుండా.. ఆ కాఫర్ డ్యాంలతోనే ముందుకు సాగాలని విదేశీ నిపుణుల కమిటీ సూచించింది.. ఇక, ఈ ఏడాది వర్షాకాలం దాటగానే పనులు ప్రారంభించేందుకు వీలుగా డిజైన్, నిర్మాణ అంశాలు చర్చించేందుకు ఒక వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలని పేర్కొన్న నిపుణుల కమిటీ.. ఆ వర్క్‌షాప్‌లో ప్రాజెక్టుపై ఒక స్పష్టతకు రావాలని సూచించింది.

## కోదండరాంకు ఎమ్మెల్సీ పట్ల
# మంచిర్యాలలో సంబరాలు

(మంచిర్యాల బ్యూరో / జనం సాక్షి)



మంచిర్యాల జిల్లా కేంద్రంలో తెలంగాణ జన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ బి. బాబన్న పాల్గొని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మిఠాయిలతో సంబరాలు నిర్వహించి అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొఫెసర్ కోదండరామ్ కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు విద్య సామాజిక న్యాయం సమాజాభివృద్ధికి వారి అచంచలమైన అంకితభావం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటుంది అని అన్నారు ప్రభుత్వంతో ప్రజల యొక్క సమస్యలు పరిష్కరించడంలో వారు ప్రధాన పాత్ర పోషిస్తారని అన్నారు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ రామచంద్ర రెడ్డి, గోనెల శ్రీనివాస్, బచ్చలి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి స్ఫూర్తిని నింపండి

- అదే భవిష్యత్ బ్యాంక్ బ్యాలెన్స్



**నిజామాబాద్, ఆగస్ట్16 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే మానవ మనుగడ కొనసాగుతుందని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇప్పటికే నాటిన వారు వాటిని సంరక్షించాలని, కొత్తగా నాటనివారు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది మన పిల్లలకు అందించే బ్యాంక్ బ్యాలెన్స్ లాంటిదని గుర్తుంచు కోవాలన్నారు. పారిశుద్యం మనందరి బాధ్యత అని, ప్రజలు స్వచ్ఛతను పాటించాలని అన్నారు. అంటువ్యాధులు దూరంగా ఉండాలంటే ఇది తప్పదని అన్నారు. ప్రజలందరూ ముందుకు వచ్చి స్వచ్ఛందంగా తమ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. ఇంటి వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలు నాటి పర్యవరణాన్ని పరిరక్షించుకొని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. గ్లోబల్ వార్మింగ్‌తో దేశ రాజధాని ఢిల్లీలో నివసిస్తున్న ప్రజలు నెలల తరబడి బయటకు వెళ్లని పరిస్థితులు నెలకొంటాయని రాబోయే కాలంలో రాష్ట్ర ప్రజలకు కూడా అదే పరిస్థితి రావద్దనే ఉద్దేశంతో మనమంతా బాధ్యతగా మెలగాలని అన్నారు. అటవీ సంపదను పెంపొందించడంలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. అడవులను నరకడం వల్లనే ఇవాళ అనేక అనర్థాలు వచ్చాయని అన్నారు. ఖాళీ స్థలాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటాలని పోచారం పిలుపునిచ్చారు. అవసరమైనన్ని మొక్కలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని ఒక వేళ కొరత ఏర్పడితే ప్రత్యేక నిధులను కేటాయించి మొక్కలను కొనుగోలు చేసి సరఫరా చేస్తామన్నారు. అధికంగా మొక్కలు నాటి పర్యావరణంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలపాలన్నారు. వంద శాతం మొక్కలను నాటి త్వరగా జిల్లాను మొదటి స్థానంలోకి తీసుకురావాలన్నారు. మహనీయుల పేరిట మొక్కలు నాటించాలన్నారు. పుట్టిన రోజు, పెళ్లి రోజులు, స్మారక దినోత్సవాలు, జయంతులు, వర్ధంతులు, మహనీయుల పేర్లతో మొక్కలు నాటితే విద్యార్థుల జ్ఞాపకశక్తి పెరుగుతుందని అన్నారు. అధికారులు బాధ్యతగా పని చేస్తేనే అది విజయవంతం అవుతుందన్నారు.

## పోలీస్ కస్టడీలో ఉన్న
# నిందితుడు పరార్

- విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు

**భైంసా ఆగస్టు 16 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో మారణాయుధాలతో పట్టుబడిన ఒక వ్యక్తి అరెస్ట్ చేసినట్లు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ విలేకర్ల సమావేశంలో తెలిపారు. నిన్న రాత్రి పోలీసులు పాత చెక్‌పోస్ట్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి పోలీసుల వాహనం చూసి పారిపోతుండగా అతన్ని వెంబడించి పోలీసులు పట్టుకొని చెకింగ్ చేయగా అతని దగ్గర ఆయుధం దొరికింది అతనిని విచారించగా నేను గత మార్చిలో ఒక వ్యక్తిని చంపిన కేసులో రిమాండ్‌కు వెళ్లి బెయిల్ పై వచ్చినాను నేను చంపిన వ్యక్తి కుటుంబ సభ్యులు నాపై దాడి చేస్తారని అనుమానంతో ఈ ఆయుధం తెచ్చుకున్నారని తెలియజేశాడు ఇట్టి విషయాన్ని పట్టణ ఏ ఎస్ పి అవినాష్ కుమార్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు. విలేకర్ల సమావేశం ముగిసిన కొన్ని గంటల్లోనే నీరు తాగుతానని అనడంతో అక్కడి నుండి సిబ్బంది నీరు తీసుక వచ్చే లోపే నిందితుడు పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకొన్న భైంసా పోలీసులు షాక్ అయ్యారు. నిందితుని పరారీతో భైంసా పోలీసులు నిందితుడు కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. పట్టణంలోని అన్ని సీసీ కెమెరాలు పోలీసులు పరిశీలిస్తున్నారు.

# ప్రపంచకప్ మేం నిర్వహించలేం

- ఐసీసీకి ఊహించని షాక్ ఇచ్చిన జైషా



**న్యూఢిల్లీ, ఆగస్ట్16 (జనంసాక్షి) :** మహిళల టీ20 ప్రపంచకప్ బంగ్లాదేశ్‌లో జరగనుంది. అయితే, ప్రస్తుతం బంగ్లాతో పరిస్థితులు అంత అనుకూలంగా లేవు. దీంతో బంగ్లా ఆతిథ్యంపై ప్రశ్నలు మొదలయ్యాయి. దీనిపై ప్రస్తుతానికి ఐసీసీ కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే, ఈ ఐసీసీ ఈవెంట్ బంగ్లా నుంచి తరలొచ్చని అంటున్నారు. ఈ క్రమంలో బీసీసీఐ కార్యదర్శి జైషా కీలక స్టేట్‌మెంట్ చేశాడు. బీసీసీఐ కార్యదర్శి జయ్ షా ప్రకారం, మహిళల టీ20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా లేదని తెలుస్తోంది. ఈ ఐసీసీ ఈవెంట్‌ను చేపట్టేందుకు భారత్ నిరాకరించింది. బంగ్లాదేశ్‌లో ఈ టోర్నీ అక్టోబర్‌లో టోర్నీ జరగనుంది. విద్యార్థుల నిరసనల కారణంగా ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లవలసి వచ్చింది. ఇది తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటుకు దారితీసింది.బంగ్లాదేశ్‌లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు మహిళల టీ20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యమివ్వగల అవకాశాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. రాజకీయ అస్థిరత కారణంగా మరో దేశం ముందుకు రావచ్చని ఊహాగానాలు వచ్చాయి. భారతదేశం, శ్రీలంక, యూఏఈ సాధ్యమైన ఎంపికలుగా పరిగణిస్తున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జై షా భారత్ నిర్ణయం గురించి చెప్పుకొచ్చాడు. మహిళల టీ20 ప్రపంచకప్‌ను భారత్‌లో నిర్వహించాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అభ్యర్థనను తిరస్కరించామని తెలిపాడు. వచ్చే ఏడాది మహిళల వన్డే ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇవ్వడానికి భారత్ ఇప్పటికే సిద్ధంగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో టీ20 ప్రపంచకప్‌ను నిర్వహించేందుకు అవకాశాలు తక్కువగా ఉన్నాయంటూ తెలిపాడు.

## దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ఘటనలో
# డిఐ రామిరెడ్డి సహా నలుగురు పోలీసులపై ఎఫ్ఐఆర్

- బాధితురాలు సునీత ఫిర్యాదుతో కేసు నమోదు



షాద్ నగర్ (జనంసాక్షి) రంగారెడ్డి జిల్లా షాద్ గర్ లో సునీత అనే దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటనకు సంబంధించి బాధ్యులైన డిఐ (డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ) రామిరెడ్డితో పాటు మరో నలుగురు పోలీసులపై కేసు నమోదైంది. బాధితురాలు సునీత ఈనెల 10 వ తేదీన ఫిర్యాదు చెయ్యడంతో ఎస్సి ఎస్టీ తో పాటు, పలు సెక్షన్ల కింద ఎఫ్ ఐఆర్ నమోదు అయ్యింది. అయితే పోలీసులు మాత్రం దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. నాగేందర్ అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం చేశారనే నెపంతో గత నెల జులై 30న షాద్ నగర్ డీఐ రామిరెడ్డి, మరో నలుగురు పోలీసులు తమ ఇంటి వద్దకు వచ్చి తనతోపాటు భర్తను, కొడుకును, పోలీస్ స్టేషన్ కు తరలించి చిత్రహింసలకు గురిచేసినట్లు సునీత ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఇప్పటికే డీఐ రాంరెడ్డి సహా బాధ్యులైన పోలీసు సిబ్బందిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే ..

# కొండెక్కిన పూల ధరలు

- శ్రావణ మాసం వేళ ధరల పెరుగుదల



**హైదరాబాద్, ఆగస్ట్16 (జనంసాక్షి) :** శ్రావణ మాసం వచ్చిందంటే ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. ప్రతి ఇంట్లో పూజలు, నోములు, వ్రతాలు శుభకార్యాలతో మార్మోగుతాయి. ఈ శ్రావణంలో ప్రతిరోజూ పూజా కార్యక్రమాలతో పాటు పలు శుభకార్యాలు.. వివాహ ముహూర్తాలు, గృహప్రవేశాలు, నిశ్చితార్థాలు, నూతన వ్యాపార ప్రారంభోత్సవం.. శ్రావణమాసంలో లేదా కార్తీక మాసంలో ఎన్నో శుభకార్యాలు జరుగుతాయి. పువ్వుల ధరలు ఆ స్థాయిలో పెరిగాయి కాబట్టి ఎక్కువ పూల పరిమళాలు వెదజల్లే ఇల్లు ధనవంతుడిలా ఉంటుంది. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని నగరంలోని పూల మార్కెట్లు కిటకిటలాడాయి. నగరవాసులు తెల్లవారుజాము నుంచే పూల కోసం మార్కెట్లకు పోటెత్తారు. బంతి, చామంతి, కనకాంబర, తామరపూలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఒక జత రూ.30కి లభించే కమలాలు నేడు దాదాపు రూ.100కి చేరాయి. గత నెల మల్లెలు కిలో రూ.550 ఉండగా ప్రస్తుతం రూ.1500 పలుకుతోంది. తెల్ల చామంతి రూ.200 నుంచి రూ.350, కనకాంబరం రూ.100 నుంచి రూ.300, పసుపు చామంతి రూ.150 నుంచి రూ.400, కలువ రూ.150 నుంచి రూ.500, జాజులు రూ.300 నుంచి రూ. .1,200 పలుకుతుండటంతో శ్రావణ మాసం కావడంతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. మరోవైపు అమ్మవారికి పూల మాలలకు గిరాకీ ఎక్కువైంది. పూజలో ఉపయోగించే దండలను మరింత అందంగా తీర్చిదిద్ది మార్కెట్ లో అందుబాటులో ఉంచారు. అరటి కొమ్మలు, తమలపాకులు, అలంకరణకు ఉపయోగించే అన్ని రకాల పూలను కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అయితే సామాన్య ప్రజలు ఏ పువ్వుల ధరలు చూసిన అమ్మో.. అనే పరిస్థితి ఏర్పడింది.

# వాజ్‌పేయికి ఘననివాళి

(మంచిర్యాల బ్యూరో /జనంసాక్షి)



మంచిర్యాల పట్టణంలో ఈరోజు భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, దేశ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజెపేయి ఆరవ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళు లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముల్కల మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ దేశానికి ఎనలేని సేవలు అందించిన గొప్ప నాయకుడని, తన జీవితం మొత్తం దేశానికి అంకితం చేశారని, వారు లేని లోటు పూడ్చ లేనిదని కొనియాడారు. అవే అడుగుజాడల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ముందుకు నడవాలని, వారి ఆశయాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. మరో సీనియర్ నాయకుడు తులాభాస్తంలో మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్పేయి బ్రహ్మచారిగా ఉంటూ 1968 73 మధ్యలో జన సంఘం పార్టీకి అధ్యక్షులుగా , తదుపరి వచ్చిన పరిణామాల ద్వారా ఏర్పడిన భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా 1980 నుండి 86 వరకు పని చేస్తూ విశేషమైన సేవలు పార్టీకి అందించారని అన్నారు. అటల్ బిహారీ వాజ్పేయి ఎల్కే అద్వానీల నాయకత్వంలో వేసిన విత్తనాలే , మొలకలై భారతదేశమంతా భారతీయ జనతా పార్టీ బలోపేతమైందని మూడుసార్లు వరుసగా ప్రభుత్వాన్ని ఏర్పరచుకో గల శక్తి భారతీయ జనతా పార్టీకి వచ్చిందని తెలిపారు. ప్రతిపక్షాలు మెచ్చిన ఏకైక నాయకుడు ఈ దేశంలో అటల్ బిహారీ వాజ్పేయి మాత్రమేనని అన్నారు. భారత పార్లమెంటులో ఉత్తమ పార్లమెంటేరియన్ తో పాటు భారతరత్న ఇస్తూ ఈ దేశము లో సముచిత స్థానాన్ని దేశ ప్రజలు కల్పించారని అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయడం వల్ల ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉండటం వల్ల వాజ్పేయి రెండుసార్లు 1996లో 13 రోజులు, 1998లో 13 నెలలు మెజారిటీ లేక పార్టీలకూటమి ద్రోహం చేస్తే, తృణప్రాయంగా పదవిని వదిలిపెట్టి తిరిగి ఎన్నికలకు వెళ్లిన , విలువలు గలగొప్ప ప్రజాస్వామిక వాది అని పొగిడారు. వాజ్పేయి జన్మదినము సందర్భంగా ఈ దేశంలో సుపరిపాలన దినంగా ప్రభుత్వమే ఘనంగా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు ముల్కల మల్లారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు గోలి రాము, మాజీ జిల్లా అధ్యక్షులు మున్నారాజ సిసోడియా, బిజెపి సీనియర్ నాయకులు తులా మధుసూదన్ రావు, లింగన్నపేట విజయకుమార్, అమిరిశెట్టి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మిదేవికి, గోమాతకు పూజలు చేసిన ఉప్పల దంపతులు

**హైదరాబాద్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** సకల కళా సంపన్నమైన శ్రావణ శుక్రవారమని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త తెలిపారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆడపడుచులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే లక్ష్మి దేవి కి , గోమాతకు ఉప్పల దంపతులు పూజ చేశారు. ఈ సందర్భంగా తమ నివాసంలో పూజా అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఉప్పల స్వప్న మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ముఖ్యంగా మహిళలకు శ్రావణ మాసం ఎంతో విశిష్ఠమైనదని, ప్రతి ఒక్కరి ఇంటా లక్ష్మీ దేవి కరుణా కటాక్షం కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నానని వారు తెలిపారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370